
ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు

8-4-'53



చేపలకోసం

ఫొటో — శ్రీ జి. యన్. భూషణ్ (మద్రాసు.)

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

సంపుటము 45
సంచిక 32
8-4-53

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

విజయ చైత్ర బహుళ నవమి; బుధవారం



తాజమహలు

ఫోటో :— శ్రీ ఎమ్. బ్రహ్మయ్య (శాస్త్రులు.)

ఈ శశిశిలా వితర్దిపై నిట్లు నిలచి
శారదైకాదశీ నిశీ శాంత వేళ
మహాలు తిలకించు నాకేదో మధుర మధుర
స్వప్నమట్టులుతోచు నీ ప్రాంతమెల్ల.

...అపుడు నా కనిపించు, మహాలు మలచిన
ప్రతి మహాశిల్పి యొక్కొక్క భగ్న ప్రేమి
కుడయి యుండనోపునని, లేకున్న నింత
ప్రేమమై శాశ్వతమ్మెట్లు రూపొందునంచు.

విషయానుక్రమణిక

ముఖచిత్రం :- ప్రసాద్ ఆర్ట్ పిక్చర్సు వారి "పెంపుడు కొడుకు" లో పుష్పవల్లి

దత్తత


(నవల)

*

రచన: శ్రీ పినిసెట్టి శ్రీరామమూర్తి

*

ఆంధ్రపత్రిక సచిత్ర వార పత్రిక 15-4-53 బుధవారం సంచిక నుండి శ్రీ పినిసెట్టి శ్రీరామమూర్తిగారు రచించిన "దత్తత" అనే నవల సీరియల్‌గా ప్రచురించ బడు తుంది.



ధనపతివీవు ; మేము వివిధ
ప్రకృతి పుంజపదార్థతత్వ శా
సనులము; - నీవు శూరుడవు ;-
చండతర ప్రతివాదగర్వభం
జనులము మేము ; - నిన్ను ధన
శాలులు, మమ్ము భజింతురాశ్రితుల్ ;
వినయము సేయవేని పృథివీవర
పోగద మీక్షణంబునన్"

తా॥ నీవు ధనమునకు అధిపతివి;—వివిధ శాస్త్రసముదాయములోని శబ్దార్థతత్వము లను నిర్ణయించి శాసించేవారము మేము;— నీవు శౌర్యం కలవాడవు ;-ఎదిరించి వాదించేటటువంటి మూర్ఖులగర్వమును ప్రచండముగా పటాపంచలు చేయ గల వార ము మేము ;-ధనికులు నీచుట్టూ చేరి ; నిన్ను కొనియాడుతూ ఉంటారు ; మా జ్ఞానోపదేశములను పొందగోరిన ఆశ్రితులు మాయెడల భక్తితో ఉంటారు. కనుక ఓరాజా ! మాయెడల నీవు వినయభావమును చూపించనియెడల, యీక్షణమే నీకొక సలాంచేసి నిష్క్రమిస్తాం—

నృపతి సన్నిధికి యతియైనవాడు తనయంతట తాను వచ్చినవాడై (అనగా పిలువని పేరంటముగా వచ్చినవాడై), "ఓరాజా ! నీవు నన్ను గౌరవించనియెడల, ఇప్పుడే యిదిగో నీ సన్నిధినుండి, నీరాజసభలోనుండి నిష్క్రమిస్తున్నాను" అని సభలోనుంచి అధిక్షేపణ సూచకముగా తన పరివారంతో ఆ పరివ్రాజకుడు బయటకు వెళ్ళిపోతానని బెదరించినందువల్ల రాజు భయపడునా ? భయపడవలసిన అవసరమున్నదా ?


ఈ వాకౌటు(*Walk-out*) వల్ల రాజుకు కలిగేనష్టము ఏదో కొంత ఉన్నప్పుడే, రాజు భయపడవలసిన అగత్యం ఉంటుంది. ఆవిషయమును రాజు అనగా ప్రభుత్వాధిపతియైనవాడు బాగా గ్రహించని సందర్భంలో, అట్టి ప్రభుత్వాధిపతికి ఆవిషయమునుగూర్చి హెచ్చరిక చేసేనిమిత్తమై యతీశ్వరుడు,రాజుతో యింతదూరం సంభాషించవలసివచ్చింది. దీనినిబట్టి చూస్తే, మహర్షులు గాని యోగిపుంగవులుగాని, కేవలం సన్యాసులుగాని ఎందుకూ పనికిరాని సన్యాసులు కారని అర్థమౌతోంది. వారికి ప్రభువులతోను, ప్రభుత్వ వ్యవహారాలతోను చాలావరకు సంబంధం ఉంది. అందువల్ల వారే తమంతట తాము తరచుగా, రాజుల వద్దకు వెళ్ళి వారు ఏ ధోరణిలో ఉంటున్నారో తనిఖీ చేసివస్తూఉండడం సంభవించేది. రాజుయెదుట సవాలుచేసిన యతి రాజు చెప్పినటువంటి పై పద్య తాత్పర్యమును బాగా పరిశీలించిచూస్తే ఒక్క విషయం ప్రియముక్కగా చిట్టచివరి వాక్యంలో బోధపడుతోంది. "రాజా! నీ చుట్టూ చేరేటటువంటివాళ్ళు ధనసాధ్యులు. కాని, మా చుట్టూ చేరేటటువంటి వారు మావల్ల జ్ఞానోపదేశమును పొందగోరిన ఆశ్రితులు" అని స్పష్టంగా తెలియజేశాడు. కనుక నీవుకూడా మాయెడల వినయమును చూపించి మాకు ఆశ్రితుడవు కానియెడల, మేము ఇక్కడినుంచి వెళ్ళిపోతాము" అన్నాడు. దీని అర్థం ఏమిటి? "ఓ రాజా! నీవుకూడా మా ఆశ్రితవర్గంలో చేరి,మావల్ల జ్ఞానోపదేశం పొందుతావా? మా జ్ఞానోపదేశం నీకు అక్కరలేదా?" అని రాజుకంటె మహారాజయోగం పొందిన సన్యాసుల వారు రాజుకు ప్రశ్నించారు.

ఈ విధంగా ఒకప్పుడు రాజుల వద్దకు పీఠాధిపతులు వెళ్ళి ప్రశ్నించారు. దేశంలో ఉండే రాజులు శైవగురువులనే శిరసావహించి శైవమతమునే దేశములో వ్యాపింపచేశారు. ఆనాటి శైవమతగురువులలో గొప్ప విద్యాంసులు, తత్వవేత్తలు, యోగవిద్యా ప్రభావములు కలవారు ఉండేవారు. శైవ గురువులైన సిద్ధులలోకూడా చాలా గొప్ప తపస్సంపన్నులు మేధానిధులు తత్వవేత్తలు

ఉండేవారు. బౌద్ధులలో కూడా నాగార్జునాచార్యుడు మొదలైన సకలశాస్త్ర పారంగతులు ఉండేవారు. ఈ వీరశైవులు, మహావీర గురుపరంపరాశ్రితులైన జైనులు, బుద్ధభగవానునిచే ప్రబోధితులైన బౌద్ధగురువులు సన్యాసులు ఆ కాలమందు దేశమంతటను తిరిగి తమ తమ మతప్రచారాలు విరివిగా సాగించారు. శైవమతాన్ని శైశవంనుంచి అవలంబించిన రాజులను జైనమతంలోకి ఆకర్షించిన జైనసిద్ధులు ఉన్నారు. జైనమతాభిమానులైన రాజులకు బౌద్ధమతాభిమానం కలిగేటట్లుగా చేయడం బౌద్ధులకొక ఘనకార్యంగా ఉండేది.

ఈబౌద్ధమతాన్ని దేశంలోనుంచి వెళ్ళగొట్టేవరకు జగద్గురు శంకరాచార్యులవారు నిద్రపోలేదు. ఆయన దేశమంతా సంచారం చేశారు. గొప్ప గొప్ప పండితులతో వాదతర్కములు అనేక శాస్త్రాలలో చేసి వేదములనే ప్రమాణంగా స్వీకరించిన ఆరుమతాలకుమాత్రము యీదేశంలో నిలువనీడను కల్పించి, వేదప్రామాణ్యమును అంగీకరించని బౌద్ధమతాన్ని గయలోనే గయాఅయ్యేటట్లు చేశారు. ఇదంతా జగద్గురు శంకరాచార్యులవారి దిగ్విజయయాత్ర అన్నారు: అటువంటి మేధాశక్తిగలవాడు, ప్రపంచం పుట్టిన తర్వాత యింతవరకూ తిరిగి పుట్టలేదన్నారు. ఆయన మేధాశక్తివల్ల, బౌద్ధమతాన్ని ఖండించి, దేశంలో దానికి నామరూపాలులేకుండా తన యుక్తివాదనలతో మర్దనచేశాడేగాని, ఆమర్దనవల్ల ఆ బౌద్ధమతసారం అంతా శంకరాచార్యులవారిలోనికి ఎక్కి జీర్ణమైపోయింది. ఆముదపుగింజలను త్రొక్కి చమురు తీయుటకై మర్దన చేసినవాని శరీరంలోనికి ఆముదం బాగా యినికిపోయినట్లుగానే, బౌద్ధమతసారం చాలావరకు ఆ శంకరాచార్యులవారి తత్వోపదేశ సారంలో కన్పిస్తూ ఉన్నదని తత్వపరిశీలనచేసే తజ్ఞులు అన్నారు. శంకరాచార్యులవారు జయించిన మతాన్ని జీర్ణించుకొన్నారని అర్థం. బౌద్ధమతం ఇక్కడ శిథిలమై జీర్ణమైపోయినా శంకరాచార్యులవారి వేదప్రామాణ్య సిద్ధాంతసారంలోనే ఆ బౌద్ధమతం జీర్ణమైపోయింది. అందువల్లనే, ఆయన పైకి వేదమత ప్రబోధకుడుగా కన్పించినప్పటికీ, ప్రచ్ఛన్న బౌద్ధుడని అన్నారు. వేదమతోద్ధారకుని రూపంలో దాగియున్న బౌద్ధమతస్థుడని అన్నారు.

బుద్ధుడు రాజవంశంలో పుట్టినటువంటివాడు. రాజ్యానికి అధికారి కావలసిన యువరాజు. అటువంటివాడు అయిహిక సంపదలమీద విరక్తి కలిగినవాడై, రాజుల యొక్క అయిశ్వర్య గర్వమును, ప్రజల దారిద్ర్యమును, ప్రపంచములో ప్రబలియున్న ప్రాణిహింసను చూచి వీని నన్నింటిని నిర్మూలించవలెనన్నాడు. సామ్రాజ్యాధిపత్యమునకంటె, ఆత్మ సామ్రాజ్యాధిపత్యమే గొప్పదని గ్రహించాడు. ఆత్మ సామ్రాజ్యాధిపత్యం పొందడానికి తపస్సుచేసి అఖండమైన ఆత్మప్రబోధం పొంది తారకమంత్రం లభించినదన్నాడు. "అహింసా పరమోధర్మః" అన్నాడు. అహింస ఒక్కటే పరమోత్కృష్టమైన ధర్మం అన్నాడు. హింసచెయ్యకపోవడమే అహింస, అని అర్థంచెప్పినంతమాత్రంచేత అది ఎట్లా సాధ్యమవుతుంది? ఏప్రాణినీ చంపకూడదు అని అర్థం చెప్పినట్లయితే, అది ఎట్లా సాధ్యమవుతుంది? ఒక ప్రాణిని తిని యింకో ప్రాణి జీవిస్తోంది. కోడిగ్రుడ్లు తినవచ్చునా? అందులోఉన్న జీవధాతువులు కూరగాయలలోకూడా ఉన్నాయి—తోటకూర కాడలను పెళ్ళగిస్తే తోటకూర చెట్లను చంపి తినడమే అవుతుంది. పశువులకున్న ప్రాణం ఒకవిధమైనది. వృక్షములకున్న ప్రాణంయింకొకవిధమైనది. కాని, అవీ ప్రాణులే, యివీ ప్రాణులే - మాంసాహారం విరమించి శాకాహారం అనుసరిస్తే, అందువల్ల శరీరానికి ఎక్కువ శ్రేయస్కరం అనివాదించవచ్చు. లేదా కొన్ని రకములైన శాకములను తినుటవల్ల బుద్ధిమాంద్యం లేకుండా మెదడు చురుకుగా పనిచేస్తుందని వాదించవచ్చు. మాంసాహారము స్వీకరించినట్లయితే, దానికి అనుపానంగా మద్యంకూడా స్వీకరించడం అవసరం కావచ్చు - అభ్యాసం కావచ్చు. చీట్లపేక ఆట డబ్బుతో ఆడి జూదంలోకి దిగవచ్చు - మద్యపానం మూలంగా మత్తు ఎక్కి చిత్తవికాసం కలుగకపోవచ్చు - ఈవిధంగా ఆత్మవికాసంకోరకై బుద్ధివికా



ఎండవేళ

ఫోటో — శ్రీ వి. తంబీ (కర్నూలు).

అడవిదుంపల అన్నం

భోజనమునకు అనగా అన్నమువలె వండుకొని తినుటకున్నూ, అటువంటి అన్నములో ఇతర కూరలు, పులుసు, పచ్చళ్లు, ఊరగాయలు, పాలు, పెరుగు వగైరా కలుపుకొని తినుటకున్నూ మంచి అనుకూలమైనధాన్యాలు కొన్ని ఉన్నాయి. బియ్యం, జొన్నలు, గోధుములు వగైరాలతో వరి అన్నం, జొన్న అన్నం, గోధుమ అన్నం వండుకొని తినవచ్చు. అదేరీతిగా "యర్ల గడ్డ" అనబడే దుంపలనుకూడా ఉడకబెట్టి అన్నమువలె పాకము చేసి తినవచ్చు. ఇది తీగజాతి- "యర్లగడ్డ"కు తీగెలు తమల పాకుల తీగెలవలె విస్తరించును. ఈ దుంపలను చిన్న కుండలో పెట్టి దానిచుట్టు గడ్డి మంట వేసి కాల్చి తినవచ్చు. దీనితో పుట్టతేనెను కలిపి తినినయెడల రెండుమూడు రోజులవరకు ఆకలిబాధ యుండదని శ్రీ బాలరాజు మహర్షిగారు పరిశోధించి గ్రహించారు. ఈ గడ్డలను నీటిలో ఉడకబెట్టినప్పుడు ఆ గడ్డలు చిన్నచిన్న ముక్కలుగా చీలిపోయి చిట్టచివరకు అన్నమువలెనే పాకము తయారవుతుంది. అడవి జాతులవారు, ఎత్తయిన కొండలమీద ఎక్కునప్పుడు వారికి గుండె నొప్పి కలుగుతూ ఉంటుంది. ఈ యర్ల గడ్డలను ఉడకబెట్టి తింటే వారికి ఆ గుండెనొప్పి పోతుంది. కనుక గుండె సంబంధమైన జబ్బులకు యిది ఎంతవరకు పనిచేయునో శ్రీ బాలరాజు మహర్షిగారు పరిశోధిస్తున్నారు.

★ కాలక్షేపం ★

వంకొరకై సాధకం చేసేటటువంటి సాధకుడు కొంత ఆహార నియమంగాని, ఆహారపథ్యంగాని అనుసరించ వలసిఉంటుంది. ఈవిధంగా సహేతుకంగా వాదించినటువంటి వేదమతంలోనే, ఆ వేద మత కాలంలోనే పవనపర్ణాంబు భక్షులైన మహాతపస్సంపన్నులు దివ్యమైన ఆత్మశక్తిని సాధించారు. ఆకులు మాత్రమే తింటూ కాలంగడిపారు. రవ్వంత ఉప్పువేసికొని నీరు మాత్రమే త్రాగి తపస్సు చేశారు. కొందరు కేవలం ప్రాణాయామ మాత్రముల మూలంగా గాలిని బంధించి వాయుభక్షులై పరమహంసలైనారు. కాబట్టి బుద్ధుడు వచ్చి తన బౌద్ధమతం బోధించక పూర్వమే వేదమతం ప్రకారంగా, "శాంత రసమొల్కు బ్రహ్మతేజం"పొందినటువంటి మహర్షుల అహింసా ధర్మానుష్ఠానంలో ఉన్న అంతరార్థాన్ని అద్భుతప్రభావాన్ని చూపించారు. లోకానికి ఋజువు చేశారు కనుక బౌద్ధమతం వచ్చి వేదమతంలో లేని క్రొత్తవిషయం ఏమీ బోధించ లేదు. బుద్ధుడు వచ్చి యీ ఉపదేశం చెయ్యడం కోసం, వేదములను చెత్తకాగితాలబుట్టలో దాఖలు చేయవలసిన అగత్యం లేదని జగద్గురు శంకరాచార్యులవారు చాటించారు. బుద్ధుని అంతటివాడుకూడా వేదమతాన్ని త్రోసి రాజని చెప్పి, వేదమతంలో లేనటువంటి కొత్తవిషయం ఏదో తాను కనిపెట్టి బోధించినట్లుగా ప్రచారంచేయడం శుద్ధ తెలివి తక్కువ అని శంకరాచార్యుల వారు ఋజువు చేశారు. ఆయన చెప్పిన మాట తప్పు అనలేక బౌద్ధులు తెల్లమొగము వేశారు. బుద్ధుడుకూడా జీవించి ఉన్నట్లయితే, ఆయనకు జవాబు చెప్పలేక శుద్ధబుద్ధావతారం అయ్యేవాడు.

ఇంతకూ చెప్పవచ్చిందేమిటంటే, "శంకరునియందు బౌద్ధమతం జీర్ణంఅయిపోయింది" అనడంలో అర్థంలేదు. శంకరుడు ఏ వేదమత సారాన్ని లోకానికి వెల్లడించాడో ఆ వేదమత సారములోనే బౌద్ధమతసారం యిమిడిఉంది. అదివరకే జీర్ణించి ఉంది.

ఈ వేదమత సారమునుగురించియే వేదాంత ఉపన్యాసములుగా అమెరికాలోని చికాగో నగరమందు జరిగిన అఖిలప్రపంచ సర్వమత మహాసభారంగమందు వివేకానందస్వామి విస్తరించి వివరించియున్నాడు. ఆనాడు అమెరికా వాసులు కళ్లుతెరచి చూశారు. భారత దేశంలో ఉన్న వేదాంత విజ్ఞాన సంపద చాలా గొప్పదన్నారు. భారత భూమి అంటే వివేకానందస్వామి వంటి వివేకసంపన్నులకు పుట్టినిల్లు అన్నారు. ఇంతకూ అక్కడ వివేకానందుడు బోధించిన వేదాంతసారసంగ్రహసారాంశం ఏమిటయ్యా అంటే, ప్రపంచంలో ఉన్నటువంటి ఆయా మతములలో ఉన్న జ్ఞానబోధ అంతా యీ వేదాంతమతంలో ఉన్నదన్నారు. అంతే కాదు, మీదు మిక్కిలి, ఆయా వివిధమతాలలో ఉన్న జ్ఞానబోధకంటే ఇంకా ఎక్కువైన విషయాలే యీ వేద మతంలో ఉన్నాయని చూపించినారు. దీనినిబట్టి చూస్తే బౌద్ధమత సారం వేదమతంలో అంతర్భాగమే – క్రయిస్తవమతసారం కూడా వేదమతంలో అంతర్గతమే. మహమ్మదీయ మతంలోని జ్ఞానబీజాలన్నీ వేదమతంలోనే ఉన్నాయి –

అందుకనే గాంధిమహాత్ముడు తన సాయంకాల భగవత్ప్రార్థన సమావేశాలలో కొంచెం భగవద్గీత, కొంచెం కొరాను, కొంచెం బైబిలు వగైరా చదివించి చాచామతాభిమానంచూపించేవాడు. ఇందువల్ల గాంధీమతం శంకరమతం కాదు. గాంధీతత్వం ఏమిటో నిర్ధారణ చేయుటకు వీలులేని, శాస్త్రీ తెలియని కర్త్రీ సరుకు కాదు. యీ విధమైన భిన్నమత గ్రంథ పారాయణంమూలంగా ఏమతంలో నూ విశ్వాసం ఏర్పడదని కొందరు పెద్దలు వాదించినారు. కాని, ఏనుగు పాదంలో అన్ని జంతువుల పాదములు యిమిడియుండ

గలవు-ఏ జంతువు యొక్క పాదము సైజు అయినప్పటికీ, ఏనుగు పాదం సైజులో యిమిడి ఉండునే గాని, దానిని అతిక్రమించి యుండదు. వేద మతంలో యిమిడిఉన్న యితర మత బోధలను వేదమతం ఏనాడో తన కడుపులో జీర్ణం చేసికొన్నది. ఈ కారణంవల్లనే యీ దేశానికి క్రయిస్తవ మతస్థులు వచ్చి ప్రచారం చేసినప్పటికీ, క్రయిస్తవులైన ఆంగ్లేయ ప్రభువులే యీ దేశాన్ని పాలించినప్పటికీ, వేదమతానికి మించిన కొత్త విషయాలను బోధించి ప్రజాబాహుళ్యాన్ని ఆకర్షించలేక పోయినారు. మహమ్మదీయ ప్రభువులు వచ్చి పరిపాలించినప్పటికీ, మహమ్మదీయ మతంలోనికి చేరవలసినదిగా ప్రజలను మర్దించినప్పటికీ, ఆ మహమ్మదీయ మతంలోనికే వేదమతసారం ఎక్కింది. "రాముడే రహీం" అన్నాడు కబీరు. రామానందుని శిష్యుడే కబీరు. కబీరు శిష్యుడే భద్రాచల రామదాసుగారు. ఆ మహమ్మదీయ ప్రభువులే హిందూ దేవాలయాలలో పూజలు చేయించారు. కారణం ఏమిటి? వారి మతంలో ఉన్న సత్యం వీరు గ్రహించారు. వీరి మతంలో ఉన్న సత్యం వారు గ్రహించారు.

ఈ పరస్పర సత్య గ్రహణం ఉంటే, ఒక మతానికీ యింకో మతానికీ మధ్య ఘర్షణ ఉండదు. హిందువులో ఉన్న సత్యం మహమ్మదీయ ప్రభువులూ, మహమ్మదీయ ప్రభువులో ఉన్న సత్యం హిందువులూ గ్రహించి గౌరవించి మించిన మంచి రోజులు ఒకప్పుడు ఉండేవి. చక్కని ఒక్క ఉదాహరణం చూపవచ్చు.

ఒక ఊళ్ళో ఒక నవాబు ఉండేవాడు. ఆయన చాలావృద్ధు - 70 ఏళ్ళ వయస్సు దాటింది. ఆ నవాబుగారి కుమారులకు ఉర్దూలోను పారసీలోను పాఠం చెప్పడానికి ఆవూళ్ళో సమర్థుడైన మున్షీకోసం చాలా దరియాప్తుచేశాడు. చిట్టచివరకు ఒక నియమనిష్ఠాగరిష్ఠుడైన శుద్ధ ఛాందస బ్రాహ్మణోత్తముడు లభించాడు. ఆయనకు సంస్కృత సాహిత్యం ఎంత అనర్గళంగా కంఠస్థమో, ఉర్దూలోను పారసీలోను అంతటి అపారపాండిత్యం ఉండేది. ఉదాత్తానుదాత్త స్వరభేదములు తప్పకుండా వేదం ఎంత బాగా ఘనజటలతో సహా చెప్పేవాడో, అరబ్బీభాషలోని ఖొరానుకూడా అంత స్వచ్ఛంగా చదివేవాడు. ఉర్దూగాని, పారసీగాని మాట్లాడుతూ ఉంటే ఆయన ఫక్తు పాదుషాబిడ్డలాగున మాట్లాడేవాడు. దేవతలభాషను సాధించిన ఈ భూసురునకు మానవుల భాషలన్నీ కరబదరాయమాణంగా ఉండేవి. ఆయనలో ఉన్న ప్రతిభ అటువంటిది. ఏమైనాసరే ఆఛాందస బ్రాహ్మణ ప్రవీణునే రప్పించవలసినదని నవాబుగారి హుకుం జారీ అయింది. అన్యమతస్థుడనే ద్వేషం ఆ నవాబుకు కలుగలేదు.

ఈ బ్రాహ్మణ్ణి ఆ నవాబుగారి పిల్లలకు గురువుగా నిర్ణయించారు. దేవిడీకి వెళ్లి ప్రతిరోజూ ఆ పిల్లలకు పాఠం చెప్పివస్తూ ఉండేవాడు. ఆయనకు జీవనోపాధికి లోపం లేకుండా కాలం గడిచిపోతోంది. కాని, ఆయన కొక కోరిక ఉండేది. తన స్వగ్రామంలో అనగా తాను జన్మించిన ఊళ్లో తాను యథాశాస్త్రవిధిగా తన 60 వ ఏట షష్టిపూర్తి ఉత్సవం చేసికోవాలనిన్ని, ఆ ఉత్సవ సందర్భములో తన స్వగ్రామమందు ఒక శివాలయమును కట్టించవలెననిన్నీ కోరికగా ఉండేది. ఆయనకు యీ కోరిక కలిగినప్పుడే, ముసలి నవాబుగారితో మెల్లిగా మనవి చేశాడు. అందుకు అయ్యే ఖర్చుకు పదివేల రూపాయీలు కావాలన్నాడు. అందులో సగం నవాబుగారిని యివ్వవలసినదిగా మనవి చేశాడు. నవాబుగారు ఆ మున్షీబ్రాహ్మణ్ణి సంతోష పెట్టడమే తనకు సంతోషం అని తన కుమారుల యెదుట ఆ బ్రాహ్మణ శిఖామణితో అన్నాడు. ఆ మాట అందుకొని, ఆ బ్రాహ్మడు నవాబుతో యిల్లా అన్నాడు. "నాకు 50 సం॥లు వయస్సు వచ్చింది. తమకు 70 సం॥లు వయస్సు వచ్చింది. కనుక ఆ మొత్తమును మీరు యిప్పుడే యిస్తే దాచుకుంటానన్నాడు. అందుకు నవాబు నవ్వి "నీషష్టిపూర్తి నాటికి నేను ఉండనేమో అని భయపడవద్దు - మనిషి చచ్చినా, మాట సత్యం ఉండాలి. నా కొడుకులు యిద్దరియెదుట ప్రమాణంచేసి నీకు యీ వాగ్దానంచేశాను" అన్నాడు.

"అయితే తమరు మాట యిచ్చినట్లుగా ఏదైనా గుర్తుగా లిఖితంగా ఉండాలిగదా" అన్నాడు ఆ బ్రాహ్మణుడు -"సత్యంలేనివాడు స్వదస్తూరీతో వ్రాసి యిచ్చినా ప్రయోజనం లేదు" అన్నాడు నవాబు - "నామాటకు తిరుగులేదు, అడ్డంలేదు" అని ఒకనాడు తన గడ్డంలోని తెల్లని వెంట్రుక లాగి ఆ బ్రాహ్మణుని చేతికిచ్చి యిదే నా మాటకు గుర్తు అన్నాడు. ఆ బ్రాహ్మణుడు ఆ నవాబు గడ్డంలోని తెల్ల వెంట్రుకను ఒక భరిణలో పెట్టి భద్రంగా దాచిఉంచాడు. అది జరిగిన మరుసటి సంవత్సరమే నవాబుగారు మరణించారు. అటు పిమ్మట తొమ్మిదేండ్లకు ఆ బ్రాహ్మణునకు షష్టిపూర్తి ఉత్సవ సమయం సమీపించింది. అప్పుడు నవాబుగారి కొడుకుల వద్దకు వెళ్ళి నవాబుగారు జీవించియున్నప్పుడు చేసిన వాగ్దానంగురించి ప్రస్తావించాడు. మా నాయనగారు వాగ్దానం చేసినట్లుగా ఏమైనా సాక్ష్యాధారం వుంటే

(56-వ పేజీ చూడండి)

ప్రసన్నోస్తు

నరుడి తపస్సుకు మెచ్చుకుని
నారాయణుడు ప్రత్యక్షమై
"నరుడా! ఏమి నీకోర్కె,
నెరవేరుస్తా" నన్నాడు.

"దీనబంధూ! దయాసింధూ!
నాకనీసపు కోర్కె వినుమా:
ఆకలినుంచి
దానితాలూకు భయంనుంచి
నన్ను రక్షించు.
గల్లా పెట్టెనుంచి
దాని తాలూకు సంస్కృతినుంచి
నన్ను తప్పించు.
ఆధ్యాత్మిక "దివాళాకోర్ల" నుంచి
మానసిక "మరుగుజ్జుల" నుంచి
నన్ను విమోచించు.
కొన్ని కొన్ని సినిమాల నుంచి
కొందరు కొందరు నాయకుల నుంచి
పాహి పాహి దేవా!
నన్ను బ్రోవలేవా?"

ప్రార్థన విని పరమేశ్వరుడు
పలాయనం చిత్తగించాడు.

—సవ్యసాచి



శ్రీ భమిడిపాటి
శ్రీరామకృష్ణశర్మ

'ఛీ, దీని దుంపతెగ, బయలుదేరు తూంటేనే పిల్లి శకునమా!' అన్నాడు స్నేహితు డొకడు, పరీక్షలయ్యేక పట్నంనుంచి ఇంటికి బయలుదేరిన వీరాస్వామితో.

'పర్వాలేదులే-స్టేషన్దాకా వస్తావా?- ఊఁ, అయితే త్వరగా బండెక్కు—' అన్నాడు వీరాస్వామి గంభీరంగా.

'ఎందుకేనా మంచిది, కాస్సేపు కూర్చుని బయలుదేరరా భాయీ.'

'ఆఁ పోవోయ్, పల్లెటూరి బైతుల్లాగ నాకు ఆ మూఢవిశ్వాసాలు లేవు సుమా.'

'నువ్వు పుట్టి పెరిగిం దెక్కడో, ఇప్పుడు ఎక్కడికి వెళుతున్నావో మరచి పోయినట్టున్నావ్.'

'అయితే మాత్రం: ఇంత చదువు చదువుకునికూడా ఆ కంపే పీలుస్తూండాలేమిటి?'

'వద్దులేరా—నువ్వు ఏమంటావో అని అన్నానంతే.' అన్నాడు స్నేహితుడు; తనకు అలాంటి నమ్మకాలు వున్నా, వీరాస్వామి తన్ను మూఢు డనుకుంటాడేమో అన్న భయంతో.

స్టేషనుకు జేరేటప్పటికే రైలు బయలు దేరడానికి సిద్ధంగా వుంది. టిక్కట్టు కొని, లోపలికి వెళ్ళేటప్పటికి రైలు కదిలింది. స్నేహితుడు, 'వద్దురా—ప్రమాదం— తర్వాత బండికి వెళుదువుగానిలే—' అంటూన్నా వినిపించుకోకుండా వీరాస్వామి పరుగెత్తుకుంటూ వెళ్ళి రైలు ఎక్కబోయేడు. కాలు జారి ప్లాటుఫారంమీద పడ్డాడు. రైలు ఆగింది. వీరాస్వామికి ప్రమాదకరమైన దెబ్బలేమీ తగలలేదు. లేచి నుంచుని నూటు దులుపుకుంటున్నాడు. రైల్వేగార్డు వచ్చి, 'చదువుకున్న వాళ్ళే ఇలా చేస్తూంటే, ఇంక పల్లెటూరి వాళ్ళ ఏమాట విటి—మీకు ఏదైనా ప్రమాదం జరిగితే మా పీకలమీదకు కూడా వస్తుంది— ఇంకెప్పుడూ అలా చెయ్యకండి—' అని మందలించేడు.

'చదువుకున్న పెద్దమనుషులకే బాబూ, ఈ తలబిరుసు'అన్నాడు రైలు కిటికీలోంచి తొంగిచూస్తూన్న పల్లెటూరి వాడొకడు, తలపాగాలో ఇదివరకు సగం కాల్చి, ఆర్పి దాచుకున్న చుట్టముక్క తీసి వెలిగిస్తూ.

వీరాస్వామి అవమానంతో తలవంచుకుని రైలు ఎక్కేడు.

'పిల్లిశకునం, వద్దురా అంటే విన్నావా' అని ఎత్తి పొడిచేడు స్నేహితుడు, బైట నుంచి రైలుపెట్టె తలుపు మూసేస్తూ.

'ఆ. పోవోయ్; పిల్లి శకునం కనుకనే ఏమీ లేకుండా రైలు ఎక్కి కూర్చున్నాను. లేకపోతే, ఏ కాలో చెయ్యో తెగిపోయి వుండునేమో' అంటూ వీరాస్వామి సమర్థించుకున్నాడు. రైలు కదిలింది.

రైలుస్టేషనుకి, వీరాస్వామి పల్లెటూరికి మధ్య నాలుగు మైళ్ళ దూరం వుంది. ఉన్నది మట్టి రోడ్డు. అద్దెబళ్ళు కాని, రిక్షాలు కాని లేవు. కూలివాళ్ళు కూడా వుండరు. అయినా బాధ లేదు. సామానేదైనా వుంటే, వాళ్ళ వూరివాళ్లు ఎవరో ఒకరు, బ్రతిమాలి నెత్తిమీద పెట్టుకుని పోతారు. ఓ పైసా చేతిలో పెట్టి చుట్ట ముక్క కొనుక్కోమంటే, చాలా సంతోషిస్తారు. లేకపోతే అడగరు. వీరాస్వామి స్టేషన్లో దిగగానే, వాళ్ళ వూరి రామప్ప పంతులు 'రావోయ్, రావోయ్' అంటూ ఎదురుగా వచ్చేడు.

'సరి, స్టేషన్లో దిగగానే మళ్ళీ ఈ ఒంటి బ్రాహ్మడి శకునమా!'అని గుండెల్లో ఎక్కడో ఓసారి పొడిచినట్టయింది వీరాస్వామికి. కాని, లెక్కచెయ్య దలచుకో లేదు.

'రావోయ్, మా బండి వుంది; ఎక్కి పోదువుగాని' అన్నాడు మళ్ళీ రామప్ప పంతులు.

'పాపం, నాకోసమే తోలుకొచ్చినట్టున్నారు బండి' అన్నాడు వీరాస్వామి కొంచెం వెటకారంగా.

'లేదోయ్. మా ఆడవాళ్ళు రైలుకు వెళుతూంటేను, దిగబెట్టడానికి వచ్చేను. తిరిగి వెళ్ళిపోదామనుకుంటూంటే నువ్వు కనిపించేవు. పోనీ బండిమీదే వస్తావని'—

'అబ్బే, బండెందుకండీ, నడిచే వస్తాను' అన్నాడు వీరాస్వామి, రెండెడ్ల బండిలో ఎక్కడం అంత అవమానం ఇంకోటి వుండ దనుకుని.

'అబ్బే, నడిచి ఎలా వస్తావు, వాన పడింది కూడాను.'

'వాన పడిందా? చచ్చేమే!' అన్నాడు వీరాస్వామి నిస్పృహతో. వాన కురిస్తే దారంతా బురదబురదైపోతుంది. అందులో మాంచి రేగడి మట్టేమో; ఒక్కొక్క అడుగు వేసి తీసేటప్పటికి వున్న శక్తిఅంతా వుపయోగించవలసిందే. ఆ వూరి వాళ్ళు, అంత బురదలోనూ చకచకా నడిచి పోతారు. కొత్తవాళ్ళయితే మాత్రం, మధ్య మధ్య జారిపడుతూండకుండా నడవడం అసంభవం. వీరాస్వామికి చిన్నప్పటి నుంచీ అలవాటున్నా, ఇప్పుడు నూటూ, బూటూ వున్నాయి మరి. ఎలాగ?

'సరే, పోదామయితే, బండివాడిని పిలవండి'-అన్నాడు వీరాస్వామి విధిలేక.

'వెలాడికి పొలంలో పనుండి రాలేదోయ్. బండి నేనే తోలుకొచ్చేను – ఊఁ, ఎక్కు పోదాం'—

"ఈ పల్లెటూళ్ళవాళ్ళకి 'డిగ్నిటీ' అనేది తెలిసిచస్తే కదూ. ఏపనికి పడితే ఆ పనికే సిద్ధం." అనుకుంటూ బండిలో ఎక్కి కూర్చున్నాడు.

బండి, గతుకుల్లో పడి లేస్తూ మెల్లిగా సాగుతోంది. ఆ కుదుపుకు వీరాస్వామి ఒళ్ళు ముద్దయిపోతోంది. 'ఇదంతా పంతులు శకున ఫలితం కాదుకదా!' అన్న అనుమానం మళ్ళీ తళుక్కున మెరిసింది వీరాస్వామి హృదయంలో. "ఆ శకునం రాబట్టే అదృష్టవశాత్తూ బండి దొరికింది. లేకపోతే—" అని మెదడు సమాధానం చెప్పింది. ఇంకా ఎంతసేపు ఈ బండిలో పడి హూనమవాలో! ఎంత కష్టంగావుంటే మాత్రం ఏం చేస్తాడు? పట్నంలో తారు



గోడ్లమీద, మెత్తగా పాముల్లాగ జారిపోయే కాళ్లు జ్ఞాపకం వచ్చి—

'ఏమండీ పంతులుగారూ, ఇంక ఈ గోనుగుత్తి ఈ జన్మకింతే నేమిటి?' అని అడిగేడు.

'ఏమోనోయ్ - మన ప్రభుత్వం చెబుతూందిగా: 'మన దేశానికి గ్రామాలే వెన్నుపూస' అని. ఆ వెన్నుపూస ఇలాగే వుండాలి కామోసు, మాకేం తెలుస్తుంది చెప్పు.'

"అయితే, మీకుకూడా రాజకీయాలు బాగా తెలుస్తూన్నాయన్న మాట?"

'ఆ, మాకేం తెలిసి ఏడిసేయి లేవోయ్. ఏదో మీ బోటివాళ్లు వచ్చినప్పుడు ఓ మాట చెవిలో వేసి పోతూవుంటారంతే.'

'పోనీ ఓ పేపరు తెప్పించుకోకూడదు రోజూను.'

'అలాగే తెప్పించేం కొన్నాళ్ళు; మీ నాన్న ఓ రూపాయి, నేనో రూపాయి చందా వేసుకుని.'

'అంటే ఇప్పుడు మానేసేరన్న మాట?'

'అన్నమాటే - మొన్న దసరాలకి, ఆ కిష్టిగాడు, మా యింట్లోవున్న పాత పేపర్లన్నీ పట్టుకుపోయేడు, రామ మందిరానికి అంటించాలంటూను. దానికి మీ నాన్నకు కోపం వచ్చింది. 'అమ్మితే రూపాయి వచ్చును కాదా' అని గట్టిగా అడిగేడు. ఎందుకొచ్చిందీ లేనిపోని గొడవలని, అప్పటినుంచీ మానేసేం.'

'ఒక్క రూపాయి కోసమా!'

'అవును మరి; ఒక్క రూపాయి మాత్రం ఎంత కష్టపడితే వస్తుందోయ్.'

రోజూ తను పట్నంలో కాల్చి పారేసే సిగరెట్లపాటి లేదు వెధవ రూపాయి! వీళ్ళకి ఇంత పిసినిగొట్టు తన మేమిటో - పట్నవాసం వాళ్ళకే చెల్లింది అనుభవించేందుకు.' అనుకుంటూంటే బండిచక్రం ఓ గోతిలో దిగబడి కదల్లేదు.

పంతులు బండి దిగి, చక్రం బైటకు గెంటబోయేడు. కాని లాభం లేకపోయింది.

'నువ్వుకూడా దిగి, ఓ చెయ్యివేస్తేనే కాని కదిలేలా లేదోయ్.' అన్నాడు పంతులు.

'క్షమించాలి. నాకు చేతకాదండీ."

"పోనీలే - ఎవరేనా వస్తూంటారు-"

ఇంతలోకే అదృష్టవశాత్తూ ఆవూరి మునసబు 'కొండయ్య' కనిపించేడు, అల్లంత దూరంలో వున్న కొబ్బరితోటలో.

'ఓహోయ్, కొండయ్యబావోయ్' అంటూ గట్టిగా అరిచేడు పంతులు, రెండు చేతులూ నోటికి గొట్టంలా పెట్టుకుని. మునసబు, బొటనవేలిమీద పైకి సాగుతూ, కనుబొమ్మలకి చెయ్యి ఆనించి పరికించేడు.

'నిన్నేనోయ్ ఓసారి ఇలా వచ్చిపోదూ-' అని మళ్ళీ అరిచేడు పంతులు. మునసబు వస్తూ—

'ఏం పంతులూ, యీ యేల యిలా దిగబడ్డావు?' అన్నాడు నవ్వుతూ.

'పంతులు కాదోయ్ దిగబడత; పంతులు బండి.' అన్నాడు పంతులు నవ్వుతూనే.

'పంతులు మా గట్టోడు: ఏ మాట కామాటే అడ్డొగ్గుతాడు.'

'నువ్వు మాత్రం తీసిపోతావేమిటి; అడ్డొయ్యకపోతే, బెడ్డముక్కలా విసిరేస్తావు'

'బండిలో కూకున్నదెవరు? - ఓస్, మన పెద్దరైతు వెంకయ్యగారి బుల్లోడు కాదంటయ్యా! ఓస్, బండిలో పడుకున్రాడుంటేనే, 'మునిలోణ్ణి' నన్ను పిలిచేవు!'

'ఆఁ అలాంటి పడుచువాళ్ళు వందమంది అయితే మాత్రం, నీ ఒక్కడితో సరిపోతారా బావా!'

'ఓస్, నిజమేలే - ఊఁ, సూత్తావేం, పట్టు మరయితే-'

'లేవటం లేదు - నీకూ ఓపిక తగ్గుతోంది బావా.'

'ఓస్ పోవయ్యా: గజంలోతు దిగబడిపోతేను - బుజం ఒగ్గితే కాని లెగిచేలా లేదు - ఊఁ, యీపాలి నూడు - ఊఁ అయిలేస్ - ఓస్ - ఊఁ అయిలేస్ - ఓస్ - ఊహు - ఓ బుల్లోడా, కొత్త ముందుకెల్లి ఎద్దుల్ని కొత్త గదమాయించు - ఊఁ పట్టవయ్యా పంతులూ యీపాలి-'

వీరాస్వామి ఎద్దుల్ని గదమడం మొదలెట్టేడు. 'హేయ్, హేయ్-' అంటూ వాటి వీపుమీద అరచేత్తో చరిచేడు. ఎద్దులు, బుర్రలు ఓమారు విదిలించి, ఓపట్టు

కీచకవధ

బటి నిలచిపోయేయి. మళ్ళీ గట్టిగా చరిచేడు. అరచెయ్యి మాడిపోయింది కాని, అవి లక్ష్యపెట్టలేదు.

'ఓస్, అలా కాదోయ్ బుల్లోడా: ఎద్దు రెండు కాళ్ళ మధ్యకి నీ కాలు పోనిచ్చి, తోక పటుకుని పళ్ళతో కొరుకు-'

'నా నోటితో ఎద్దుతోక కొరకనా!' పంతులు అందుకుని, 'తోక మెలిపెట్టవోయ్‌చాలు – ఊఁ అలాగ – పట్టవోయ్ బావా'—

ఈసారి ఎద్దులు బిగువుగా పట్టుపట్టేయి.

పంతులు, కొండయ్య భుజాలు కొని, ఎలా గైతేనేం చక్రం బయటకు నెట్టేరు. పాపం, వీరాస్వామి లాగుమీదా, చేతిమీదా ఎర్రులు పేడవేసేయి. వీరాస్వామి అసహ్యించు కోడం చూసి, మునసబు—

'ఓస్, పర్వాలేదులేవోయ్ బుల్లోడా: గడ్డిపరకలకి రాసెయ్, అదే పోతాది' అంటూ కోరమీసాలు ఓసారి ఎగద్రోసి, చుట్ట తీసి, మునిపళ్ళతో దాని చిగురు కొరికి ఉమ్మేసి, అగ్గిబొద్దుతో చుట్ట ముట్టించి, పెదవులతోనే దాన్ని ఎడం ప్రక్కకు తోసి, 'నే వత్తా పంతులూ' అన్నాడు.

'మంచిది బావా' అన్నాడు పంతులు.

బండి మళ్ళీ యథాప్రకారం సాగిపోతోంది. పుల్లమ్మగారి తోట మలుపులోకి తిరిగింది. తోటలో, 'సుబ్బి' బత్తాయి కాయలు కోస్తోంది. పంతులు, ఓ పొడుం పట్టు ఘాటుగా పీల్చి,

'ఏమే పిల్లా, కాయలు బాగా ముదిరినట్టున్నాయే' అన్నాడు.

'ఎంతకాలమైనా ముదరకుండా అనాగే కూకుంతా యనుకున్నారేటి?'

'ఎంత ముదిరినా ఇంకా పులుపు చావలే దనుకుంటాను.'

'మీకేటి తెలుద్ది? అనుభగించేవోరికి తెలియాల.'

'అందరికీ అంత అదృష్టం పట్టొద్దూటే.'

'ఎందుకు పట్టుద్దీ.'

'ఇంటికే నేమిటి? బండిలో ఎక్కు; పోతుందిలే—'

'బగమంతు డిచ్చిన కాళ్ళుండగా, బండెందుకేటి.'

'సరే, అయితే నీ యిష్టం.'

బండి సుబ్బికి దూరంగా పోతోంది. 'మాంచి హుషారైన పిల్లలే' అన్నాడు పంతులు. వీరాస్వామి ఏమీ పలుకలేదు. పంతులు వెనుదిరిగి చూసేడు. వీరాస్వామి, సుబ్బికేసే చూస్తూన్నట్టు గమనించేడు. 'ఏమోయ్, వెంకటస్వామీ!' అని పిలిచేడు.

'ఆఁ, నా పేరు వీరాస్వామి అండి పంతులుగారూ.'

'ఆ అదే, అదే—ఔను కానీ, మీ నాన్న ఎంత చెప్పినా వినకుండా, ఇప్పుడప్పుడే పెళ్ళి చేసుకోనన్నావు టేమిటి?'

'ఆఁ, ఇప్పటినుంచీ పెళ్ళేమిటి పోనిస్తురూ.'

'అదేమిటోయ్ అలా అంటావు: ఏ వయస్సులో ఆ ముచ్చట తీరాలి కాని—'

'ఇప్పుడేమంత మించిపోయిందీ?'

'ఇంకా మించిపోవడ మేమిటోయ్! పెళ్ళయితే యీపాటికి ఒకళ్ళిద్దరు పిల్లలు కూడా.'

'అనొక్కటే మనకి బాగా చేతనయింది: ఊరికే పంగుల్లాగ కనిపారెయ్యడం.'

'అలా అని నిగ్రహం కలిగివుండడం మంచిదేలే. కాని-'

'కాని ?'

'అది లేకుండాపోతే మాత్రం, పెళ్ళి చేసుకోడమే మంచిదేమోనని నా ఉద్దేశం.'

'అంటే ?'

'అహ, ఏమీలేదు - ఇప్పుడు మాస్తున్నాం కాదుటోయ్, పెళ్ళిచేసుకోమని పైకి పెద్దకబురు చెప్పడం; కనబడిన ప్రతీ ఆడదానికేసీ ఎగాదిగా కళ్లప్పగించి చూడ్డం; డబ్బు తగలెయ్యడం; పైగా, ఒళ్ళు పాడుచేసుకోడం."

వీరాస్వామి గుండెలకి సూటిగా తగులుతున్నాయి పంతులు మాటలు. ఐనా తొణకకుండా—

'అందరూ అటువంటివాళ్ళే వుంటారనా మీ అభిప్రాయం ?"

"అబ్బే, ఎందుకుంటారు. అయినా, నీ మాట కాదు లే చెబుతూంట - లోకం అన్నాక మంచీ వుంటుంది, చెడూ వుంటుంది. సామాన్యంగా మనం చూస్తూవుండే విషయం గురించి చెప్పేనంతే - కాదంటావా ?'

కాదని ఎలా అనగలడు ? రోజూ తనూ, తన స్నేహితులు, తను చూస్తూండే కుర్రాళ్లూ ప్రతినిమిషమూ పడుతూండే తాపత్రయం తనకు బాగా తెలిసిందేకదూ. అయినా,

'అదంతా మన మనస్సు ననుసరించి వుంటుందిలెండి పంతులుగారూ.' అంటూ తప్పించుకుందామని చూసేడు.

'నిజమే, కాదనను. కాని, ఆ మనస్సు కూడా, మన వేదాంత కేసరిగారు చెప్పినట్టు, మనము తినే తిండీ, వయసూ, వాతావరణమూ -'

'అబ్బబ్బ, మీ పురాతన మెట్టవేదాంతాలు, పిచ్చినమ్మకాలు నాకు పరమ అసహ్యం పంతులుగాలూ.' అని డబాయించేడు, పంతులు చెబుతూన్న విషయమే ఓ ఆధునిక శాస్త్రగ్రంథంలో చదివినట్టు జ్ఞాపకం వున్నాకూడా.

'అంతేలే మరి - మాకేముంది, ఇంగువకు కట్టిన పాతగుడ్డలం.' అనేసి, మౌనం వహించేడు పంతులు.

వీరాస్వామి, వాళ్ళ ఇంటిదగ్గర బండి దిగేడు. కొడుకు వచ్చేడని విని, వీరాస్వామి తల్లి గబగబా వీధిలోకివచ్చి, 'కులాసాగా వున్నావా నాయనా.' అంది.

'ఆఁ,-ఆ చేతులేమిటి అలా వున్నాయ్?'

'ఏమీ లేదురా - దొడ్లో పేడపిసికీ, పిడకలు చరుస్తున్నాను.'

'ఎంత డబ్బున్నా, ఇంకా పేడా పిడకలూను. అసహ్యమేనా లేదు బ్రతుక్కి.'

'అదేమిట్రా అబ్బాయి, మీ నాన్న నేనూ ఇలా రెక్కలు విరుచుకుని కష్టపడకపోతే ఈ డబ్బంతా ఎలా వచ్చిందనుకున్నావ్ ?'

'డబ్బున్నప్పుడు కూడా ఇలాంటిపనులే తగులడాలి ?'

'డబ్బుంది కదా అని వున్నదాన్ని కూడా తెటపారేసుకోమన్నా వేమిటి?'

'అదంతా ఎందుకుకాని, ఇక్కడ నేను వున్నంతకాలమైనా అలాంటి పనులు మానేద్దూ, నీకు పుణ్యం వుంటుంది.

'అయ్యో, అయ్యో, ఇదేం లంజతనమా, దొంగతనమా ? కష్టపడి పని చేసుగోడం కూడా తప్పేనా! బాగుందిరా నాయనా నీవరుస'

'ఇంక నీ వుపన్యాసం కట్టిపెట్టి, కాస్త కాఫీనీళ్లు పడెయ్యి; బుర్రతిరిగిపోతోంది.'

'నువ్వింకా రెండు రోజులు దాకా రావని కాఫీ పొడుం అదీ తెప్పించలేదు-'

'ఉత్తరం రాసేనుకదూ.'

'ఏదీ, అందందే!'

'ఈవెధవ వూరికి అన్నీ అంతే. ఉత్తరం వేసిన పదిరోజులకు కాని అంది చావదు.'

'సమయానికి నాన్నగారుకూడా పొలం వెళ్ళి కూర్చున్నారు. ఒకే సన్నాసి. - ఒరే సుబ్బారావ్ -అవసరమున్నప్పుడు ఒక్కళ్లూ కనిపించరు - ఉండు, నేనే వెళ్ళి తెస్తాను.'

'ఎక్కడికి ?'

'కోమటికొట్టుకి'

'నువ్వు వెళ్ళి తెస్తావా ! ఇంక పరువూ మర్యాదా ఏమీ అక్కర్లేదన్న మాట?'

'అదేమిట్రా అన్నీ వింతగా మాట్లాడుతావు !'

'నాకు కాఫీ అక్కర్లేదే బాబూ: నువ్వు పోయి నీపని చూసుగో.'

'ఎంతరా, ఇప్పుడే వచ్చేస్తాను-'

'అక్కర్లేదని చెప్పేనా - ఇంక మాట్లాడకు-' అంటూ చరచరా గదిలోకి వెళ్ళేడు బట్టలు మార్చుకుందుకు.

*   *   *

మర్నాడు ఎండ బాగా కాసింది. నేల కొంచెం ఆరి, పదిమందీ నడిచేచోట్ల కాలిబాటలు పడ్డాయి. సాయంకాలం పడగానే వీరాస్వామి షికారుకు బయలు దేరేడు. అట్టే దూరం పోవడానికి వీల్లేక, చెరువు గట్టుమీదికి వెళ్ళికూర్చున్నాడు. నీటిలో చేపలు గెంతుతున్నాయి. ఓ చిన్న చేప, పాపం, ఓ తామరాకుమీద పడిపోయింది. మళ్ళీ నీళ్ళలో పడడానికి గింజుకుంటోంది.

(53-వ పేజీ చూడండి)

నీచాతి నీచుడు

అంత్యక్రియలకు వచ్చిన బంధువులూ, జ్ఞాతులూ అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు. ఆ వంశానికంతటికీ మిగిలిన పండు ముసలమ్మ కాస్తా గుటుక్కుమనేసరికి—పుష్కరం, పదిహేనేళ్ళనుంచీ ఆ కుటుంబపు ముక్కూ ముఖం తెలియని వాళ్ళంతా పెద్ద దినానికి హాజరయ్యారు. కర్మ చేస్తున్నాయన పెద్ద పుద్యోగంలో వున్నవాడు గనక, వచ్చిన అయిదారొందలమందికీ ఏ లోటూ జరక్కుండా సరంజామా సరఫరా జేశారు. అందుకనే అందరూ తాపీగా కూచ్చుని మరీ తిట్టిపోశారు—పున్నయ్యని.

అలాంటివాణ్ణి తిట్టారూ అంటే-తిట్టరూ మరీ! "పెట్టంత ముసలమ్మ చచ్చిపోతే దినవారాలకైనా రాని మనుమ డెక్కడన్నా వుంటాడా? అందులోనూ స్వయానా నాయనమ్మయ్యె!! కర్మాదులు నిర్వర్తించవలసిన వొక్క కొడుకూ (తమ తండ్రి) ఏనాడో పోయే. ఇక తన అన్నా తనూ కలిసి చెయ్యక, మరెవరు చేస్తారనుకున్నాడో యీ కర్మకాండంతా?" అన్నారు కొందరు.

"ఈ పెద్దవాడు బుద్ధిమంతుడూ, వంశానికంతటికీ పేరు ప్రతిష్ఠలు తెచ్చేవాడు గనక సరిపోయిందిగాని - వీడూ పున్నడి లాంటివాడైతే ఆ ముసలమ్మని కాటిక్కీడ్చేవాళ్ళు కూడా లేకపోయేదే గా?" .. "అరి దుర్మార్గుడా! ఇలాటి పుత్రులూ, పౌత్రులూ పుట్టెందుకు - భూదేవికి బారం కూడాను" అని నిర్ణయించారు మరి కొందరు.

"అన్నతోపాటు తనూ సగం ఖర్చు భరించవలసివస్తుందని మొఖం చాటేశాడేమో"నని ఒకాయనంటే; మరొకాయన "ఛా! వెధవడబ్బుకోసం యింత నీచప్పని ఎవరన్నా చేస్తారా - థూ" అని వుమ్మేశాడు. ఒక ముట్టం "అయినా - వాణ్ణిఖర్చు భరించమని పెద్దవాడు అడుగుతాడా ఏమన్నానా? వాడికి నోట్లో నాలికే లేదయ్యె! కనీసం మొఖమన్నా చూపించి, మైలనీళ్ళు పోసుకుపోతే మాటదక్కేదిగా ఆ సన్నాశికీ" అంటే; మరొకజ్ఞాతి "మంచి మాట దక్కించుకోవటం మాత్రం చేతయ్యెడవొద్దూ" అని దీర్ఘం తీశాడు.

ఇంతలో కర్మచేస్తున్న పెద్దబ్బాయటు రావడంతో ఒక ముసలాయన "అయితే - ఆపున్నడికి తెలుసటరా నాయనమ్మపోయిందనీ?" అని అడిగాడు. పెద్దబ్బాయి "ఎందుకు తెలవదూ? వాళ్ళత్తగారూరు వుత్తరం వేశాను. మొన్న మా సుబ్బయ్య మామ కనిపిస్తే ఆయన చెప్పాట్ట కూడాను ఫలానారోజు దినం అని" అని చెప్పాడు. ఒక మేనమామ "అసలు వాడెక్కడుంటున్నాడూ, ఏంచేస్తున్నాడూ?" అని పృచ్ఛించితే; "ఏమో! వాళ్ళత్తగారికి తెలుస్తుందిగాని - మనకెలా తెలుస్తుందీ? మనకేనా ఉన్నా ఏదన్నా చెప్పాడా పెట్టాడా? ఆఖరికి వుత్తరం ముక్కకూడా వెయ్యడంలేదు" అని పెద్దబ్బాయి చెప్పాడు. జనమంతా "ఛీ - వాడు వీ అమ్మకడుపు చెడబుట్టాడురా -! మనిషైనవాడు యిట్లా చేస్తాడా??" అని ఖాండ్రించి వూశారు - పున్నయ్య నుద్దేశించి.

ఇక ఆడంగుల తిట్లు యధాతథంగా వర్ణించనేలేం. 'తల్లి కూడు పెట్టని చచ్చినాడ'ని ఒకామె; 'అన్నమాట వినని రాలుగాయని' ఒకామె; 'పెళ్ళాం మాటలు విని, మాటలు తెచ్చి కులికేమనిషి - తల్లి సంగతి విచారించకుండావుంటే, కన్నతల్లి ఏమైపోతుం దనుకున్నాడో, వాడిజిమ్మడా' అని మరొకామె; 'అన్నీ అన్న భరిస్తున్నాడుగదా అని తప్పించుకు తిరుగుతున్నాడు -దొంగవెధవ' అని ఇంకొకామె తలా ఒక విధంగా దుమ్మెత్తిపోశారు.

"నాయనమ్మ చచ్చిపోయిందని తెలిసి; మిగిలిన కుటుంబానికి పెద్దయిన అన్నగారింట జరుపవలసిన కర్మకలాపాలకు వెళ్ళని మనిషీ ఒక మనిషేనా-గడ్డితినే పసువుగాని" అని తిట్టనివాళ్ళు ఆ అయిదారొందలమందిలోనూ ఒక్కళ్ళుకూడా వుండరు - వుండరాదు.

* * *

ఇదంతా జరిగిన నెల్లాళ్ళకి ఆ నీచుడు పున్నయ్య - బెజివాడలో గంగయ్యక్కనిపించడం; అతడు చుట్టమేగాక ముఖ్యమిత్రుని వంటివాడు కావడంవల్ల పున్నయ్యకి తగిలే తిట్లూ, శాపనార్థాలన్నీ చెప్పి "ఇంత చదువుకున్నవాడివీ, యిట్లా నీచంగా ప్రవర్తించేవేరా?" అని చీవాట్లు వేయడమూ జరిగాయ్. పున్నయ్య గావురుమని ఏడ్చి - ఆ నడిబజారులోనే - గంగయ్య కాళ్ళమీదపడి, తనవెంట తనుంటున్నావూరురమ్మని బ్రదిమాలాడు.

గంగయ్య "అసలుసంగ తేమిట్రా?" అంటే - "మా యింటికొస్తే అన్నీ చెబుతాన"న్నాడు పున్నయ్య. తప్పనిసరై గంగయ్య వాళ్ళూరు వెళ్ళేందుకు వప్పుకున్నాడు. పున్నయ్య బజారులో నాలుగైదు పలకలూ బలపాలూ కొనుక్కుని గంగయ్యను తీసుకుని తనుంటున్న గ్రామం తీసుకెళ్ళాడు. కారులో తన టిక్కెట్టు కూడా గంగయ్యే కొంటూంటే చూచి కూడా, ఏమీ ఎరగనట్లు ముఖం తిప్పుకూచున్నాడు. "వీడు నిజంగా పీనాశీ, కిలాడీ వెధవా అయిపోయాడ్రా!" అనుకున్నాడు గంగయ్య. అతడక్కడే కారుదిగి తిరిగి వెళ్ళిపోదామనుకున్నాడుగాని- పున్నయ్యగాడింటికి వెళ్ళి సంగతులేమిటో పూర్తిగా చూచి, నాలుగూ దులిపితేనేగాని కసితీరదని అనుకోవడంవల్ల ఆగాడు.

ఈ యిద్దరూ కారుదిగి ఆ కుగ్రామంలో ప్రవేశించేసరికి మిట్టమధ్యాహ్నమయింది. బజారునే వెళుతూండగా ఒక వరండాలో కూచ్చుని చుట్ట చుట్టుకుంటున్న మీసాలాయన "ఏమయ్యో, పంతులూ? పిల్లల్ని గాలికొదిలి బెజవాడెళ్ళావటయ్యా?" అని ఎగతాళీ, అహంకారయుతంగా అడిగాడు. పున్నయ్య "లేదు బాబూ! పలకలూ బలపాలూ తెమ్మంటే వెళ్ళాను. పిల్లల్ని మా యింటికాడే చదువుకుంటూండమని చెప్పి వెళ్ళేను" అని జవాబు చెప్పాడు. అతని ముఖంలో అప్పుడు కనిపించినంత భయం, వేదనా మరెన్నడూ గంగయ్య చూచియెరగడు. మీసాలాయన "నువ్వు దగ్గిరుండకపోతే పిల్లలు చదువుతారటయ్యా?" అని

శ్రీ పోలవరపు శ్రీహరిరావు

నిగ్గదీశారు. పున్నయ్య "నాభార్య చదివిస్తూంటుందిలెండి బాబూ! మరి ఏం చెయ్యనూ? పలకలు లేకపోతే కోటయ్య బాబుగారికొక్కోపంరాదూ!" అన్నాడు. మీసాలాయన "సరే...ఇకనెప్పుడు స్కూలికి నాగా పెట్టకు"అని 'క్షమించేశాం పొమ్మ'న్నట్లు చూచాడు.

వాళ్ళిద్దరూ యింటికి చేసుకునే సరికి పున్నయ్య భార్య పదిమంది పిల్లల్ని "బాబులుగా...గల్లంతు చెయ్యకండి...మీకుదణ్ణం పెడతా, కూర్చుని చదువుకోండి" అని బ్రతిమాలుతూంది. పిల్లలు బూరాలూ, గోళీలతో గోలగోలగా ఆడుకుంటున్నారు. ఇలాగున్న పిల్లల్ని పున్నయ్య గనక నాలుగు బాదితే వాళ్ళే చదువుకుంటారనుకున్నాడు గంగయ్య. కాని పున్నయ్య వాళ్ళనేమీ అనలేదు. పైగా "అబ్బాయిలూ - యిక గల్లంతు చెయ్యకండి...ఇవ్వాళ మీకు భలే గమ్మత్తు కథ చెపుతాను. "అని ఎంతో నమ్రతగా చెప్పాడు. పిల్లలందరూ కథ చెప్పండి మాష్టారూ"అని ఎగబడితే "గంటసేపు నిశ్శబ్దంగా కూర్చుని చదివితే - అప్పుడు కథ చెబుతాను" అన్నాడు పున్నయ్య. పిల్లలంతా బుద్ధిమంతుల్లా కూర్చుని చదువుకోసాగారు.

అతిథి మర్యాదలయ్యాక గంగయ్యే అడిగాడు "పిల్లలకే నువ్వు భయపడుతూంటే వాళ్ళకి చదువేం వస్తుందీ, నువ్వేం పంతులివీ ?" అని. పున్నయ్య "ఏం చెయ్యను ? వ్యక్తిగత స్వేచ్ఛకోసం పోరాడి పోరాడి అలసిపోయ్యాను. ఏ ఆస్తిపాస్తులూ లేనందువల్ల ఏదో ఒక వుద్యోగం చేసుకోక తప్పదు. పదిరకాల వుద్యోగాలుచేసి చూశాను - ఏ ఒక్క దాంటోనూ వ్యక్తిగత స్వేచ్ఛకు స్థానంలేదని తలకాయ గొట్టి మరీ చెప్పింది సంఘం. ఆఖరికి భార్యాబిడ్డలతోకలోగంజో తాగి బదికేందుకు దేవుళ్ళాడక తప్పలేదు. బస్తీల్లోవుండి వంద సంపాదించే కంటే, గ్రామంలో ఏభైసంపాదించుకుంటే ఖులాసాగా గడిచిపోతుందని తెలుసుకుని యీ ప్రయివేటు పంతులు పనిక్కుదిరాను. ముందు యిక్కడ నిలదొక్కుకోగలిగితే, మెల్లగా వ్యక్తిగత స్వేచ్ఛా,అభివృద్ధిసాధించుకోవచ్చును. ఇక్కడ నిలబడాలంటే పిల్లలతోనూ, పెద్దలతోనూ కూడా అణకువగావుండడం ముఖ్యం. ఒకటిరెండేళ్లు జరిగాక గదా - మనం చదువుబాగా చెప్పేదీ లేనిదీ ప్రజలకు తెలిశేది ? అంతవరకూ యిలా వుండకతప్పదు" అని వివరించాడు.

వ్యక్తిగత భావాలు ఆచరణలో పెట్టే వీలులేనందున గొప్ప గొప్ప వుద్యోగాలకే రాజీనామా లిచ్చినపున్నయ్య - వెధవ నలభైరూపాయిల పంతులు పని నిలబెట్టుకుందేందుకింత హీనుడైపోతున్నాడని తెలిశేసరికి గంగయ్య ఎంతో ఆశ్చర్యపోయాడు. ఇంతకీ - తానొచ్చినపని మాచుకుపోవాలనే తొందరలో "మీనాయనమ్మ దినానికి రాకుండా వుండడానికి నీ మనసెలా ఒప్పిందిరా?" అని అడగాడు. పున్నయ్య "నామనసెంత బాధపడిందో చెప్పి మిమ్మల్ని నమ్మించలేను. అంత వేదనే వుంటే కర్మాదులకు రాడా అనీ అంటారు...

"నేను మా అమ్మను చూసి సంవత్సరం దాటింది. ఇక మిగతా బంధువులసంగతి చెప్పనక్కర్లేదు. పట్నంలో వుద్యోగం మాని ఆరునెల్లయింది. ఇంతవరకూ మా వాళ్లెవరికీ కూడా యీ సంగతి గాని, యీ వూరిలా వచ్చివుంటున్నానని గాని తెలవదు..."నీళ్ళునిండిన కళ్ళతో నేల చూస్తూ చెబుతున్నాడు.

గంగయ్య "అదేమిట్రా ? ఒక్కకార్డు ముక్కన్నా వెయ్యలేదట్రా నువ్వు ?"అని ఆశ్చర్యంగా అడిగాడు. పున్నయ్య తల

(56-వ పేజీ చూడండి)

రాజ్యం ఆడిన నాటకం

"మీకో శుభవార్త తెచ్చాను"

"ఏమిటది?"

"ఊఁహూఁ... చెప్పను"

"చెబుదూ"

"ఊఁహూఁ"

తల అడ్డంగా వూపింది. నవ్వుతూ, కొంటెగా నా కళ్లలోకి చూస్తూ అంది:

"చెబితే నాకేమిస్తారు?"

"అబ్బ! చంపక చెబుదూ!"

ప్రాధేయపడ్డాను. కాని, పెంకెఘటం కగా స్తేనా?

"నాకేమిస్తారో ముందు చెప్పండి"

"ఏం కావాలి?"

"మీకే తెల్వాలి"

"ఊఁ... ఐతే చెప్పనా?"

"ఊఁ..."

"కోప్పడవుకదూ?"

"ఊఁహూఁ..."

తల అడ్డంగా తిప్పింది. కాని, ఏం చెబుతానో అని అనుమానం నా వేపు చూడక పోలేదు.

"ఓ తియ్యనిముద్దు!"

ఆవిడ ఎగిరి గంతేసింది. ఆవిడముఖంలో చిరుకోపం చిందులు తొక్కింది.

"ఇస్! అదేం మాటలు? ఎవరన్నా వింటే నవ్విపోతారు. నేను నేడో రేపో పసుపుబట్టలతో పెళ్ళిపీట నలంకరించబోతున్నాను. ఇక మీరలాంటి మాటలంటే కావుండదు సుమండీ!"

నాకంతా అయోమయంగా వుంది. ఆవిడేమి చెబుతోందో అర్థం చేసుకునే స్థితిలో లేను.

"ఏమిటి రాజా నీవంటున్నది?"

ఆత్రంగానే అడిగాను

చేతులు వెనక్కి కట్టి, చెవిటివాడికి చెప్పినట్టు, నొక్కి నొక్కి చెబుతోంది:

"నేను - పెళ్ళిచేసుకోబోతున్నాను - అని"

"నిజంగానా రాజా?"

ఆవిడ ముఖం అదోలా పెట్టి,

"ఛే, అబద్ధం......"

"ఏమిటి రాజా?......నన్నేడిపించకు.. నిజం చెప్పు"

రెండుచేతులూ పట్టుకుని, ప్రాధేయపూర్వకంగా అడిగాను. ఆమెకు నామీద జాలేసింది కాబోలు!

"నిజం చెబితే నమ్మరుగా మరి!"

"ఐతే, నిజమేనంటావా?"

"నిజం! - నిజం! - నిజం!"

"వేళాకోళ మాడుతున్నావ్"

"ఇన్విటేషన్ అందుకునే నమ్ముదురు లెండి."

ఇక నమ్మక తప్పిందికాదు. అయినా, రాజ్యం యిందులో అబద్ధమాడాలిసిన అగత్యంకూడా లేదు. నాగుండెల్లో రాయి బడ్డట్టయింది. నా కాళ్ళకింది భూమి గిరగిరా తిరుగుతోన్నట్టనిపించింది.

"ఇదేనా రాజ్యా, నీవు నాకు వినిపిస్తానన్న శుభవార్త?"

"అవును, ఏం?... నేను పెళ్ళాడ్డం మీకిష్టంలేదా?"

ఆవిడ అదోలా ముఖంబెట్టి, వింతగా నా ముఖంలోకి గుచ్చి చూస్తూ, ప్రశ్నించింది. ఆవిడ వాలకం నాకేమీ అర్థంగాలేదు. అయితే ఆవిడ నన్ను ప్రేమించడంలేదా?- నేనావిణ్ణి తప్పుగా అర్థం చేసుకున్నానేమో! - ఆవిడకు నేనేమని జవాబు చెప్పను? - నేనామెను ప్రేమిస్తున్నానని ఎలా చెప్పను? చెబితే ఆవిడేమనుకుంటుంది?

నా యాశలన్నీ అడియాసలు కావలసిందేనా? ఇన్నాళ్ళుగా నేను కట్టుకున్న గాలిమేడలన్నీ వొక్కసారిగా కూలిపోవలసిందేనా?

అయినా, ఆవిడ నాతో ఎందుకలా ప్రవర్తించాలి?.. సోషల్ గా ప్రవర్తించినంతమాత్రాన, స్నేహభావంతో మెలిగినంత మాత్రాన ఆడదాన్నలా అపార్థం చేసుకోవడం నాదే తప్పేమో!

"నన్ను పరీక్షిస్తున్నావా? - రాజా!"

నా హృదయ కుహరంలోంచి వెలువడిన యీ మాటల్లోని ఆవేదన ఆమెకర్థమై యుండకపోదు.

ఆవిడ కిలకిలా నవ్వింది.

"ఈమధ్య కవిత్వం గూడా నేర్చుకుంటున్నారల్లే వుందే?"

వాల్చూపులతో నాహృదయాన్ని తూట్లు పొడిచేస్తోంది. ఇక భరించలేకపోయాను.

"రాజా! నిజం చెప్పు! నీవు నన్ను ప్రేమించడంలేదూ?"

నా ఆవేదన్ను అర్థంచేసుకునివుంటుంది. నామీద జాలిపడివుంటుంది! నన్నికయేడిపించదలుచుకోలేదు. అందుకనే ఆవిడ తలవాల్చేసింది. కాలి బొటనవ్రేలితో నేలమీద గీస్తూ, ముంచుకొచ్చిన సిగ్గుతో, సన్నగా అంది:

"లేదని ఎవరన్నారు?"

"నిజంగానా రాజా!"

ఆత్రంతో రెండుచేతులూ జవిరి పట్టుకున్నాను.

"మరి, యీ పెళ్ళికెలా వొప్పుకున్నావ్?"

"వొప్పుకోక యేం చెయ్యమన్నారు?"

నాకళ్ళల్లోకిచూస్తూ ప్రశ్నించింది. నిజంగా మరొకప్పుడయితే అలాంటి ప్రశ్నకు నవ్వివుండేవాణ్ణి.

"నాకిష్టంలేదని చెప్పలేకపోయావా?"

"చెబితే ఆగిపోతుందా?"

"అలా అని, జీవితాన్ని దుఃఖ భాజనం చేసుకుంటావా?"

"గత్యంతరం?"

"ఆలోచిస్తే గత్యంతరమే లేకపోలేదు"

"అయితే అదేదో మీరే ఆలోచిద్దురూ"

అతి నిర్లక్ష్యంగా, తనకేమీ పట్టనట్టే, భారమంతా నామీద వేసింది. ఆలోచించాను. మనసుకో ఆలోచన మెరపులా తట్టింది.

"నేనేం చెబితే అది చేస్తావా?"

"తప్పకండా"

"తప్పితే?"

"మీకెందుకా అనుమానం?"

"వెంటనే అక్కణ్ణించి వెళ్ళిపోవాలి"

"ఎక్కడికి?"

"ఎక్కడికైనా? యీ పాడు మూకకి అంతుపట్టని చోటుకి"

"అంటే?"

"కన్నుగానని దేశానికి"

"ఇల్లాగే?"

"ఏం?-భయమేస్తుందా?"

"అబ్బే! అందుగ్గాదు"

"మరి?"

"ఆఁ...వూరికే అడిగాను"

"సిద్ధమేనా?"

"రెడీ!"

కట్టుబట్టల్తోనే, బయల్దేరాం రైల్వే స్టేషన్‌కి. కలకత్తా మెయిలురావడానికి పావుగంటవుంది. టిక్కెట్లిస్తున్నారు. అప్పటికిగాని జ్ఞాపకంరాలేదు. పర్సులో రూపాయిన్నరకంటే ఎక్కువ లేదన్న సంగతి. తీరా యిప్పుడేం చెయ్యాలో తోచిందికాదు. నా యవస్తనంతా గమనిస్తోన్న రాజ్యం తన హ్యాండ్‌బ్యాగ్‌లోంచి రెండు టిక్కెట్లు పైకితీసి చూపుతూ,

"ప్రొద్దుటే కొనిపెట్టాను, సీట్లు రిజర్వు కూడా చేయించాను. నేరుగా కలకత్తాకే.."

అంటోంటే నా కాశ్చర్యం వేసింది. రాజ్యం మా ప్రయాణాన్ని ముందే స్థిర పరచింది. తన నిశ్చితాన్నే నా చేత చెప్పించడానికి యింత నాటకం ఆడింది. రాజ్యం ప్రయాణానికి సిద్ధమయ్యే వొచ్చింది. దారి కర్చులకూ - నెల ఖర్చానికి సరిపడే డబ్బుకూడా తెచ్చింది.

మొత్తానికి రాజ్యం చాలా గమ్మత్తయిన పిల్ల. ఎప్పుడూ హుషారుగా లేడిపిల్లలా, గంతులేస్తూ, నవ్వుతూ, ఛలోక్తులు దొర్లిస్తూ మాట్లాడుతుంది. ఆవిణ్ణి అర్థంచేసుకోవడం బహు కష్టం కొమ్ములు తిరిగిన మన స్త్రీ శాస్త్రవేత్తలకే అంతుపట్టని మనిషి. మాట కారి. తలపెట్టిన కార్యాన్ని కొనసాగించ గలననే ఆత్మవిశ్వాసం, కార్యదీక్షవున్న పిల్ల. ఆవిడ అనుకుంటే మనిషిని యేడిపించాగలదు. నవ్వించాగలదు.

ప్రప్రథమంగా ఆవిడతో నాకు పరిచయమైంది బస్సులో. ఎవరో అమ్మాయి, పచ్చగా, పొడుగ్గా, వాలుజడ వేసుకుని, సన్నని రక్తవర్ణం చీరె, అదే రంగు చోళీ తొడుక్కుని, ఓచేత్తో పుస్తకాలూ, మరోచేత్తో చీరెకుచ్చెళ్ళూ పట్టుకుని నుంచుంది. జనం కిటకిటలాడుతున్నారు. నుంచునేందుకయినా చోటులేదు. బస్సు కదిలితే ఆవిడ పడుతుంది. సరిగ్గా నామీదే పడుతుంది. మగాడయితే ఎలాగో సాము చెయ్యగలడు. కాని, అబల!...అంచేత, నేను లేచి నుంచుని, ఆవిణ్ణి ఆ స్థలంలో కూచోమన్నాను. ఆవిడ కృతజ్ఞతతో నా వేపు చూచి, చిరునవ్వు చిలికి, కూచుంది. బస్సు కదిలింది.

నేను దిగినచోటే ఆవిడకూడా దిగిపో



"మరి యీ పెళ్లి కెలావొప్పుకున్నావ్?"
"వొప్పుకోక యేం చెయ్యమన్నారు?"

యింది. గోష్ఠ మలుప్రవరకూ నడిచి [illegible] పోయాం.

రోజూ యిలాగే జరిగేది. బస్సు [illegible] యెక్కడంతో ఆవిడ చిలిపికళ్ళు నా కోసం (అవును నాకోసమే) వెతుకులాడేవి. నేను కంటబడగానే సిగ్గుతో, [illegible] గా [illegible] పోయేవి. ఆ మధురక్షణాలకో [illegible] తెన్నులు కాస్తోన్న నేను, లేచి నుంచుని, ఆవిడకి సీటు ఆఫర్ చేసేవాణ్ని. ఆవిడ సిగ్గుతో తల వాల్చేసేది.

[illegible] చెంపల్నీ - కెంపులమీద [illegible] రంగిరాలజుట్టునీ - అందమయిన [illegible] - సంప్రేటి భుజాలనీ చూస్తూ నుంచుండి పోయేవాణ్ణి.

ఏ నాడైనా ఆవిడ కనిపించకపోతే నా [illegible] ఆరాటపడేది.

[illegible] సంభాషించాలని, ఆవిడతో మాట్లాడాలని, [illegible] ఉబలాటపడేది. కాని సమ[illegible] సందర్భమూ కలిసిరాలేదు.

[illegible] మామూలుగానే యిద్దరం బస్సు

రాజ్యం ఆడిన నాటకం

దిగాం. ఆవిడ ముందు నడుస్తోంది. నేను వెనకాలే నడుస్తున్నాను. ఆవిడ చటుక్కున వెనక్కి తిరిగింది. ఆవిడ చిన్ని నడుమునీ, హంసగమనాన్నీ వర్ణిస్తోన్న నన్ను చూచి, కసుక్కున నవ్వి చటుక్కున ముఖం తిప్పేసుకుంది. నేను లజ్జతో కృంగిపోయాను.

నాలుగడుగులు వేసేసరికి ఆవిడ చేతిలోంచి చేరుమాలు జారి క్రిందబడింది. వొంగి అందుకున్నాను. ఆవిడ నడుస్తోంది. పిలిచాను. చేతిలోని రుమాలుని ఆవిడ కందించాను. ఆవిడ సన్నగా నవ్వుతూ, అందుకుని, కృతజ్ఞత చెప్పింది. దొరికిన తరుణాన్ని వృధాపోనివ్వకండా మాట కలేశాను. రోడ్డు మలుపువరకూ అవీ- యివీ మాట్లాడుతూ వెళ్ళాం. ఆవిడ నాదగ్గర సెలవు తీసుకుని చీలిపోయింది.

రోజూ ఇలాగే, రోడ్డు మలుపువరకూ అవీ - ఇవీ మాట్లాడుతూ కలిసే వెళ్ళేవాళ్ళం. ఆవిడ మాట్లాడుతున్నంతసేపూ యే స్వర్గధామంలోనో - యే పుష్పసౌరంభంలోనో తేలిపోతున్నట్టనిపించేది.

మా హృదయాలు సన్నిహిత సంబంధాన్ని పెంచుకున్నాయ్. ఒకరికోసం వొకరుపుట్టినట్టు - ఒకరి సమక్షంలో వొకరు వుండడమే న్యాయమైనట్టూ అనిపించేది. అప్పుడప్పుడూ మేము - పార్కులోనో - సముద్రపుటొడ్డునో కలుసుకునేవాళ్ళం. సరదాగా కాలం వెళ్ళబుచ్చేవాళ్ళం. ఆవిడసాన్నిధ్యంలో గంటలు సెకండ్లకు మల్లే యెగిరిపోయేవి.

మొన్న రామ్మూర్తిగాడు స్టేషన్‌లో కనిపించి, చెప్పాడు: మా నాన్నగారు నాకెక్కడో మంచి సంబంధమే చూస్తున్నాట్ట. అయిన సంబంధమేనట. కట్నాలూ కానుకల విషయంలో కాస్త వెనకాముందు అవుతోందేగాని, లేకపోతే యీ పాటికి పెళ్ళే అయిపోయి వుండేదట. నేడో రేపో నాన్నగారి నుండి వుత్తరం కూడా రావొచ్చని చెప్పాడు. నాకు ముచ్చెమటలు పోసినయ్. నా యిష్టాయిష్టాలతో నిమిత్తంలేకుండానే నా పెళ్ళి నిశ్చయంచేస్తాడా? అనుకున్నాను. కాని, నాన్నగారు నిజంగా కర్కోటకుడు. తాబట్టిన కుందేటికి మూడే కాళ్లనే రకం. ఆయన్ని వొప్పించడం నా చేత కాదుగదా, చివరికి బ్రహ్మదేవుడి తరంకూడా కాదు. అంచేత, ఈ ప్రమాదం తప్పే దెలాగో తెలీక తికమక లాడుతున్నాను. అలాంటి పరిస్థితుల్లో రాజ్యం పెళ్ళివార్త నన్ను పిచ్చివాణ్ణిగా చేసిందంటే ఆశ్చర్యపడాల్సిన అవసరం వుండదు.

ఈ ప్రమాదాన్నుండి తప్పించుకోవాలంటే పలాయనం తప్ప గత్యంతరం కనిపించలేదు.

ఎలాగయితేనేం యిద్దరం మెయిల్లో పడ్డాం. మా ప్రోగ్రాం ప్రకారం కలకత్తా చేరగానే రిజిస్టరీ మేరేజి చేసుకోవడం, ఓ చిన్ని పోర్షన్ అద్దెకు తీసుకుని కాపురం పెటడం, ఆపై వుద్యోగప్రయత్నాలు చెయ్యడం క్రమంగా జరిగిపోయినై. నెల తిరక్కముందే, ఎలాగో తంటాలుపడి ఓ బ్యాంకులో గుమాస్తాగిరీ సంపాయించగలిగాను. ఆవిడ కూడా నలుగురిపిల్లలకు ట్యూషన్లు చెప్పి నాలుగురాళ్ళు గడిస్తోంది. మొత్తానికి మా జీవితనౌక సాఫీగానే సాగిపోతోందని చెప్పాలి.

ఒకనాడు ఎక్కణ్ణించో, నాకో వుత్తరం వొచ్చింది. ఆ దస్తూరీ చూసేసరికి గుండెలు జారిపోయినై. ఆ దస్తూరీ ఎవరిదో కాదు. మా నాన్నగారిదే. ఆత్రంతో వుత్తరంవిప్పి చదివాను. నాకాశ్చర్యం వేసింది. నా యిష్టం తెలుసుకోకండా పెళ్ళి ప్రయత్నాలు చేసినందుకు విచారపడుతున్నాడట. నేనేగనక, ఆ సమయంలో సాహసించకపోతే తనకుతానే తలవొంపులు తెచ్చిపెట్టుకోవలసిన గతి పట్టి వుండేదట. నాకు మాట్లాడిన అమ్మాయి సౌశీల్యం మంచిది కాదని తరువాతగాని తెలిసిందికాదట. చూస్తూ చూస్తూ రొంపిలో దిగబొయ్యి, దైవవశాత్తు తప్పించుకున్నందుకు సంతోషిస్తున్నారుట. మొత్తానికి నాన్నగారు తనుచేసిన పనికి పశ్చాత్తాప్పడుతున్నారు.

ఆవుత్తరంలో మరో విషయం కూడా వుంది. నేను రాసినవుత్తరాలన్నీ చేరాయిట. ఆ వుత్తరాల్లో వొక్కదాంట్లోనయినా విలాసం తెలుపకపోవడంచేత, ఎక్కడో వొకచోట సురక్షితంగా వున్నాడుకదా అని తృప్తిపడి వుండడంకంటే యేమీ చెయ్యలేక పోయాట్ట.

ఈ విషయం నన్ను నిజంగా ఆశ్చర్యపెట్టింది. నేనేమిటి? వుత్తరాలు రాయడమేమిటి? అని. పోనీ, రాజ్యం రాసిందేమో అనుకోవడానికీ ఆస్కారంలేదు. మానాన్నెవరో, వారివిలాసమేమిటో తెలీని రాజ్యం ఎలా రాస్తుంది...అసలు ఎందుకు రాస్తుంది?...

ఇంతలో, యెవరో నాకోసం వెతుక్కుంటూ వొచ్చారని, బయటకాచుకుని వున్నారనీ, ఆఫీస్‌బోయ్ వొచ్చి చెప్పాడు.

ఈ కన్నుగానని దేశంలో నాకోసం వెతుక్కుంటూ వొచ్చే అగత్యం యే అప్తుడికి పట్టిందో తెలుసుకోలేకపోయాను. వెళ్ళి చూద్దునుగదా. నాన్నగారు! నిజంగానే గుండెలు ఆగిపోయినై. వారి వుత్తరాన్ని జ్ఞాపకానికి తెచ్చుకొని కాస్త ధైర్యం తెచ్చుకున్నాను.

ఆఫీసుకి అరదినం సెలవు రాసి నాన్నగారితో యింటికి బైలుదేరాను.

ఇద్దరం యిల్లు చేరుకున్నాం. లోపల రాజ్యం ఎవరితోనో మాట్లాడుతున్నట్టు అలికిడయింది. ఆ రెండవ గొంతు ఎవరిదో మగాడి గొంతు కావడం చేత ఆశ్చర్యపడకండా వుండలేకపోయాను. అతగాడు మమ్మల్ని చూచి, ముఖ్యంగా నాన్నగారిని చూచి 'బిక్కమొహం వేశాడు. నాన్నగారెందుకో అతగాణ్ణిచూచి—"ఇక్కడికీ దాపురించావ్! ఇంకా ఎవడికొంప ముంచడానికి?" అని, తోకతొక్కిన త్రాచులా మండిపడ్డారు.

నాకిదంతా అగమ్యగోచరంగా వుంది. ఎవరీవ్యక్తి - ఎందుకొచ్చినట్టు? - నాన్నగారెందు కలాకోప్పడుతున్నారు?

రాజ్యం వేపు తిరిగి "ఏమిటిదంతా?"

బస్తీ నుంచీ ట్రాన్స్‌ఫర్ అయివచ్చిన ఆయన, తన ఆఫీసులో హెడ్‌గుమాస్తాను పిలిపించి, "ఈ వూరు ఆరోగ్యమైన దేనా?" అని అడిగాడు.

"చాలా ఆరోగ్యమైన దండీ. అందులో సందేహం ఏమీ లేదు. చూడండీ— నేను ఈ వూరికి వచ్చినప్పుడు నా తలమీద ఒక్క వెంట్రుకైనా లేదు. కూర్చోలేక పోయేవాణ్ణి; నిలబడలేకపోయే వాణ్ణి. అల్లాంటిది యిప్పుడు ఎల్లా వున్నానో చూడండీ."

"అంటే మీరు యీవూరు ఎప్పుడు వచ్చారన్నమాట?"

"పుట్టిన వెంటనేనండీ!"

అన్నట్టు చూచాను. రాజ్యం ముసి ముసి నవ్వులు నవ్వుతూ - "మా నాన్న గారు. నన్ను చూడ్డానికి వొచ్చారు" అని చెప్పి చెప్పడంతో నాన్నగారు చటుక్కున రాజ్యం వేపు తిరిగి ఆవిణ్ణి ఆపాదమస్తకం పరీక్షగా చూచి - "ఏమిటే? నువ్వా?" అని, నోరు తెరుచుకు నుంచుండిపోయారు.

ఆ నూతనవ్యక్తి తెచ్చుకున్న ధైర్యంతో, మానాన్నగారి నుద్దేశించి-"అవును బావా?" అని అందుకున్నాడు.

నాన్నగారి బోసి పెదాలమీద ఒక్క క్షణం చిరునవ్వు తాండవించింది. నావేపు తిరిగి "ఏమిట్రా నువు చేసింది?" అన్నట్టు చూశారు. రాజ్యంవేపుతిరిగి "ఏమే రాజా, నువ్వేనటేమా వాణ్ణి లేపుకొచ్చింది?" అని చిలిపిగా నవ్వారు.

ఆ కొత్తవ్యక్తి (మామగారు) అందుకున్నాడు "లేదులే బావా! మనం పెళ్ళి చెయ్యడం వాళ్ళ కిష్టంలేక - వాళ్ళే చేసేసుకున్నారు. అయినా; యీకాల పిల్లలకి మనమేవిటి చెయ్యడం" అని.

ఐతే నాకు నాన్నగారు మాట్లాడింది కూడా రాజ్యాన్నే నన్నమాట! భేష్- భలేగా పరిణమించింది మొత్తానికి - అనుకున్నాను.

కాని, నాన్నగారికీ, మామగారికీ ఉత్తరాలు రాసి రప్పించిం దెవరో మాత్రం తేలలేదు.

రాజ్యం తప్పితే మరెవ్వరు చేస్తారు?- అయినా నాన్నగారి అడ్రసు రాజ్యానికేం తెలుసు?- తెలిసినా ఎందుకు రాస్తుంది?- పండంటి కాపురాన్ని బుగ్గిపాలు చెయ్యాలని తనెందుకు కోరుతుంది?- బహుశా, యీ రహస్యం తనకు ముందే తెలుసేమో!- తెలిస్తే యింత నాటకం ఆడాలిసిన అవసరం ఏమొచ్చింది? - అని ఆలోచించుకుంటూ కూచున్నాను.

రాజ్యం, ముసిముసినవ్వులు నవ్వుకొంటూ దొంగచూపులు చూస్తూ "ఏమిటి? ఆలోచిస్తున్నారు?" అని ప్రశ్నించింది.

"ఏమిటే నాటకమంతా?"

"ఏమో నాకేం తెలుసు?"

"తెలీదేం? పాపం..."

"అదేమిటండోయ్?"

"నిజం చెప్పు! మా నాన్నగారిని ఇంతకు పూర్వమే నీ వెరుగవ్!"

"ఎందు కెరుగను? నన్నడగడానికి, మా యింటికి అప్పుడప్పుడూ వొచ్చేవారు."

"అయితే వారి అడ్రసు నీకెలా తెలుసు?"

"మీ డైరీలోంచి..."

"వారు మా నాన్నగారేననికూడా తెలుసన్న మాట."

"ఎందుకు తెలీదు? వారు మీ ఫొటో మా నాన్నగారికి చూపడానికి తెచ్చినప్పుడే తెలుసుకున్నాను."

"తెలిస్తే యీ నాటకమాడవలసిన అవసరం ఏమొచ్చింది?"

"మీ నాన్నగారడిగిన కట్నాలూ, కానుకలూ యిచ్చుకునే శక్తి మా నాన్నగారికి లేదు."

"ఐతే?"

"మే మిచ్చుకోలేమని తెలిసి, మానాన్నగారే మన పెళ్ళికి అడ్డుపడొచ్చు."

"అందుకని?"

"ఈనాటక మాడాలిసొచ్చింది."

"ఏమిటీ?...అమ్మ దొంగా! ఎంతపని చేశావ్?" జవిరి పట్టుకోబోయాను, బాణానికి మల్లే తుర్రుమని దూసుకుపోయింది.

★

ప్రమోషన్

శ్రీమతి వేదుల మీనాక్షీదేవి

తలవైపున నల్లగా మాసివున్న పడక కుర్చీలో కూర్చున్నాడు అప్పుడే ఆఫీసునుండి వచ్చిన ప్రకాశరావు.

"చేతిలో ఆకవరేమిటి" అంది రుక్మిణి.

"కోరా పుట్టి ట్రాన్స్ఫర్ చేశారు. ఆ ఆర్డరిది" అన్నాడు.

* * *

ప్రకాశరావుకి యిద్దరు మగపిల్లలూ, ఒక ఆడపిల్లా. పిల్లలు ముగ్గురూ చక్కనివాళ్ళే. ఆడపిల్లకి సంవత్సరం యింకా పూర్తి కాలేదు. వయస్సుకి తగ్గ పుష్టి, పచ్చని చాయ, పాలబుగ్గలు, యెర్రగా లక్క పూసినట్లున్న పెదిమెలు, వుంగరాలు తిరిగిన నల్లని విగ్గులాంటి జుట్టుతో పిల్ల చూడ ముచ్చటగా వుంటుంది. మగపిల్లలిద్దరూ మంచిచురుకైనవాళ్ళు. వాళ్ళ లేత బుర్రలలో యెన్నో వూహాలు, ధర్మ సందేహాలు బయలుదేరేవి. "అద్దంలోని పాపాయెవరో! చంద్రుడు, సూర్యుడు, నక్షత్రాలు మనమీద పడిపోతే యెల్లాగ? అన్నిమాటలూ మనకి వచ్చునుకదా. మరి మేష్టారెందుకు? బాల, చందమామలాంటి పత్రికలు మనం యెందుకు నడపకూడదూ?"

ఇలాంటి మాటలు అన్నదమ్ములిద్దరూ అనుకుంటూండేవారు. సాయంత్రం వాళ్ళ నాన్న వచ్చాక యెన్నో అడుగుదామనుకుంటారా యిద్దరూ. బండెడు కాగితాలు చంకనెట్టుకుని, రోజల్లా శ్రమించి, యిల్లు చేరిన ప్రకాశరావు యిల్లంటూ కళ్ళబడిందని అనుకుంటూ భార్యయిచ్చిన కాఫీతాగి పడకకుర్చీలో మేనువాలుస్తాడు. ముఖాన్ని యేకొత్త నవ్వు కనబడినా దగ్గరకు పడదామని చూస్తూంటారు ఆ కుర్రాళ్ళిద్దరూ. వాళ్ళకి తండ్రి పరిస్థితి తెలియదు. కాని, తల్లి సాయంత్రం నాలుగుగంటలనుండి "నాన్నగారు వస్తారు. విసుగ్గా వుంటుంది. అల్లరి చెయ్యకండి" అని చేసే బోధవల్ల దగ్గిరకి వెళ్ళడానికే వాళ్లకి భయం. ఒక్కొక్కప్పుడు మెల్లిగా వెళ్ళి దగ్గర నిలబడతారు. ఒళ్ళో కూర్చోడానికి ప్రయత్నించబోతారు. "ఇప్పుడే వచ్చానో లేదో అప్పుడే నెత్తిమీద కెక్కాలీ? అవతలకి పొండి" అనే తండ్రి కేకలతో బిక్కమొగాలు వేసి తల్లి వెనకాల చేరేవారు. "అల్లా యెందుకు వెళ్లారు? పాపాయి మీరు యెంచక్క ఆడుకోండి" అని వాళ్ల అమ్మ బొమ్మలిచ్చి, తినడానికి యేదైనా పెడితే ఆనందంగా వెళ్లిపోయేవారు. పసిపిల్ల సరోజ పాకుతూ వచ్చి ప్రకాశరావు కుర్చీ పట్టుకుని నిలబడేది నవ్వుతూ. అతనది గమనించేవాడే కాదు. అంతలో రుక్మిణివచ్చి "అదేమిటి! పాపాయి వచ్చి నుంచుంటే పలకరించరేం?" అంటే "అల్లాగా! చూడలేదు" అని చేతితో పిల్ల బుగ్గమీద రొటేన్ పేపరు మీద సంతకం పెట్టినట్టు చిటికవేసి 'దీన్ని తీసుకొనివెళ్ళు' అనేవాడు.

ఆ చిరాకుకి అంతంలేదు. పిల్లలన్నా, వాళ్ల మాటలన్నా, ఆటలన్నా ఆసక్తిలేదు. పసిపిల్ల నెన్నడూ యెత్తుకున్న పాపాన పోలేదు. సాధ్యమైనంతమట్టుకు పిల్లలు అతని చుట్టుపక్కలకిరాకుండానే చూస్తూండేది రుక్మిణి.

ఒకనాడు ప్రొద్దున్న సావిట్లో కూర్చుని కాగితాలు చూసుకుంటున్న ప్రకాశరావుని "ఏమండీ" యింట్లో వుప్పూ, పప్పూ, చింతపండుతో సహా అన్నీ అయిపోయాయి. ఒక్కమారు బజారుకివెళ్ళి నాలుగూ తెస్తే మళ్ళీ నెలదాకా వెళ్లక్కర్లేదు" అంది భయపడుతూ రుక్మిణి.

"నువ్వు రాగానే అనుకున్నాను యేదో పని చెబుతావని, నీ బజారు వెచ్చాలతోను, పిల్లల అల్లరితోను బాధపడలేకపోతున్నాను." అని విసుక్కుంటూ సగం సగం త్రాగిన కాఫీ క్రింద పెట్టేశాడు.

రుక్మిణి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"వెళ్లక్కర్లేదు లెండి, కాఫీ తాగండి" అని బతిమాలుకుంది. ప్రకాశరావు కాఫీ తాగాడు.

ఇది వుంది, అది లేదు అన్నమాట లేకుండా భర్తని యిబ్బంది పెట్టకుండా కాలక్షేపం చేసేది రుక్మిణి. అతనికి బజారు పనికూడా లేకుండా చేద్దామని దాసీదానికి చాటుగా ఓ అణా డబ్బులిచ్చి కావలసిన వస్తువులు తెప్పించుకునేది. వస్తువులు శుభ్రమైనవి. ధర సమంగా వుండేది. పరిమాణం కూడా సరిపోయేది. ఇదీ బాగానే వుందనుకుంది. అలా కొన్నాళ్ళు గడిచింది.

క్రమంగా దుమ్ములాంటి సరుకులు రావడం, వెనకటికంటే ఖరీదు యెక్కువ అవడం, వస్తువులుకూడా తక్కువగా వుండడం జరుగుతోంది. పనిమనిషి తక్కువ ధరకి పాడువస్తువులుకొని, యెక్కువధర చెప్పి ఆ సొమ్ము మిగుల్చుకుని, వస్తువులలో కూడా కొత్త కొత్త తీసుకుంటున్నట్టు అనుమానం కలిగింది రుక్మిణికి. ప్రత్యక్షంగా చూడనప్పుడు అడగడం మంచి పని కాదు. మంచో చెడ్డో ఆరుమాసములనుండీ తెస్తోంది. అదీగాక అడిగితే ప్రయోజనం శూన్యమేకాకుండా భర్తకి తెలిస్తే చివాట్లు. పనిమనిషి యిన్నాళ్లనుండి తెస్తున్నట్లు ప్రకాశరావుకి తెలియదు.

ప్రకాశరావు బజారుకివెళ్ళి ఆరుమాసాలయింది. ఇన్నాళ్లనుండి బజారుకి వెళ్ళకపోతే తనభార్య యెల్లాగడుపుకొని వస్తోందో, కొంపలో యేం చిక్కుగా వుందో అసలైనా అతనికి తోచలేదు. అతని కాగొడవేలేదు. పోనీ యింతకాలం ఐంది కదా అని భర్తకి బజారుపనిచెప్పి చివాట్లు తింది రుక్మిణి.

ప్రకాశరావు గ్రాడ్యుయేటు. ఆ డిగ్రీతప్ప వేరే ఆధారంలేదు. ఉద్యోగంకోసం ప్రకాశరావు యెక్కని గుమ్మంలేదు. అడగని అధికారి లేడు. ఆ చెవిగాడుపు యీ చెవికి కొట్టే రోజుల్లోకూడా విధీ విరామం లేకుండా తిరిగాడు. ఆరుమాసములా విధంగా తడిమన్ను పొడిమన్న యేలా తిరగ్గా తిరగ్గా ఓ ఆఫీసులో కాంపుగుమాస్తా వుద్యోగం దొరికింది. జీతం, కరువు భత్యంతో నూరు కిడుతుంది. అదే పదివేలనుకుని పుట్టింటినుండి భార్యాబిడ్డలను తీసుకువచ్చి ఓ చిన్నయిల్లు 15 రూపాయల కద్దెకు తీసుకుని వున్నాడు.

దొరక్క దొరక్క దొరికిన వుద్యోగం. ఇది నిలుపుకుంటేగాని ప్రాణాలు నిలవవు. ఏవిధంగానైనా అధికారి ఆదరణకు పాత్రుడవాలి. ఆవిధంగా ఆదరణ పొందగలిగిన నాడు అధికారి తనకు జీతం హెచ్చు చేయించవచ్చు. ప్రస్తుతం తను చిన్న గుమాస్తా. సమయంవస్తే హెడ్‌గుమాస్తాని చెయ్యవచ్చు. ఇలాంటి వూహాలు ప్రకాశ రావు మనస్సులో పరుగులెత్తాయి. అధికారి ఆదరం సంపాదించడానికి వారి యింటికి వెళ్ళి ఆ యింట్లో వాళ్ళకి మంచిగా ప్రవర్తించడమే సాధనం అనుకున్నాడు.

రోజూ వుదయం వాళ్ళింటికి వెళ్ళి వాళ్ల పిల్లలతో మెల్లిమెల్లిగా పరిచయం చేసుకున్నాడు. ఇంట్లోని పెద్దవాళ్ళకికూడా పరిచయస్థుడై "ప్రకాశరావు మంచివాడు" అనిపించుకునేందుకు ఆట్టే కాలం పట్టలేదు. ఆఫీసరుగారి భార్యను "పిన్నిగారూ" అని పిలిచేవాడు ప్రకాశరావు.

ప్రకాశరావు మామూలుగా ప్రొద్దున్నే ఆఫీసరుగారి యింటికి వెళ్లాడు. గుమ్మంలో అడుగుపెట్టాడో లేదో లోపలినుండి "ఏమోయీ ప్రకాశరావూ నిన్న స్నో, ఫేస్ పౌడరు, సెంటూ తెమ్మని చెప్పాను తేలేదేమి?" అని అడిగింది అధికారి వినాయక రావుగారి సతీమణి.

ప్రకాశరావు నాలిక కొరుక్కున్నాడు తేనందుకు.

"ఔను. మీరు చెప్పారు పిన్నిగారూ. నిన్న యింటికి వెళ్ళేసరికి చాలా చీకటి పడిపోయింది. తలనొప్పిగా వుండి సరాసరి యింటికి వెళ్ళిపోయాను. ఈపాటికి బజారులోని కొట్లు తీస్తారు. మీరిచ్చిన చీటి జేబులోనే వుంది. ఇప్పుడే తెస్తాను" అన్నాడు అతి వినయంగా.

'వెళ్ళేవాడ వెల్లాగ వెడుతున్నావు గనక ఒక వీశ లేత నీటివంకాయలు తెచ్చిపెట్టు. నే నిచ్చిన సొమ్ములో సరిపోతుందిలే" అంది ఆ యిల్లాలు.

"అల్లాగే"నంటూ బజారుకి వెళ్ళి కొన వలసినవన్నీ వంకాయలతో సహా కొని అధికారి యింట్లో అప్పగించి యింటిముఖం పట్టాడు ప్రకాశరావు.

ప్రొద్దున్న రుక్మిణి ఉప్పు, పప్పులాంటి అవసర వస్తువులు తెమ్మంటే విసుక్కున్నాడు. వినాయకరావుగారి గృహిణి తెమ్మన్న విలాసవస్తువులు గడగడలాడుతూ తెచ్చియిచ్చాడు. తోవ పొడుగునా చాలా బాధపడ్డాడు. భార్య చెప్పిన వస్తువులు కొంటే పదిరూపాయ లవుతాయి. చేతిలో చిల్లిగవ్వ లేదు. విసుక్కోక ఏం చెయ్యడం?

వినాయకరావుగారింట్లో ఒక సీమ కుక్క వుంది. తెల్లగా మిసమిసలాడుతూ, కుదిమట్టంగా వుంటుంది. ప్రకాశ రావుకి పిల్లి, కుక్క, యెలక అంటే పరమరోత. అన్నంతినేటప్పుడు అవి కన బడితే లేచి వెళ్ళిపోయేవాడు. అలాంటి ప్రకాశరావుకి అధికారియింట్లో కుక్క ఒక సమస్య అయిపోయింది. ప్రత్యేకంగాదాని

★ ప్రవాహం ★

కొక టేబిల్ వేయించారు. ఆ కుక్కని దాని మీద కూర్చోబెడతారు. దానినంతా ప్రేమిస్తున్నారు. దానిని పక్కలో పడుకో పెట్టుకుంటారు. పసిపిల్లనెత్తుకున్నట్లు ఎత్తుకుంటారు. మూతి మీదముద్దెట్టుకుంటారు. ఇదంతా చూస్తుంటే ప్రకాశరావుకి వాంతివచ్చే పర్యంతం అయేది. అవేవీ తను చెయ్యకపోయినా ఆ కుక్క దగ్గిరనైనా నుంచుంటేగాని బాగుండదు.

ఎల్లాగో ముళ్ళమీద నుంచున్నట్లు దాని దగ్గిర నిలబడేవాడు పది నిముషాలు. అప్పుడప్పుడు సావిట్లో దాన్ని వీధి గుమ్మం

లోకీ వీధి గుమ్మంలో దాని యింట్లోకి తీసుకు వెళ్ళేవాడు.

ప్రకాశరావు వచ్చాడనగానే ఆ యింట్లోని పిల్లలంతా చుట్టూచేరేవారు. తన పిల్లలు వచ్చిరానిమాటలు ముద్దుగా మాట్లాడుతుంటే వినిపించుకోక విసుక్కునే ప్రకాశరావు అధికారి ఆశ్రయింపుకోసం వాళ్ళ పిచ్చిపిచ్చి ప్రశ్నలకు సమాధానం చెబుతూ వాళ్ళతో పిల్లవాడిలాగ ఆడుతూ వాళ్ళ నానందపరచేవాడు. అందమైన తన పసిపిల్ల సరోజనే నాడూ ముద్దుపెట్టుకోనివాడు మెట్టనుదురు, చప్పిడి ముక్కుతో వికారంగావున్న వినాయకరావుగారి రెండేళ్ళ పిల్లవాడిని తెగముద్దు పెట్టుకునేవాడు. మనస్సులో యెంతో బాధపడేవాడు.

ఆనాడు ఆదివారం. సెలవుగనక తలంటి నీళ్ళుపోసుకుంటూరా అనే రుక్మిణి మాటలను వినిపించుకోకుండా వినాయకరావుగారింటికి వెళ్లిపోయాడు. మామూలుగా పిల్లలు చుట్టూచేరారు. వాళ్లతో కథలూ, కబుర్లూ చెబుతూ కాలక్షేపం చేస్తున్నాడు. వినాయకరావుగారు కనబడక పోవడంవల్ల పిల్లల నడిగి వుదయాన్నే ఆయన యెక్కడికో వెళ్ళారని తెలుసుకున్నాడు. 11 గంటలైంది. ఆకలేస్తోంది. ఆఫీసరుగారొచ్చాక కనబడి వెడదామనుకున్నాడు. పిల్లలొక్కొక్కరే భోజనం చేసి వచ్చారు. కుక్కకు భోజనం వేళ అవడంవల్ల రొట్టె, పాలు తెచ్చి దానిముందు టేబిల్ మీద పెట్టి వెళ్లింది వాళ్ళఅమ్మాయి. ఇంతలో వినాయకరావుగారు వచ్చిన సవ్వడి అయింది. ఇదే సమయం అనుకుని ప్రకాశరావు రొట్టెముక్క ను పాలలో ముంచి కుక్కకు తినిపించడం మొదలుపెట్టాడు. బల్లమీదవున్న కుక్కనీ, కింద కూర్చుని దానికి రొట్టెను తినిపిస్తున్న ప్రకాశరావునీ చూశాడు వినాయకరావుగారు. ప్రకాశరావు లేచి నమస్కారం చేసి సెలవు తీసుకున్నాడు.

ఆశ్రయింపుకోసం కుక్కకు రొట్టె తినిపించిన ప్రకాశరావు కాపూట తిండిలేదు. అసహ్యంతో తినలేకపోయాడు. చేతులు సబ్బుపెట్టి కడుక్కున్నా, లోషన్ నీళ్ళతో కడుక్కున్నా అసహ్యంగానే వుంది.

ఈ విధంగా ఒక సంవత్సరం గడిచింది. కట్టుకున్న యిల్లాలి కష్టసుఖాలు తెలుసుకోకుండా వూరివారి సంసారతాపత్రయంతో సతమతమౌతున్నాడు. కన్నబిడ్డలను కన్నెత్తి చూడకుండా, వారితో ఆనందించనివాడు పరులబిడ్డలను క్రిందకు దింపకుండా మోస్తున్నాడు. వారి జంతువులకు కూడా నీచాతినీచమైన పనులు చేస్తు

తల్లి తండ్రులు చూసిన పిల్లను పెళ్ళి చేసుకోవటం మంచిదా, లేక మనమే ఓ పిల్లను చూసి పెళ్ళిచేసేసుకోవటం మంచిదా - అనే సమస్యపై మా కాలేజిహాస్టల్ లో ఒకనాడు హోరాహోరి వాదనలు చెలరేగాయి.

మాహాస్టల్ లో వంటచేసే వెంకట్రాముడు - బాగా పెద్దవాడు-ఎప్పుడోవచ్చి మాతో బాటే కూర్చుని మా వాదనలన్ని విన్నాడు. చివరకు యిలా అన్నాడు:

"తల్లితండ్రులు నిర్ణయించిన పిల్లను పెళ్లిచేసుకొంటే, అట్టివారి జీవితంలో వచ్చే సుఖాల్ని, చల్లని పాలను క్రమంగా మసలబెట్టటంతో పోల్చుకోవచ్చును. మనమే పిల్లనివెదికి పెళ్ళిచేసుకొంటే, పొంగే పొంగే పాలను చల్లారబెట్టుకొన్నట్లే, వాళ్ళ జీవితంలో సుఖంకూడా త్వరలోనే చప్పబడిపోతుంది."

న్నాడు. ఇదంతా తన దరిద్రంవల్లకదా! అదే ఆస్తిపరుడైతే యీ ఆశ్రయింపు అవసరం వుండదు. స్వేచ్ఛ అనుభవించవచ్చు.

ప్రకాశరావు యీ విధంగా బాధపడుతూవున్నాడు మానసికంగా చాలా.

"ఎల్లాగో ఒక సంవత్సరం ఆశ్రయించాము. అదంతా వూరికే పోదులెండి" అనే భార్య వూరడింపు వాక్యాలతో తృప్తిపడేవాడు.

ఆఫీసులో హెడ్ గుమాస్తా పని ఖాళీ వచ్చింది. ఆ వుద్యోగం తన కిమ్మని దరఖాస్తు పెట్టుకున్నాడు ప్రకాశరావు. తనకాపని యిప్పించమని వినాయకరావుగారిని స్వయంగా అడిగాడు.

ఇన్నాళ్ళు ఆత్మగౌరవం చంపుకుని చేసిన సేవకు తగినఫలితం లభించబోతున్నదని ఆ దంపతులిద్దరూ ఆనందించారు.

ఆఫీసులో కూర్చుని పోస్టువాడిచ్చిన కవరు ఆత్రంగా చదువుకున్నాడు. తన కళ్ళను తనే నమ్మలేకపోయాడు. కలా, నిజమా అని సందేహం కలిగింది. నాలుగువైపులూ చూశాడు. తను ఆఫీసులో వున్నట్టు గ్రహించగలిగాడు కొంతసేపటికి. ముచ్చెమటలు పోశాయి.

*　　　*　　　*

తలవైపు సల్లగామాసివున్న పడకకుర్చీలో కూర్చున్నాడు అప్పుడే ఆఫీసునుండి వచ్చిన ప్రకాశరావు.

"చేతిలో ఆ కవరేమిటి?" అంది రుక్మిణి.

"కోరాపుట్టి ట్రాన్స్ఫర్ చేశారు. ఆ ఆర్డరిది" అన్నాడు.

"అయితే హెడ్‌గుమాస్తాపని యిస్తారనుకుంటున్నాంకదా. ఆపని యిస్తూనే బదిలీ చేశారా?"

"అదేంకాదు. హెడ్‌గుమాస్తాకి బదిలీ అయిందిట. ఆయన స్థానంలో మరొకాయన యిక్కడికి బదిలీ చేయబడ్డాడు. ఇవ్వాళే వచ్చాడా కొత్త గుమాస్తా, నా బదిలో విషయం వేరు. "అస్తమానం పిల్లలతోను, కుక్కలతోను ఆడుకునేవాడు యిక్కడ పనిచెయ్యలేడు" అని వినాయకరావుగారామధ్య వెనకటి హెడ్‌గుమాస్తాతో అన్నారని కర్ణాకర్ణిగా విన్నాను. అది నిజమో కాదో. అస్తమానం వారింట్లో వుంటున్నాననీ, నేనంటే వారందరికీ అభిమానమనీ ఓర్చలేక యెవరైనా పుట్టించారేమో ఆమాట అని అనుకున్నాను. ఆయన అనడం నిజమేనని నా బదిలీవల్ల తేలుతోంది స్పష్టంగా. ఇన్నాళ్ళూ మనం చేసినసేవ పసిపిల్లలతో గడుమన్యాలలో వుండి నానాబాధలూ పడవలసిన పరిస్థితులు రావడానికి అయిందన్నమాట. ఇదే మనకి వచ్చిన ప్రమోషన్" అన్నాడు నిట్టూర్పు విడుస్తూ ప్రకాశరావు.

★

పరిష్కారం

చింతచెట్టు ఆకులను దూసుకొని అనసూయ ముద్దుమొహాన్ని వేయి కళ్ళతో చూస్తున్నాడు ఉదయ భాస్కరుడు. పశువుల కొట్టానికెదురుగా వసారాలో ఓ మూల కూర్చొని గడ్డిమేసే ఆవులను, పాలకోసం తహతహలాడి పొయ్యే దూడలను చూస్తూంది అనసూయ. తొట్టెలో కుడితితాగుతూ మధ్య మధ్య తలపైకెత్తి అనసూయను తీక్షణంగా చూస్తూందొక గేదె. అనసూయ మొహం చాలా గంభీరంగా వుంది. కళ్ళు కొంచెం వుబ్బేయి. నొక్కులు నొక్కుల తలవెంట్రుకలు గజిబిజిగా పైకి లేగి చంద్రబింబంలాంటి మొహానికి మరింత శోభనిస్తున్నాయి. లేడికళ్ళను గూడా తలదన్నే చక్కని కళ్ళలో జీవకళ క్షీణించిపోయింది. కనురెప్పలు బరువెక్కి క్రిందికి వాలుతూ కంటి అందాన్ని మరుగుపరుస్తున్నాయి. ఆమె చూపుల్లో ఏభావమూ గోచరించటంలేదు.

ఆమె కూర్చున్నచోటునుంచి వాళ్ళ వూరి చెరువుకట్ట, దాని క్రింద తాటితోపులు, మామిడితోపులు బాగా కనుపిస్తాయి. కట్ట మీదుగా నాగేళ్ళు భుజానపెట్టుకొని చుట్ట కాల్చుకుంటూ రైతులు పొలానికి వెళ్తున్నారు. చెట్లమీదుగా ఆకాశంలో ఎగిరే రంగు రంగుల పక్షులు, దూరాన పనిచేసే ఏతం, అన్నిటికి మెరుగులు దిద్దే సూర్యోదయారుణ కాంతులు...యింత రమణీయమైన ప్రకృతి ఆమె హృదయాన్ని ఏవిధంగానూ ఆకర్షించలేకపోతోంది.

పాలుతాగే ప్రయత్నంలో తోకలు పైకెత్తుకొని పొదుగులను కుమ్ముతున్నాయి ఆవుదూడలు. ఇంతలో దూడలను లాగి కట్టేసి పాలు పితక నారంభించాడు పనివాడు. మళ్ళీ పాలకు వదిలేవరకు దూడలు పడే అవస్థ చూస్తూంటే అనసూయకు చాలా జాలికలిగింది.. దూడలు పాలుతాగడం పూర్తయేసరికి పశువులు కాసేవాడొచ్చి ఆవులను విప్పుకోపోవడానికి ముందుగా, ఆవులను దూడలను వేరుచేసి, ఆవులను తోలుకోపొయ్యాడు. ఆవులు పొలానికి వెళ్తూంటే ఏమీ చెయ్యలేక 'అంబా' అని అరుస్తూ తరలిపొయ్యే తల్లులమీదికి నిస్సహాయ దృక్కులు ప్రసరించే దూడలని చూచి అనసూయ కళ్ళు చెరువులైనాయి. ఆమె హృదయం తరుక్కుపోయింది. ఒక్క నిట్టూర్పు విడిచింది. ఈ ప్రపంచంలో సుఖానికన్నా కష్టమే అధికమనిపించిందామెకు.

ఒంటరిగా వసారాలో కూర్చోడంవల్ల ఆమె మనస్సుకేమీ విశ్రాంతి కలగటం లేదు. ఎవరైనా దగ్గరుండి మాట్లాడుతూంటే కాస్త ఉపశాంతిగావుండేది. కాని బంధువులందరూ యింట్లో హడావిడి పడుతున్నారు. కొందరేమో అక్కడక్కడా గుంపులుచేరి అంతుపంతులేకుండా గుసగుసలాడుతున్నారు. ఎప్పుడైనా ఒక్కొక్క మాట అనసూయ చెవిలో పడుతూంది...

వచ్చిన బంధుజాలంలో ఎక్కువమంది తన పుట్టింటివాళ్ళే. వాళ్ళందరూ తన కాపులు...మరి యీ రహస్యాలేమిటి?... ఈ మంత్రాలు, తంత్రాలు ఏమిటి? కాస్త ఓపిక పడితే ఏం?...వీళ్ళందరు యింతదూరం వచ్చింది రహస్యాలు మాట్లాడుకోడానికి, చర్చలు జరుపుకోడానికేనా?.. పోనీ యింతవరకు తనతో ఒక్క విషయమైనా ప్రస్తావించారా?... అదిలేక పోగా ఎవరంతట వారే తన సమస్యలనుగురించి తీర్మానాలు చేస్తున్నారు. తాను వాళ్ళమాట కెదురాడలేనన్నే ధైర్యమేగా దీనికంతటికీ కారణం...ఈ యింటి కొచ్చినప్పటినుంచీ తన చేతి కడ్డమంటూ లేదు.. ఇప్పుడు వీళ్లందరు తన నొక లెఖ కింద కట్టడంలేదు...వీటన్నిటకి యిప్పటి పరిస్థితులే కారణం...అయినా తన పుట్టింటి వాళ్ళ పద్ధతులేమీ బాగా లేవు. వాళ్ళ ఆలోచనలకు సమయం సందర్భం బొత్తిగా కనిపించడంలేదు...ఈ విధంగా చీకాకు పడుతూనే చెరుగు పరుచుకొని అనసూయ పడుకుంది.

అనసూయ పుట్టింటి వాళ్లు ఏమంత వున్నవాళ్లు కారు. వాళ్లకున్నదల్లా ఒక పూరిల్లు, కొద్దిగా పశువులు, మూడెకరాల మాగాణి, అర ఎకరా మిరపతోట.

అనసూయకు యిద్దరు అన్నలు, ఒక చెల్లెలు వున్నారు. వాళ్ళు స్వంత సేద్యం పెట్టుకొని కాలం వెళ్ళదీస్తున్నారు. అనసూయ తండ్రికి ఆవూరి పెద్ద ఆసామీ అయిన నరసారెడ్డి ప్రాపు చాలా వుంది. రెడ్డిగారింటో అతడు లెఖలు రాస్తూంటాడు. అందుకుగాను, సంవత్సరానికి అరపుట్టి వడ్లు, ప్రతినిత్యం, కూర, నార, పాలు, పెరుగు యింటికి పంపిస్తూంటారు. అసలు ఆవూళ్ళో రెడ్డిగారి సహాయం కాస్తోకూస్తో ఆపేక్షించని వాళ్లు, పొందనివాళ్లు లేనే లేరు. మొదటినుంచి వీరిమీద రెడ్డిగారికి మంచి అభిమానం.

అనసూయను అగ్రహారం మునసబుకిచ్చి చేశారు. వారిది అన్నదానాలకు, శుభపుణ్యకార్యాలకు పేరుపొందిన వంశం. వారి వంశంలో మొట్ట మొదటినుంచీ ఒక్కడే ఒక్క మొగపిల్లవాడు పుట్టడం సంప్రదాయ సిద్ధంగా వస్తూంది. వారి కులదైవం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి. పుట్టినవాళ్ళందరూ సుబ్రహ్మణ్యేశ్వరుని వరప్రసాదమేనని వారి నమ్మకం. వాళ్ళ పేర్లుకూడా ఆ దేవుడివే.

అనసూయ భర్త పేరు నాగేశం. వివాహానికి పూర్వమే అతని తండ్రి గతించాడు. అప్పటికి వాళ్లకు దాదాపు 50 వేల రూపాయల ఆస్తివుండేది. అనసూయ కాపరానికొచ్చినప్పటినుండి నాగేశానికి బాగా కలిసివచ్చింది. వరుసగా మూడేళ్లపాటు ఆప్రాంతాల్లో మంచి వర్షాలు పడటం, పంటలు బాగా పండటం, కరువుప్రాంతాలకు రవాణాచేసి బాగా సంపాదించటం. తత్ఫలితంగా పది పన్నెండెకరాల బీడు, పశువులు తోటలు కొనడం జరిగాయి. ఇదంతా అనసూయ యింట్లోకి అడుగు పెట్టడంతో వచ్చిపడిన అదృష్టమని

సంతోషించి భార్యను బంగారంలో ముంచి తేల్చాడు నాగేశం. ఆమెను చూస్తే ఒంటి మీది బంగారువల్ల ఆమెకుఅందంవచ్చిందా, ఆమె ఒంటిమీద వుండటంచేత బంగారుకు అందమొచ్చిందా నన్న సందేహం ప్రతి వాళ్ళకూ కలుగుతూం డేది. అత్తగారు కూడా అనసూయను అబ్బరంగా చూసు కునేది. అనసూయలాంటి అందాల భరిణ తనయింటి కొచ్చినందుకు ఆమె ఎంతో ఆనందించింది. మరీ కొత్తలో అయితే కోడలికి నాలుగైదు రకాల దిష్టి తీస్తూం డేది ప్రతిరోజు. వంశాచారానికి మచ్చ లేకుండా అనసూయకూడా యిష్టంవచ్చి నట్లు దాన ధర్మాలు చేస్తూండేది. తన సుగు ణాలతో భర్తను అయస్కాంతంలాగా ఆకర్షించింది. సంసారసుఖంలో అతన్ని ముంచి తేల్చింది. క్షణమైనా అనసూయను వదిలి పెట్టి వుండటానికి విచారించేవాడు నాగేశం. ఏ పని మీదైనా బస్తీకి వెళ్తే ఏకో వీలుచేసుకొనో, పని ముగించుకొనో సాయంత్రానికింటికి తిరిగివచ్చేవాడు.

ఓసారి తల్లికేదో జబ్బుచేస్తే బస్తీకెళ్ళి యింగ్లీషు డాక్టరును పిల్చుకొచ్చి వైద్యం ప్రారంభించాడు. ఇంచుమించు వారానికి నాలుగుసార్లైనా తప్పనిసరిగా అతడు బస్తీకి వెళ్ళవలసివచ్చేది. ఓసారి తల్లికి జబ్బు ఎక్కువచేస్తే తక్షణం డాక్టరు దగ్గరికి వెళ్ళ వలసవచ్చింది. తనే వెళ్లాడు. సరాసరి డాక్టరు గారింటికి వెళ్తే మందు యివ్వడా నికి సూర్యకాంతం యింటికి వెళ్ళాడని, వంటవాడు చెప్పాడు. అక్కడక్కడా విచారించగా సూర్యకాంతం ఆ వూళ్ళో ఒక గొప్పవేశ్యని తెలిసిందతనికి. విధిలేక ఆవేశ్య యింటికే వెళ్ళాడు నాగేశం. వెళ్ళ గానే అతనికి సూర్యకాంతం ఎదురైంది. నాగేశానికి చాలా మర్యాదచేసి అత నెందు కొచ్చాడో తెలుసుకొని, అతని అవస్థను చూచి విచారం వలిబుచ్చింది. అతని చేతిలో మెరిసే రాళ్ళఉంగరాలు, బంగారు గుండీలు, చేతి గడియారం, దాని బంగారు గొలుసు, మనిషి కట్టు, బొట్టు దర్జా అన్నీ గమనిస్తూ డాక్టరుగారు నిద్రమేలుకునేవరకు అతనితో మాట్లాడింది. ఆ కాసేపు నాగేశం కొత్త హాయి ననుభవించాడు. డాక్టరుగారు మేలుకోగానే యిద్దరూ వూరికెళ్ళారు.

*　　　*　　　*

రెండువారాల లోపుగానే నాగేశం తల్లికి జబ్బు జాస్తయింది. మళ్ళీ బస్తీకి పరు గెత్తాడు నాగేశం. ఈమాటు సరాసరి సూర్యకాంతం యింటికే వెళ్ళాడు. నాలు గైదు రోజులనుండీ తనకు డాక్టరుగారు కన బడటమే లేదని సూర్యకాంతం జవా బిచ్చింది. ఆ జవాబు వినేసరికి నాగేశానికి



గుడినుంచి

చిత్రకారుడు:—శ్రీ ఎం. వి. రామశర్మ (మద్రాసు)

కళ్ళనీళ్ళు వచ్చాయి. అతన్ని కూర్చో బెట్టి కాసేపు మాట్లాడింది సూర్యకాంతం. అతని పుట్టుపూర్వోత్తరాలన్నీ తెలుసు కుంది... ఇలా మాట్లాడుతూండగా తటా లున తాను వచ్చినపని జ్ఞాపకానికొచ్చి సూర్యకాంతందగ్గర శలవు పుచ్చుకొని బైట

★ పరిష్కారం ★

> "ఎవరు నువ్వు?" అని అడిగాడు పిచ్చిఆస్పత్రిలో చాలా కాలంగా వుంటున్న వాడు, క్రొత్తగా వచ్చిన ఆస్పత్రి అధికారిని పట్టుకొని.
>
> "ఏం? ఎందుకూ? నేను యీ ఆస్పత్రికి సూపరింటెండెంటును."
>
> పిచ్చివాడు భోళ్లుమని నవ్వి నవ్వి, నవ్వు ఆపుకోలేక క్రిందపడి దొర్లి, ఎప్పటికో కాస్త తమాయించుకొని "ఈ ఆస్పత్రిలోకి రాకముందు నేనూ ఇలాగే భారత ప్రధానిని అనుకొంటూ వుండేవాడినిలే!" అన్నాడు.

పడ్డాడు నాగేశం. అప్పుడే మరొక డాక్టరు దగ్గరికెళ్ళి, కోరిన ఫీజు ముందుగానే చెల్లించి ఆయన్ని వూరికి పిల్చుకెళ్ళాడు.

కాని యింజెక్షనులిచ్చి ఆ డాక్టరు బస్తీ చేరకమునుపే నాగేశం తల్లి కన్ను మూసింది.

* * *

తల్లి చావు నాగేశంలో గొప్పమార్పు తెచ్చింది. ఇన్నాళ్ళూ అనసూయమీద "పురుషుడి ప్రేమ" మాత్రమే అతనికుండేది. అనసూయను అలంకరించడం, చూచి సంతోషించడం, సరసాలాడడం కోరిన నగలు, కోరిన వస్త్రాలు కొని పెట్టడం...ఈ హద్దుల్లో వుండేది అతని ప్రేమ. ఇప్పు డతనికి ఒంటరితనం జాస్తయింది. తల్లిలేని చిన్నపాపలాగా అతడి హృదయం తల్లడిల్లిపోసాగింది. అనసూయ సూక్ష్మబుద్ధి భర్త బాధను అర్థంచేసుకొని అతనిలో ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని ప్రతిష్ఠచేసింది. ఒక్కమాటలో చెప్పవలసివస్తే నాగేశాన్ని 'పురుషుడు'గా మార్చేసింది అనసూయ.

ఆ ఏడుకూడా పంటలు బాగాపండేయి. రైతులందరికి పుష్కలంగా ధాన్యం లభించింది. రైతులనడకల్లో మాటల్లోగర్వం వుట్టిపడుతూంది. మాట్లాడితే మీసం మీదకి చెయ్యిపోతూంది ప్రతివాడికి. అందరు సంక్రాంతి పండుగ మహావైభవంగా చేసుకున్నారు. పొలాల్లో తాటిచెట్టు ప్రమాణంగా ఎండుగడ్డివాములు లేచాయి. ఊరంతా ఆనందోద్రేకాలతో పొంగిపోతూంది. సంక్రాంతికి పొంగళ్లు పెట్టుకున్నారు. పశువుల పండుగ బహుచక్కగా చేసుకున్నారు. ఊళ్ళో ఆవులన్నీ మహాలక్ష్మి అవతారం దాల్చాయి ఆనాడు. ఇక కోళ్ళ పందేలకు, మేకపోతుల పందేలకు, విధివిరామం లేదు. సంవత్సరం పొడుగునా కష్టించి, ఫలితమందుకొని పల్లీయులందరు విశ్రాంతి తీసుకుంటున్నారు. విశ్రాంతికి తోడుగా వినోదం కల్పించడానికి గంగెద్దుమేళాలు, వీధిభాగవతాలు, పగటివేషాలు, భామవేషాలు, తోలుబొమ్మలాటలు, ఊళ్ళోకి ప్రవేశించాయి.

చిన్నగా శివరాత్రి సమీపించింది. ఏటా శివుడి తిరునాళ్ళ జరపడం గ్రామాచారం. ఈ సంవత్సరం మంచి పంటలు పండటంచేత తిరునాళ్ళ మరికాస్త వేడుగ్గా చెయ్యాలని గ్రామస్థులందరు పట్టుబట్టారు. నాగేశం అందర్ని బాగా ప్రోత్సహించాడు.

నలుగురుచేతులు కలిపితే ఏ కార్యం జయప్రదంగా జరగదు?...తిరునాళ్ళ మహావైభవోపేతంగా జరిగింది. పక్క పల్లెల నుంచి వేనకు వేలుగా జనం వచ్చారు. అంగళ్ళు, రంగుల రాట్నాలు, హరికథలు, ఉత్సవాలు, భోగం మేళాలు,...సృష్టిలోని ఆనందమంతా ఆ తిరునాళ్లలోనే మూర్తీభవించింది. బస్తీనుంచి మంచి నాట్యగత్తెను పిల్చుకొచ్చారు. నాట్యగత్తెను చూచేవరకు ఆమె సూర్యకాంతమన్న సంగతి నాగేశానికి తెలీదు.

నాగేశాన్ని సూర్యకాంతం గుర్తించినప్పటినుండి కలుగచేసుకొని అతనితో మాట్లాడటం, అతన్ని నవ్వించడం, వగలుపడటం మొదలెట్టింది. ఆ సంతోషకరమైన వాతావరణం సూర్యకాంతం చేసే నటన, నాగేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. చివర రోజు రాత్రి దేవాలయంలో భరతనాట్యం ఏర్పాటుచేశారు. సూర్యకాంతం, అలంకరణలోగాని నటనలోగాని తన చాతుర్యమంతా ప్రదర్శిస్తూంది. సభికులంతా సూర్యకాంతాన్నిచూచిమంత్రముగ్ధులైపొయ్యారు. నాట్యం చేస్తూనే ఎదురుగా దగ్గరలోవుండే నాగేశాన్ని చూచి లేతనవ్వు నవ్వుతూ రెండుమూడుమాట్లు సైగచేసింది సూర్యకాంతం...నాగేశం నరాలలో ఒక అపూర్వమైన జీవశక్తి ప్రవహించింది..వర్ణనాతీతమైన అనుభూతిని పొందాడు..మనస్సులో, తీవ్రమైన ఆలోచన, అంతులేని ఆందోళన ప్రారంభమైనాయి.

మరునాడుదయాన, వూరి పెద్దగాబట్టి నాగేశాని దగ్గరికొచ్చింది సూర్యకాంతం. ఊరి పెద్దలందరు శక్తికొద్దీ సత్కరించి పంపుతారు ఆనాడు.

"తమరు నామీద చూపిన దయకు పదివేల జన్మాలవరకు మీకు ఋణపడిపొయ్యాను" అన్నది సూర్యకాంతం నాగేశానికి నమస్కరిస్తూ. "దేనికి" అన్నాడు నాగేశం రుద్ధకంఠంతో. సూర్యకాంతాన్ని చూస్తూంటే అతని గుండెల్లో దడ జాస్తయింది.

"నా భరతనాట్యాన్నింతగా అభిమానిస్తున్నందుకు...అన్నిటికన్నా తమ పరిచయమే నాకు పదివేలు." అన్నది చిరునవ్వుతో పైట సవరించుకుంటూ.

తాంబూలంలో పది రూపాయలు పెట్టి యివ్వబొయ్యాడు నాగేశం.

"తమరి అభిమానం, స్నేహం కావాలిగాని..."ముద్దుగా పలికింది.

"పరవాలేదులే" అంటూ నాగేశం బలవంతంగా తాంబూలం యివ్వబొయ్యాడు. సూర్యకాంతం తన చేత్తో నాగేశం చేతిని మెల్లగా తోసింది.

"మీరు చూపే అభిమానమే చాలు" అంటూ ఒట్టి తాంబూలం మాత్రం స్వీకరించింది. మళ్ళీ చేతులు తాకించింది... ఆమె తీక్షణమైనచూపులు, మనోహరమైన ముద్దుమాటలు, అతని హృదయాన్ని చలింపచేశాయి.

"నమస్కారం" అంటూ ఓరగాచూస్తూ వయ్యారంగా నడిచి వెళ్లింది సూర్యకాంతం. నాగేశం మనస్సు ఆమెననుసరించింది.

అనసూయ జీవిత మధుపాత్ర విషబిందు మిళితమైంది.

* * *

నాగేశానికిప్పుడు వేశ్యాగృహమే స్వర్గం. ఆ వేశ్య అతని ఆరాధ్య దేవత. అతడు ఆమె నీడ! వేశ్యాబాహుబంధనమే అతని మోక్షసామ్రాజ్యం. ఆమె పెదవులే అతని అమృతపాత్ర! జీవితమనగా యిదేనని, పదివేల జన్మలెత్తినా లభ్యమయ్యేదికాదని, క్షణమైనా వృథా పోనివ్వకుండా అనుభవిస్తున్నాడు నాగేశం. పల్లెల అలవాట్లన్నిపోయి నాగేశానికి బస్తీల నాగరికతంతా అలవడింది. పల్లెటూళ్ళన్ని అతని దృష్టిలో యమలోకాలు! పల్లీయులందరు శిలాయుగపు మనుష్యులు!!

భర్త హృదయపరివర్తనకోసం అన



కుటీరం

సూయ చెయ్యని పనిలేదు. వెయ్యి దేవుళ్లకు మొక్కుకున్నా, ఒక్కరూ ఆమెను కన్నెత్తి చూడలేదు. కులదైవమైన సుబ్రహ్మణ్యేశ్వరుడికి మొక్కుకుంది. వ్రతాలు జపాలు పూజలు చేయించింది. గ్రామదేవత మహంకాళమ్మకు కుంకుమపూజ చేయించింది. కొత్తవస్త్రాలిచ్చింది. గ్రామస్థుల బలవంతాన గ్రామదేవతకు మేకపోతును బలియిప్పించింది! భూతవైద్యాలు చేయించింది. యంత్రాలు కట్టించుకుంది...ఇవన్నీ చేసి విసిగి వేసారి, వగచి వగచి అనసూయ హృదయం శిల అయిపోయింది...తన జీవితమంతా యికమీదటొక చీకటిబాట! భర్త కోసం, తాపత్రయపడటం మానుకుంది. మనసులోని మమకారాలన్నిటినీ అణగద్రొక్కింది. కష్టము, సుఖము, సంతోషము దుఃఖము అన్నీ ఒక్కటేనన్న సమభావం తనలో పెంపొందచేసుకోసాగింది. ఈ జీవితంమీద ఆమెకు రోతపుట్టింది. లక్ష్మి ప్రసన్నమయ్యే కొద్దీ వ్యక్తిలో దయ దాక్షిణ్యం ప్రేమ, కృతజ్ఞత మొదలైన మానవ లక్షణాలన్నీ నశిస్తాయని పెద్దలు చెప్పే మహావాక్యాలు తన భర్త జీవితంలో సార్థకమైనట్లు ఆమె తెలుసుకుంది. మహత్కార్యాలు సాధించడానికవసరమైన ధనమే మానవులను అవినీతిపరులుగాను రాక్షసులుగాను మార్చడానికుపయోగపడుతున్నందుకామె కాశ్చర్యం కలిగింది...నాగేశం ఆదర్శప్రాయుడైన పురుషుడనుకున్నదేగాని స్త్రీ శరీరాన్ని పూజించే మమూలు మనిషి అనుకోలేదు.

తాను ధనవంతుల యింటి కోడలైనందుకిప్పుడు చింతిస్తూంది అనసూయ. ఏ బీద యింటికోడలో అయివుంటే భర్తచేతిలో యింతటి తిరస్కారము, ఘోరాపచారము జరిగుండేదికాదని ఆమెకు తోచింది... లక్ష్మి ఎంత అస్థిరమైనదో, వెన్నెల ఎట్లా అస్థిరమైనదో, సంసారంలో సుఖంకూడా అంతటి అస్థిరమేననుకుంది ..ఏదో మొండి ధైర్యం ప్రవేశించింది ఆమె హృదయంలో. ఒక యంత్రం పనిచేసినట్లుంది ఆమె జీవితం.

నాగేశం సరిగా యింటికి రావడంలేదు. వచ్చినా ఏదో పాడిమాటలు నాలుగు మాట్లాడేవాడు. "నీకంటే నాకింక దిక్కెవరు అనసూయా!" అని తల్లిపోయిన కొత్తలో తనను కౌగలించుకొని కన్నీళ్ళు కారుస్తూ నాగేశం పలికిన పలుకులు అనసూయ మరచిపోలేదు. అతన్ని చూచినప్పుడల్లా ఆమాటలు చెవుల్లో మారుమ్రోగుతూంటాయి ... భర్త ప్రశ్నలకు మౌనంగానే సమాధాన మిస్తుందిప్పుడు...అతడు యింటికెందు కొచ్చేదీ తనకు తెలుసు. వచ్చీ రావడం తోటే యినప్పెట్టెతాళాలు తానే అతని కందిస్తుంది...అవును...తన మీదే అతనికి రోతపుట్టినప్పుడు అతని డబ్బు మీద మమకారం తన కెందుకు? తనకు అతడు ముఖ్యం కాని, అతని డబ్బుకాదు. అతడు తన వాడు కానప్పుడు అతని డబ్బుతో తన కేంపని?...అసలీ పాపిష్టి డబ్బు నాశనం కావడమే మంచిది...ఎన్ని మోసాలుచేసి, ఎందరి నోళ్ళు కొట్టి, ఎంత పాపం ఒడికట్టుకొనకపోతే యీ ఆస్తి యిలా చేరుతుంది. ఆస్తి ఎక్కువ చేసుకుంటూ అదృష్టమని, గొప్ప యోగమని, ముచ్చటైన మాటలతో ఆత్మవంచన చేసుకుంటూ, మాట్లాడుతూంటారు తెలిసిన పెద్దలు కూడా!

నాగేశం మునసబు గిరిని సక్రమంగా చెయ్యడంలేదని, అతని ప్రవర్తన నీతిబాహ్యమైనదని ప్రభుత్వం అతని వుద్యోగాన్ని వూడ బెరికింది. అందుకు భార్యాభర్తలిద్దరు సంతోషించారు. మరి కాస్త స్వేచ్ఛ దొరికినందుకు భర్త, నీతిదూరులకు, బాధ్యతగల ఉద్యోగాలుండకూడదని, తన భర్తకీ ఉద్యోగం పోవడమే మంచిదని భార్య చాలా సంతోషించారు.

ఒకనాడు సూర్యకాంతంయింట్లోవుండగానే నాగేశానికి చలిజ్వరం వచ్చింది. ఎందుకైనా మంచిదని ఒక బండిమీద నాగేశాన్ని యింటికి పంపించింది సూర్యకాంతం. వచ్చిన వారం రోజుల్లో జ్వరం నయమైంది. కొంచెం ఓపిక రాగానే ప్రియురాలి దర్శనానికి బైలుదేరాడు నాగేశం. చిక్కిపోయిన నాగేశాన్ని చూచి సూర్యకాంతం నవ్వింది.

"రోగిష్టి వాళ్లకు వేశ్యలతో ఏం పని?"

"నాకేం రోగం?...ఏదో నాలుగు రోజులు జ్వరంవచ్చింది......అంతేనా?" అంటూ తనకు చాలా బలం వుందనడానికి రుజువుగా కుర్చీ లాగి దాంటో కూర్చున్నాడు నాగేశం.

"ముదించిన ఆబోతులనీ కాళ్లచుట్టూ తిరిగిపోతూంటే ఎత్తుబడిన ఎద్దులు దేనికి?" అన్నది సూర్యకాంతం మూతి విరుపులతో. నాగేశం మొహం మాడిపోయింది. ఆశాభంగం అతన్ని క్రుంగదీసింది. మళ్ళీ జ్వరం తిరగబెట్టి నెలరోజులు నానాబాధలు పెట్టింది. ఆ బాధలతోనే నాగేశం స్వర్గస్థుడైనాడు.

*   *   *

లోకానికి వెరచిగాని, తృప్తిపరచడానికిగాని అనసూయ లేని దుఃఖాన్ని నటించ

పరిష్కారం

లేదు. వచ్చిన దుఃఖాన్ని ప్రదర్శించుకోలేదు...భర్తపోతే కాసిని కన్నీళ్ళయినా రాలేదని వూళ్ళో అమ్మలక్కలందరు ఆమెనాక్షేపించారు...భర్త వేశ్యాలోలుడైనప్పుడే తన జీవితానికి వైధవ్యానికి తేడా ఏమీ లేదనే భావించుకొని బతుకుతూంది అనసూయ...

మధ్యాహ్నం అమ్మవచ్చి అన్నానికి లేపేవరకు అనసూయకు మెలుకువరాలేదు. "నలుగురు మొహాన కొట్టరటే యిట్లా నిద్రపోతే?" అన్నదా తల్లి.

"దేముడే నా మొహాన కొట్టాడు...ఇంక నలుగురు కొట్టేదేమిటి?" అని జవాబిచ్చింది అనసూయ.

తన అన్నలిద్దరు తన భర్త ఆస్తికోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తన కర్థమైంది. తనచెల్లెలు తన సౌఖ్యం నాశిస్తూంది. ఇంకా ఎందరు ఏఏవస్తువులకోసం ఆశపడుతున్నారో ఆమెకు తెలీదు. భర్తవైపు బంధువుల్లో 20 ఏళ్ళకుర్రవాడొకడొచ్చాడు. అతడు పట్నవాసపు నాగరికతకు ప్రతిబింబమనే చెప్పవచ్చు. తనకేసి అతడెందుకో జాలిగా చూస్తున్నాడు... ఈ గుంపులో అతడికే తనమీద కాస్తజాలి కలిగినట్లుంది.... తనకు వినిపించేటట్లుగా అతడెవరితోనో అంటున్నాడు. "ఆ అమ్మాయి జీవితం నాశనమైపోకుండా మళ్లీ పెళ్లి చెయ్యడం చాలామంచిది" అని.

తన పెళ్ళికి ముందు కొమ్ములు తిరిగిన జోస్యులు తన జాతకం చూచి, మాంగల్యానికేమీ లోటులేదని, మహారాణిలాగా ఏ కొరవ లేకుండా హాయిగా జీవితం వెళ్ళిపోతుందని ఒట్టుమీద ఒట్టువేసి చెప్పారు... తన 22 ఏళ్ళ జీవితంలో జరిగినదంతా చూస్తూ చూస్తూ మళ్ళీ పెళ్లి చేసుకోడమా?... దేనికి ఆ పెళ్ళి?...ఇంకొకరికి తన శరీరాన్ని అప్పగించడానికా?...మరొకడి చేత తిరస్కరింపబడటానికా?...మరొకరి దాసి కావడానికా?......తనలో తాను నవ్వుకుంది.

ఇవన్నీ యిట్లావుండగా తన తండ్రి ద్వారా పెద్దన్నయ్య కొడుకును దత్తు చేసుకోమని ఒకరాయబారం వచ్చింది...చూడబోతే తన బంధువులంతా తోడేళ్ళలాగా తనను పీక్కుతినాలని చూస్తున్నారు. డబ్బుదగ్గర తల్లితోడు, మిత్రుడు, శత్రువు.. అందరిదీ ఒకటేదృష్టి.... ఇలాగే ఆలోచిస్తూ వసారాలో కూర్చొనుంది అనసూయ. ఇంతలో సాయంకాలమైంది. ఆవుదూడలు

'అంబా' అంటూ కేకలెయ్యడం మొదలెట్టాయి. ఊరంతా మేక పిల్లలు గొర్రె పిల్లలు తల్లులకోసం అరచే అరుపులతో నిండి పోయింది. సూర్యోదయంతో పొలాలకి కెళ్ళిన రైతులు అస్తమానమయ్యేసరికి చెరువుకట్ట మీదుగా యింటికొస్తున్నారు. తాళ్ళనీడలు పొడుగ్గా తాటిచెట్లమీద కదులుతున్నాయి ఆకాశంలో మబ్బులు, గులాబీ రంగుతో మెరుస్తున్నాయి. సంధ్యాకాలపు అరుణకాంతులు ప్రకృతికాంత సహజకాంతులను దేదీప్యమానంగా వెలిగొందునట్లు చేస్తున్నాయి. దొడ్లో చింతచెట్టుమీద పక్షుల కలకలం క్రమంగా ఒక రొద క్రిందికి మారుతోంది. వరిచేలల్లో గనిమలమీద నిల్చొని పొలాల్లో పనిచేసే వాళ్లను దీర్ఘ స్వరంతో పిలుస్తున్నారు కొందరు. ఆకాశంలో ఎర్రని మబ్బు తెరలని చూస్తోంది అనసూయ.

నెమ్మదిగా సంధ్యాకాలం, అంధకారంలో మిళితమైపోతూంది. దూడల కోసం ఆవులు గబగబా పరుగెత్తుతున్నాయి. మెడలో గంటలు మోగించుకుంటూ ఠీవిగా నడిచివస్తూన్నాయి వృషభ సమూహాలు. తమ పిలుపులకు తల్లులు జవాబు లివ్వగానే ఆవుదూడల్లో ఉత్సాహం ఉరకలు వెయ్య సాగింది. ఉచ్చులు తెంచుకుని తల్లులదగ్గరికి పరుగెత్తడానికి భగీరథప్రయత్నాలు చేస్తున్నాయి దూడలు. కాని యింటికివచ్చిన ఆవులని దూరంగా కట్టేశాడు పనివాడు... ఇదంతా చూస్తూంటే అనసూయ హృదయం ద్రవించింది.

గాలి ఆడటంలేదు. గుడిసెల పైకప్పు లోనుంచి మత్తుగా వుంగరాలు చుట్టుకుంటూ పైకి లేస్తూంది పొగ. దూడల అరుపు లణిగాయి. పక్షుల కలకలం తగ్గుస్థాయిలోకి వచ్చింది. ఊరంతా మాటు మణుగుతూంది. అనసూయ మనస్సును విషాద మేఘాలు ఆవరించాయి. తన భావిని గురించి ఆలోచించేకొద్దీ ఆమె తల వేడెక్కుతూంది. ఇంతలో అనసూయ తల్లి వచ్చి......

"అనసూయా నీ ప్రారబ్ధం కొద్దీ యిట్లా జరిగింది...ఇంక మేము తప్పితే నీ గొంతులో కాసిని గంగపోసే దిక్కెవరమ్మా... ఎప్పటికైనా మనకు మనమే......మీ అన్నయ్యల స్థితిగతులు నీకు తెలియనివి కావు గదా. వాళ్లందరూ నీమీదే ఆశలు పెట్టుకున్నారు. వాళ్ళసంగతి కాస్త ఆలోచించుతల్లీ......నీ మొగుడినైతే వాళ్లెవ్వరూ తేరుగరా!...ఉంటే ఆకాస్తయినా యిల్లు...నీవాళ్ళకే యిచ్చుకుంటే కలకాలం నీ పేరు చెప్పుకుంటూ ఆ వంశం పైకి వస్తుంది......"

అని చెప్పుకుంటూ పోతూంది. అనసూయ చెవులు వింటున్నవేగాని మనసు వినడంలేదు. ......ఎంత సేపటికీ ఆమె లేచి వెళ్లదే. అసలే మానసిక వ్యథతో బాధపడుతూంటే యీ కొండపీటి చేంతాడు ఉపన్యాసాలు దేనికి?...తన ఆస్తి ఎంత వుందో, దాన్ని ఏంచెయ్యాలో తన భావి జీవిత మేమిటో...యీ విషయాలమీదికి ఆమె మనస్సు పోవడంలేదు. అనసూయకు కోపమూ, విసుగు ఒక్కసారి పైకి వచ్చాయి అప్రయత్నంగా.

"సరే నమ్మా, రేపు పొద్దున నలుగురు పెద్దమనుషుల నెదుట పెట్టుకొని తీర్మానం చేద్దాం" అని తటాలున చెప్పేసింది.

* * *

అందరు పడుకున్నారు. ఆవులూ, బర్రెలు, మత్తుగా పడుకొని నెమరు వేస్తున్నాయి. చీమ చిటుక్కుమన్న శబ్దం కూడా రావడం లేదు. చంద్రోదయమైంది. అనసూయకు తల నొప్పి పుడుతూంది ఆలోచనలతో. అమ్మతో చెప్పేసే మాటలు మనసు కొచ్చాయి. ఈ ఆస్తి నేవిధంగా పరిష్కారం చెయ్యాలో ఆమెకు పాలుపోవడం లేదు. బైట పిండి ఆరబోసినట్లు వెన్నెల కాస్తూంది. అనసూయ తల్లి గురుకలు పెడుతూ నిద్రపోతూంది. అనసూయ దొడ్లోకి వెళ్ళి బావిపక్కన మల్లెచెట్టుదగ్గర నిల్చుంది. అప్పుడప్పుడే మత్తు కలిగించే కమ్మని వాసనలు వెదజల్లుతున్నాయి మల్లె మొగ్గలు. ఆ సువాసన లామె తాపాన్ని కొద్దిగా చల్లార్చాయి. ఆమె మనస్సు కొన్ని సంవత్సరాలవెనక్కి పరుగెత్తింది...

కాపరానికి వచ్చిన కొత్తలో ఒకనాటి తెల్లవారుఝామున మెలుకువ రాగా యీ మల్లెచెట్టుదగ్గరికొచ్చింది. అప్పుడు యిలాగే కమ్మని వాసనలు వస్తున్నాయి. వాసనలనుభవిస్తూ కాసేపలాగే నిల్చుంది. వెనకనుంచి పిల్లిలాగా వచ్చి తనను కౌగిలించుకున్నాడు భర్త...అనసూయ కళ్ళు మూతలు పడ్డాయి. క్షణకాలం మేను మరచింది.

ఇంతలో ఒక మూలుగు! ..ఉలిక్కిపడి నాలుగుపక్కల చూచింది. ఎవరు కనుపించలేదు. తాటితోపులో గుడ్లగూబ కూసిన శబ్దం వినిపించింది...మళ్లీ మూలుగు. ఎవరో దుర్భరమైన బాధ ననుభవిస్తున్నారు. చెవియొగ్గి జాగ్రత్తగా విన్నది...ఎవరో ఒక స్త్రీ మూలుగుతూంది. చాలా వికృతంగా వున్నాయి మూల్గులు. ప్రాణం

(52-వ పేజీ చూడండి)



విజ్ఞానవీధులు

"డాక్టర్"



106 రాళ్లేమిటి ?

అవును. ఇన్నిరకాల రాళ్లున్నాయే, ఇవన్నీ ఏమిటే? పాలరాయి, బొమ్మరాయి, నల్లశేనపురాయి, ఇసకరాయి, బలపపు రాయి, గాజురాయి, సున్నపురాయి, అన్నీ రాళ్ళే. ఇవి ఏమిటే ? ఎలాగు ఏర్పడ్డాయీ ?

భూమి ఉపరితలంలో ఏడువందలమైళ్ళు దళసరినివున్న శిలావరణపు టడుగుపొరలు చాలా వేడిగా వుంటాయని చెప్పేము. ఇవి ముద్దరూపంలో వుండి, శిలావరణంలోవచ్చే కదలికవల్లా చీలికలవల్లా వీటిమీది ఒత్తిడి తగ్గడమువల్ల ద్రవాలై, పై చీలికలలోనుంచీ, అగ్ని పర్వతపు బిలములలోంచీ లావా రూపాన్ని విరజిమ్మబడతాయి. ఈ లావా భూమిమీదికివచ్చి చల్లబడి గట్టిపడి కొండల్లాగ తయారవుతుంది. భూమిమీదికి రాకుండానే శిలావరణపు చీలికల్లోనే చల్లబడి ఘనీభవించిన శిలలుకూడా వుంటాయి. ఇంకా లోతున కరిగిన స్థితిలోనే ఇటూ అటూ చెదరి మెల్లగా నెమ్మదిమీద చల్లారి ఘనీభవించిన శిలలూ వుంటాయి. అయితే వీటివైనము ఎలాగు తెలిసిందీ అంటారు. యుగాలతరబడిని గాలికీ వానకీ కడుక్కుపోయి కొండలు అరిగిపోతే వాటిలో కనబడతాయి ఈ రకపు శేనపు శిలలు. వీటికి ద్రవరూపమునుండి శిలారూపానికి చల్లబడడానికి చాలావ్యవధి లభించడమువల్ల స్ఫటిక రూపంగా ఏర్పడతాయి. పెద్దపెద్ద భవనాలు కట్టడానికని చెక్కి తయారుచేసే తెల్లశేనపు రాళ్ళూ నల్లశేనపురాళ్ళూ చేతితో పట్టుకుని తిప్పి పరిశీలిస్తే జిగజిగమంటూ స్ఫటిక ముఖాలుకనిపిస్తాయి. ఇవిశిలావరణపుటడుగు పొరల్లో ఏర్పడ్డవైనా, యుగాల తరబడిని తరిగిపోయినకొండలలో బయటపడ్డ పై పొరలలో కనబడతాయి. భూమ్యుపరితలము లోనూ, కొంచెము దిగువనీ, శిలాద్రవము చల్లబడడమువల్ల ఏర్పడిన శిలలే మనరోడ్లకి కంకరగానూ, సిమెంటురాళ్ళలో పిక్కగానూ ఉపయోగపడుతున్నాయి. ఇవే కొంచెము లోతునుంచి తీసినవి గట్టిగావుండి దేవాలయ స్తంభాలు చెక్కడానికి పనికి వస్తాయి. మన సన్నికల్లూ, రుబ్బురోళ్లూ చేసే రాళ్లుకూడా ఇలాంటివే. లావాద్రవము చల్లబడి ఏర్పడిన శిలలన్నిటికీ అగ్ని శిలలని పేరు.

నదులూ, ఏళ్లూ, వాననీరూ, వల్ల ఒక చోటినుంచి మరొక చోటికి ఒండ్రు మన్నుతో కొట్టుకుపోయి, నీటి అడుగున చేరిన మడ్డి క్రమంగా భూమిలోకి దిగిపోయి గట్టిపడి శిలగా మారినప్పు డేర్పడేవి "మడ్డి శిలలు" (ఫాస్సిల్సు దొరికేది వీటిలోనే) వీటిలో సామాన్యంగా ఇసకా, చిన్నచిన్న గులకరాళ్ళూకూడా వుంటాయి. చెట్లచేమలకి సంబంధించిన ముక్కలు కూడా వుంటే అవి కుళ్లిపోయి ఈరాళ్ళలో కాళీలు ఏర్పడతాయి కూడాను. వీటిని మిశ్రమ శిలలని కూడా అనవచ్చును. ఇవి ఎర్రగానూ నల్లగానూ వుంటాయి. కళింగ శిల్పులు ఇంకొక రకము శిలలు దొరకక పోవడముచేతనే కాబోలు ఈ రకపు శిలలనే వారిశిల్పాలకి వాడేరు. కేవలము ఇకతోనే ఏర్పడ్డ మడ్డి శిలలు ఇసకరాళ్ళు. భూతఅద్దముతో చూస్తే వీటిలోఇసుకకణాలుస్ఫుటంగాకనబడతాయి ఢిల్లీకోటప్రాకారము ఎర్ర ఇసుకరాయితో కట్టినదే. ఒకొక్కప్పుడు మెత్తని ఒండ్రు మట్టిగానున్నదే, భూమిలోకి దిగిపోయి, నాపరాయిగా, పొరలు పొరలుగా ఏర్పడుతుంది. బలపపురాయిని అరగదీస్తే రాలే మెత్తని పొడి ఒండ్రుమన్నువంటిదే గదా. గంధపు సానలు ఈ రాతితోనే తయారు చేస్తారు.

మట్టితో చేసిన ఇటుకలు గట్టిగా శిలలులాగ తయారడమూ, సుద్దమట్టి కాలిస్తే పింగాణీ తయారవడమూ మనకి తెలుసును. మట్టి పొరలు క్రమంగా భూమిలోపలికి దిగిపోయినప్పుడు అడుగు పొరలు ఎక్కువ వేడిగావున్న లోతుకి దిగుతాయి. ఈ వేడికి ఆ పొరలు మగ్గి, మారి, చల్లబడ్డప్పుడు అగ్ని శిలలు లాగే స్ఫటికాలుగా ఏర్పడడమూ కద్దు. ఆ స్థితిలో వీటికీ అగ్ని శిలలకీ భేదము కనిపెట్టడము కష్టము పాలరాయి. ఇలాంటిదే. భూమి కొన్ని కారణాలవల్ల చాప జరిపినట్టు జరిగి, ముడతలు తడి హిమాలయాలూ, రాకీపర్వతాలుగా ఏర్పడడమూ కలదు. అప్పుడు వేడివల్ల కాక, ఒత్తిడివల్ల భూమి పై పొరలు శిలలుగా మారిపోతాయి. ఇవన్నీ పరిణామ శిలలు.

భూమిలోకి మట్టి దిగిపోయినట్టే, చెట్లూ, నత్తగుల్లల పొరలూ, సుద్దపొరలూకూడా దిగిపోతాయి. భూగర్భంలోని వేడికీ ఒత్తిడికి మారిపోయి ఇవి శిలలుగా ఏర్పడతాయి. నేల బొగ్గు ప్రభూతకాలపు చెట్లు పూడిపోయి శిల అయిపోవడమువల్ల ఏర్పడిన శిలయే. సున్నపురాయీ, పాలరాయీ ఈ రకానికే చెందుతాయి; ఇవి పరిణామ శిలలే. ఇవి తయారయ్యే పరిస్థితులు మనము సృష్టించలేము. అగ్నిశిలలు కేవలము వేడివల్లా, మడ్డిశిలలు కేవలము ఒత్తిడివల్లా ఏర్పడితే పరిణామ శిలలు రెండిటి సాంకర్యము వల్ల ఏర్పడతాయి. ఈ సంకర పద్ధతులు పరిశోధనాగారాల్లో సృష్టించడము ఇంకా సాధ్యము కాలేదు.

108. ఆలోచనా పఠనము

Thought reading అనగా నేమి అని గుంటూరునుంచి బి. నారాయణరావుగారు అడుగుతున్నారు.

ఒకరు చేసే ఆలోచనని ఇంకొకరు చదివినట్టుగా తెలుసుకోవడమే ఆలోచనా పఠనముఅంటే. రోడ్డు పక్కన మెస్మరైజు చేయబడి పడుక్కున్న పిల్లవాడు, కంటి మీద గుడ్డ కప్పినప్పటికీ, గారడీవాడు పట్టుకున్న వస్తువుపేరు ఆ గారడీవాడు అడుగగానే చెప్తాడు. స్టేజిమీద ఎక్కడో కళ్ళకి గంతలు కట్టిన కుర్రవాడు కూర్చుని, నాలుగోతరగతి ప్రేక్షకులలో ప్రవేశించి, చేతికర్ర, గొడుగు, టోపీ, కలమూ పట్టుకుని 'ఇదేమిటి' అని అడిగిన తల్లికి సరియైన సమాధానము చెప్పడము నేను చూచాను.

అక్కడ గారడీవాడి మనస్సులోని ఆలోచనని కుర్రవాడూ, ఇక్కడ తల్లి ఆలోచనని పిల్లవాడు పట్టుకుంటున్నారు. అంటే ఆ పిల్లలు పెద్దవారి ఆలోచనని చదివేస్తున్నారన్నమాట కాదూ?

అయితే ఇక్కడ ఒక చిత్రము కనబడుతోంది. గారడీవాడు కాక, మీరో నేనో "నాజేబులో ఏముంది?" అని అడిగితే ఆ పిల్లవాడు చెప్పలేడు. అంటే ఏమన్నమాటా? గారడీవాడు పంపించ గల ఆలోచనా ప్రవాహాన్ని మాత్రమే ఆ కుర్రవాడు (మైమరపుఉన్న ఆ స్థితిలో) పట్టుకో గలుగుతున్నాడు. రెండో ఉదాహరణములో మైమరపు అక్కరలేదు. తక్కిన విషయాలన్నిటినీ తొలగద్రోసి, తనతల్లి ఆలోచనా ప్రవాహాన్ని మాత్రమే పట్టుకోగల ఏకాగ్రత ఆరెండో కుర్రవాడికి వుంది.

ఈ సంగతినే ఇంకో లాగ చెప్పవచ్చును. మన ఆలోచనలవల్ల ఆకాశములో రేడియో తరంగాల వంటివే పుట్టుతూ ఉండవచ్చును. కాని ఒకరి మెదడుచేసే ఆలోచనా తరంగాలకి ఇంకొకరి మెదడు 'ట్యూను' చేసిన రేడియో సెట్టులాగ పని చెయ్యకపోవచ్చును. అందువల్ల మీ ఆలోచన నాకూ, నా ఆలోచన మీకూ తెలియదు. ఆ తల్లి ఆలోచనలో కనీసము ప్రత్యేకపు మాటలకేనా ఆ కొడుకు మెదడు ట్యూను అవుతూన్న దన్నమాట. కనక, 'కలము' 'కళ్ళజోడు' అనే మాటల్ని ఆ కొడుకు పట్టి చెప్పగలుగుతున్నాడు.

మనస్సు రేడియో తరంగాలు పంపగలదా? అని అడుగుతారేమో? నామిత్రులు డాక్టరు - ఒకరు అపరాత్రివేళ లేచి కలముపట్టి ఏదో వ్రాద్దామన్న ఆదుర్దా పుట్టిందనీ, ఒకసారి వ్రాస్తే దాని తలా తోకా తెలియలేదనీ చెప్పారు. ఇలాగ ఎక్కడినుంచో ఆలోచనా తరంగాలు పంపుతూన్న 'వ్యక్తి' తనచేత మూడునాలుగుసార్లు రాయించారు అని కూడా చెప్పేరు. మన శరీరము విద్యుద్వాహకము. నాడులకు విద్యుద్గుణాలున్నాయి. ఆలోచన చేసినప్పుడు మెదడులోని నాడులు ఏదోవిధంగా చలిస్తాయి అనక తీరదు. ఈ కదలికవల్ల విద్యుత్తరంగాలు పుట్టునన్న ఊహ సత్యదూరముకాదు. ఇక ఆ తరంగాల్ని పట్టుకోడమెలాగ? అన్నదే ప్రశ్న. సున్నితమైన గేల్వనా మీటరు కొసలకి తీగెలు తగిలించి, ఆ తీగెల రెండో కొసల్ని రెండుచేతులతోనూ పట్టుకుంటే, ఆ గేల్వనా మీటరు ముల్లు కదులుతుంది. అలా పట్టుకున్న వ్యక్తిమీద హఠాత్తుగా రబ్బరు పామును పడేస్తే, ఆ వ్యక్తికి పుట్టే 'హడలు' గేల్వనా మీటరు ముల్లుని విసురుతుంది. ఈ రీతిగా ఆలోచనవల్ల మనలో వచ్చేమార్పుని ఏ మానసికశాస్త్రజ్ఞుడేనా కనిపెట్టినవాడు ఆలోచనా తరంగాల్ని పట్టి చదివేయడానికి ప్రాతిపదికపడిందన్న మాట. ఎంత మట్టుకు నిజమో తెలియదుగాని అబద్ధము చెప్పిన వాడి మనస్సులోని కలతనికనిపెట్టే యంత్రాలు నిర్మిస్తున్నా రంటున్నారు ఒక యంత్రమంటూ వచ్చిందంటే దాన్ని సున్నితము చెయ్యడము రోజుల్లోని పని. మానసికశాస్త్రజ్ఞులు ఈ పరిశోధనలు సాగిస్తున్నారు.

తెరవెనక కూర్చుని అధ్యాపకుడురాసిన చిత్రాల్ని 'గ్రహించి' రాయమని విద్యార్థులతో చెప్పి రాయించిన 12 గురు విద్యార్థుల చిత్రాలలో ఒకనివి మూడు అధ్యాపకుడు వ్రాసిన చిత్రాలకి సరిపోయాయి. ఇంకొకనివి రెండే సరిపోయాయి. వక్రరేఖలా, కోణాలా, బుజురేఖలా? ఏవి సులువుగా 'అందుతాయి?' అన్న ప్రయోగ ఫలితాలివి. ఈ విజ్ఞానము పెరిగితే ఉత్తరాలు దండగ అయిపోతాయి. లిపి కనుక్కోడమువల్ల 'కబురుచెప్పే మనుష్యుల' అక్కరపోయినట్లే, ఈ 'మానసిక లిపి' కనుక్కుంటే' అక్షరలిపిలో పించిపోతుంది.

చిట్టిప్రశ్నలు - జవాబులు

—ఏ రంగు వెలుగేనా సెకనుకు 18,6000 మైళ్ళ వేగముతోనే ప్రయాణము చేస్తుంది. ఏడు రంగులూ ఏడు వేర్వేరు వేగాలతో ప్రయాణము చేస్తే సూర్యచంద్రాదులు ఏడు రంగులతోనూ, ఒక రంగు తర్వాత ఇంకొక రంగుతో వెలుగుతూన్నట్టు కనపడాలికదా? అలాగ కనపడడములేదే. కనక రంగుకిరణాలన్నీ ఒకే వేగముతో ప్రయాణిస్తాయి.

—పిడుగు అంటే, విద్యుత్తుతో నిండిన మబ్బుకీ, ఆ మబ్బున్నచోట భూమిమీద ఎత్తుగా వున్న చెట్టుకీ మధ్యన గెంతే మెరుపు. ఈ మెరుపు పొడూగునా బయల్దేరే వేడికి గభీమని పెరిగిన గాలి తనచుట్టుపట్టులనున్న గాలిని కొట్టిన దెబ్బయొక్క చప్పుడే ఉరుము.

—మెరుపు మెరిసినప్పుడే కాదు. మోటారుకారు గాని, మోటారు సైకిలు గాని దగ్గిర్నుంచి వెళ్ళుతూన్నా, రేడియో సెట్టులో శబ్దము వస్తుంది. మోటారు మిషనులలో పెట్రోలు గాలిని భగ్గుమనిపించడానికి చిన్న చిన్న మెరుపులు కల్పిస్తారు. మెరుపుచుట్టూ రేడియో తరంగాలు పుట్టి, వ్యాపించి రేడియోసెట్టులకు అందుతాయి. అందువల్ల కలుగుతుంది శబ్దము.

—థర్మామీటరులోని పాదరసము మకిలీ, గాలిబుడగలూ లేనిదిగా వుంటుంది. అన్ని ద్రవాలలోనూ వలెనే పాదరసములో కూడా అణువులకు పరస్పరాకర్షణ వుండి, పాదరసమంతా ఒకచోట వుండి ముద్దగా వుంటుంది. పాదరసపు అణువులకీ గాజు అణువులకీ ఆకర్షణ గలదు. రస స్తంభము పొడూగునా, (పాద)రసాణువులూ గాజు అణువులూ ఆకర్షించుకుంటూ వుంటాయి. రస స్తంభము సన్నని కేశము వలెనే ఉండుట చేత, మొత్తపు పాదరసపు బరువుకంటె ఈ ఆకర్షణ బలము ఎక్కువ. కనక థర్మామీటరు తిరగవేసినా పాదరసము గొట్టములోకి పడిపోదు. దులిపితే పడుతుంది, మకిలీ, గాలిబుడగలూ వుంటే పడిపోతుంది.

★



చిరునవ్వుల పసిపా



లు

ఫొటో : శ్రీ ఎమ్. ఫణిభూషణరావు. (విజయవాడ)

బొమ్మరిల్లు

"బాలుని వ్యూహాలు"

★

రచన: శ్రీ నేమాని వీరభద్రరావు


అమ్మా నేనూ-అస్తమానమూ
కడువేగముతో - కదలెడి రైలును
నిమ్మచెట్టుకడ - నిల్చొని చూస్తూ
వుంటున్నా నే-వుబుసుపోకగా

మూసిన తలుపులు-మూసినట్లుగా
అలసట చేతను-వేసట జెందుచు
రొజుకొంచును - రయము లేకనే
పోయెడి రైలుకు - పోకడ ఎటులే?

అర్ధరాతిరి-నిద్దుర మేల్కొని
ఆలోచిస్తూ-అల్లేయుండగ
చిన్నవాడనని-చిన్నచూపుతో
లక్ష్యము చేయక-కసితో చూచుచు
చీకటి చీల్చుచు-చెట్లను దాటుచు
వింత కాంతులను-వెళ్ళగక్కుచునూ
పోయెడి రైలుకు-పోకడ ఎటులె?

పగటి రాజును-పందెములోనూ
గెలుపు నొందెడి-గొప్ప నేర్పుతో
జాగు చేయక-జోరు చేయుచు
పోయెడి రైలుకు-పోకడ ఎటులే?

ఎండవానల-ఎదుర్కొంచును
కొండ బండల-దొంద్రుచుపోవుచు
వాగులనదుల-వేగదాటుచు
మైదానముల-మధ్యకె చీల్చుచు
చూపర గుండెలు-ఝల్లుమనంగను
పోయెడి రైలుకు-పోయేస్థానము
అమ్మా నాకూ-అంతు తెలియగ
తెలుపగరాదే?-తేట తెల్లముగ!



జంతుకోటిలో మానవలక్షణాలు

(గతసంచిక తరువాయి)

పశువులూ, పక్షులూ మాట్లాడు కోగలవా అనేది ఒక పెద్ద సమస్య. మనం పిల్లలకి చెప్పే కథలలో మాత్రం, అవి మాట్లాడు కొంటున్నట్లూ, వాటి భాషను అర్థం చేసుకొన్న కథానాయకుడు రాబోయే కష్టాన్ని ముందుగానే తెలుసుకొని బయట పడ్డట్లూ, చెప్పుతూ వుంటాము. నిజంగా పశువులకీ, పక్షులకీ భాషలంటూ ఏమైనా వున్నాయా అని శాస్త్రవేత్తలు ఎన్నో పరిశోధనలు చేసి చూశారు.

మానవుడికీ, మిగిలిన ప్రాణికోటికీ వుండే ముఖ్యమైన వ్యత్యాసం, అవతల వ్యక్తికి అర్థమయ్యేలా మాట్లాడ గలగటం, మాట్లాడలేకపోవటంలోనే వున్నది. మనం మాట్లాడే ప్రతిమాటా ఏదో ఒక వస్తువుకో, ఒక భావనకో సాంకేతికం. ఇలాంటి సాంకేతికాలు ఏర్పడినందువల్లనే మానవుడు బుద్ధిజీవి కాగలిగాడు.

మానవులు కాక, మిగిలిన ప్రాణితతికీ, మనకు వున్నట్లు అ, ఆ, లు కానీ, నిఘంటువులు కానీ లేవని మన కందరికీ బాగా తెలుసు. ఇవి లేకపోతే లేకపోయాయి; మరి ఏయితర సాధనం ద్వారనైనా అవి ఒకదాని మనస్సులోని భావాన్ని రెండోదానికి తెలుపుడు చేసుకొనే అవకాశం ఏమైనా అమల్లో వున్నదేమో తెలుసుకోవాలి.

స్వరాలను వుచ్చరించటంలో మానవుడికి వున్నంత శక్తి యించుమించుగా ఒరాంగుటాంగ్‌లకీ వున్నది. మానవుల్లోనే కొన్ని తెగలవారు అత్యల్ప స్వరాలను మాత్రమే వాడగలరు. ఒకానొక దేశంలోని ఆటవికులు ప్రొద్దు గ్రుంకితే మాట్లాడుకో లేరట! అంటే వారి కంఠస్వరాలు పలకవని కాదు. వారికి మనలాగా శబ్ద సాంకేతికాలు లేనందువల్ల, వాళ్ల భాషలో హెచ్చుభాగం చేతులు తిప్పటం, గుడ్లు మిటకరించటం, యిలాటి అవయవాల కదలికల మూలగా ఏర్పాడేదే. ఈకదలికలన్నీ చీకటి పడ్డాక రెండోమనిషి చూడలేడు కాబట్టి, ఎంత అవసర మొచ్చినా, వాళ్లు మరునాడుదయమే కానీ 'మాట్లాడు'కోలేని పరిస్థితిలో వుంటారు.

చేపలు మొదలైన జలచరాలు మాట్లాడుకొంటాయని యిటీవల ఋజువైంది. యుద్ధసమయంలో సముద్ర జలాలలో ఎక్కడెక్కడ ఏఏ మాదిరి శబ్దాలు వుద్భవిస్తున్నాయో తెలుసుకోవటం అవసరమై, అందుకోసం పాశ్చాత్య దేశాలవారు ఏవో కొన్ని ప్రత్యేకమైన శబ్ద గ్రహణ యంత్రాలను పడవలలో అమర్చి, అన్ని సముద్రాలమీద పరిశోధనలు జరిపించారు. ఆసందర్భంలో ఎన్నో రకాల చేపలు చాలా బిగ్గరగా మాట్లాడుతూ వున్నట్లు బయట పడింది. ఐతే - ఈచేపలన్నీ ఏదో మాట్లాడేస్తూనే వుంటాయట కానీ, ఒకదానికి మరొకటి సమాధానం చెప్పుకోవటం మాత్రం వాటికి చేతకాదట!

చిలకలు మాట్లాడుతాయని పసిపిల్లలకి కూడా తెలుసు. చిలకలే కాదు-మైనావంటి అనేక రకాల పక్షులు తర్ఫీదు యిస్తే మనుష్య

★ జంతుకోటిలో మానవలక్షణాలు ★

భాషను పోలిన భాష మాట్లాడ గలవు. ఇవి చేసేపని మనభాష, మన వ్యాకరణం నేర్చుకోవటం కాదు; మనం మాట్లాడే మాటలు తాలూకు ఏవో కొన్ని శబ్దాలను అనుకరించటం నేర్చుకొంటాయి. విదేశాల్లో ఎందరో కాకుల చేత కూడా చిలుకలచేత మాట్లాడించి నట్లు మాట్లాడించారు. 'బుల్ ఫ్లిన్చ్' అనే ఒక రకమైన పిచ్చికలాంటి పిట్టచేత యీలపాటలు పాడించారు. మరికొన్ని రకాలపక్షులచేతకుక్కల అరుపులుకూడా అరిపించారు. వీటి నన్నిటినీ బట్టి, పక్షులు మాట్లాడు కొంటాయని అనటానికి వీలులేదు. మాట్లాడుకోక పోయినా, ఒకదాని మనస్సులోని భావాన్ని రెండో దానికి తెలియచేయటానికి పశు పక్ష్యాదులకు మార్గాలు లేక పోలేదు.

కుందేలికి కోపంవస్తే వెనక రెండుకాళ్లూ ఎత్తి నేలమీద తన్నటం ప్రారంభిస్తుంది. ఏనుగకి ఆందోళనతోస్తే ఘీంకరిస్తుంది. బీవర్ అనే జంతువులు మామూలుగా మందలు మందలుగా తిరుగుతూ మందకుచుట్టూ వాటిలో కొన్నిటిని కాపలాదారులుగా పెట్టుకొంటాయి. అవతల ఏదైనా అపాయం వస్తోందని పొడగట్టగానే, యివతల కాపలా కాస్తున్న బీవరు తోకతో పదేపదే నీటిమీద బాదుతుంది. ఈగుర్తు అందుకొని మిగిలిన బీవర్లన్నీ చెల్లాచెదరై ఎక్కడికో పోయి దాక్కుంటాయి. అడవుల్లో బ్రతికే ఏ ఆడజంతువైనా అపాయం ఆసన్నమైనప్పుడు తన బిడ్డలకి తేలిగ్గా తెలిసేలాగా సూచన చెయ్యగలదు. అడవుల్లో పుట్టే జంతువులకైతే, తల్లులు చేసే సూచనను అందుకోగల జ్ఞానం సహజంగా పుట్టుకతోనే వచ్చేస్తుంది.

మన రైల్వేగార్డు జెండాలు ఎత్తి సూచనలు చేసినట్లే, దుప్పికూడా తన తోకతో చమత్కారమైన సూచనలు చేస్తూ వుంటుంది. దీని తోక పైవైపున మిగిలిన శరీరమంతా వున్నట్లే గోధుమ రంగుగా వుంటుంది. లోవైపున మాత్రం తెల్లగా వుంటుంది. తల్లి దుప్పి,తను ముందుగా పొదలలో దూరి, అన్ని మూలలూ అతి జాగ్రత్తగా వెదికి చూస్తుంది. ఎక్కడా ఏ అపాయమూ లేదని గట్టి నమ్మకం తోచాక, అంతవరకూ ముడిచి పెట్టుకొన్న ఆతోకను పైకి ఎత్తుతుంది. తోక తాలూకు తెలుపుభాగం పైకి లేవగానే, అంతవరకూ వెనక వెనక నే తారట్లాడే దాని సంతతి, ఒక్కసారిగా ఎగురుకొంటూ తల్లి దగ్గిరికి వచ్చి చేరిపోతాయి.

మామూలుగా కుక్కలను పెంచేవారికి, అవి ఎన్నిరకాలైన అనుభూతులని శబ్దాలద్వారా అభివ్యక్తం చేయగలవో బాగా బోధపడుతుంది. మొరగటంలోనే అనేక రకాలైన మార్పులు చేసి ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ, వేడికోలునీ, ఆందోళననీ, ఆషామాషీతనాన్నీ అవి తేలికగా తెలియచేయ గలవు.

మగ జంతువులు సామాన్యంగా చేసే శబ్దాలలో హెచ్చు భాగం ఆడజంతువులతో 'ప్రేమ గీతాలు' ఆలాపించవలసిన అవసరం వచ్చినప్పుడు చేసేవే. ఆ అరుపులు ఆడ జంతువులపాలిటి 'ప్రేమ పిలుపు'గా మాత్రమే కాక, మిగిలిన మగ జంతువుల కివి ఒక హెచ్చరికగా కూడా పని చేస్తాయి. మూతి వెడల్పుగా వుండే మొసళ్లు కొన్ని వుంటాయి. వాటిని 'ఎలిగేటర్ల'ంటారు. అల్లాంటి 'ఎలిగేటర్ల'లో ఒక మొగఎలిగేటర్ తాలూకు 'ప్రేమ పిలుపు'ను అమెరికాలోని ఒకానొక సంస్థవారు గ్రామఫోను రికార్డు చేయించారు. ఈ రికార్డును పనిగట్టుకు మరెక్కడికో పట్టుకుపోయి, అక్కడ ఒక మొగ మహారాజు అయిన ఎలిగేటర్ నిద్రపోతూవుంటే, దానికి వినిపించేలాగా యీ రికార్డును వేశారు. ఆ అరుపు వినపడీ వినపడకముందే, అంతక్రితంవరకూ తన అధికారానికి చలనం వుండబోదన్న గాఢ విశ్వాసంతో గురకపెట్టినిద్రపోతున్న యీ

'ఎలిగేటర్', ఒక్కసారిగా త్రుళ్లి పడిలేచి, తానిదివరకే ఆ ప్రాంతంపై సంపాదించుకొన్న హక్కుకి భంగం వచ్చినట్లు భావించి, అతి భయంకరంగా చిందులుతొక్కి అంతకంటే బిగ్గరగా అరవటం ఆరంభించింది.

శాస్త్రవేత్తలు, అందులోనూ ముఖ్యంగా జర్మన్ శాస్త్రవేత్తలు, జంతువుల భాషలను గూర్చి విపరీతమైన పరిశోధనలు చేశారు. వారి కృషి ఫలితంగా కోడిపుంజులకి మొత్తం 7 రకాల 'పదాలు' వుంటాయనీ, అలాగే గుర్రాలకి ఆరు 'పదాలు', మూడు విధాలైన సకిలింపులూ వుంటాయనీ తేలింది. మరొక శాస్త్రవేత్త పెంపుడు పిల్లులపై పరిశోధనలు జరిపి, వాటి పదజాలం 15 దాకా వుంటుందని తేల్చాడు.

మనుష్యుల పెంపకానికి మచ్చికైన జంతువులు, అడవుల్లో హాయిగా బ్రతికే వాటి సోదరులకంటే యినుమిక్కిలిగా భావవ్యక్తీకరణ పద్ధతులను అలవరుచుకొన్నట్లు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. మన యిళ్లలో పెరిగే పిల్లి, తనకి తిండికావాలని చెప్పటానికి 'మ్యావ్' అని అదొకరకంగా అంటుంది. ఇంటి కుక్కను ఆరుబయటనే వదిలేసి, మనం యింటి తలుపులన్నీ బిగించుకు పడుకొన్నప్పుడు అది బయటినుంచీ చేసేచప్పుడు అదొక తరహాగా వుంటుంది. ఏమైనప్పటికీ, అడవుల్లో బ్రతికే పిల్లులకీ, కుక్కలకీ యజమాని అంటూ ఎవడూ వుండడు కాబట్టి- వాటికి యిలా స్వరాలు మార్చుకోవలసిన అవసరం కానీ, తమ మనస్సులోని భావాన్ని ఎలాగైనా సరే మరొక మనిషి అన్నవాడికి తెలియచేయవలసిన అవసరంగానీ లేదు. అలాటి అవసరాలన్నీ వున్న పెంపుడు జంతువులు, అవసరానికి తగ్గట్లుగా తత్వాలు మార్చుకోవటం విధిగా జరుగుతుంది.

మనం అందరం మామూలుగా మన యిళ్లల్లో తిరిగే చీమలను గమనించి చూస్తే, చమత్కారమైన విషయాలు చాలా బయటపడుతాయి. చక్కెర సీసాకు మూత పెట్టటం మనం మరచిపోయామను కొందాం. ముందుగా ఏదో ఒక్క చీమ యీ విషయాన్ని పసిగట్టేస్తుంది. వెంటనే అది మహా తొందరగా బయలుదేరి మిగిలిన అన్ని చీమలూ వుండే పుట్ట దగ్గిరకు పోతుంది. ఆపోయే దారిపొడుగునా దానికి మరెన్నో చీమలు ఎదురౌతాయి ఎదురైన ప్రతి చీమదగ్గిరకీ యిది పనిగట్టుకుపోయి, తన ముట్టెను ఎదురు వచ్చిన చీమ ముట్టెకు తాకించి మరీ పోతుంది. ఈవిధంగా యిది అన్ని చీమలకీ చక్కెర దొరికిందనే విషయాన్ని అందచేసేస్తుంది. మళ్లా యీచీమ బయలుదేరివచ్చి, చక్కెరసీసా ఎక్కడ వుందో చూపించటం కోసం మిగిలిన చీమలు ఆగిపోకుండా, వార్త అందిన వెంటనే వాటంతట అవే బిలబిలాముందుకుపోతాయి ఆసీసా ఎక్కడవుందో అన్నీకూడా అవలీలగా అక్కడికే చేరిపోతాయి వీటన్నిటికీ దారి ఎలా తెలిసిందీ అనేది, మనకు పట్టుకున్న సమస్య. వాటిల్లో వాటికి ఏదైనా భాష వున్నదా అనే అనుమానం కల్గుతుంది. అర్థం కాని విశ్వ రహస్యాలలో యిదొకటి. ఎంతో మంది జిజ్ఞాసువులైన శాస్త్రవేత్తలు యీ విషయమై సుదీర్ఘమైన పరిశోధనలు జరిపారు.

ముందుగా చక్కెర సీసాను కనిపెట్టిన చీమ చకచకా పుట్ట దగ్గిరకి వచ్చేస్తూ, దారిలో ఎదురైన ప్రతి చీమతోనూ ముట్టె తాకిస్తుంది కదా! ఆముట్టె తాకించటంలోనే ఏదో భాష యిమిడి వుంటుందని పలువురు నమ్మేవారు. పినైర్లా అనే ఆయన ముఖ్యంగా చీమల జీవితాన్ని గూర్చి అనుపమానమైన కృషిచేసి అనేకమైన క్రొత్త క్రొత్త విషయాలను కనిపెట్టాడు. ఆయన అభిప్రాయం ప్రకారం, యీ ముట్టె తాకించటమనేది కేవలమూ వాటి ఆనందోద్రేకాన్ని పంచుకోవటం తప్ప, అంతకంటె ఏమీ కాదట.

తదనంతరం జరిగిన పరిశోధనలలో అసలు రహస్యం బయటపడింది. ఏచీమకైతే యీ చక్కెర సీసా ముందుగా కనబడిందో, ఆచీమ వొంట్లో వుండే కొన్ని గ్రంధులలో నుంచీ అదోకరకమైన వాసనగల పదార్థం ఏదో బయటకి కారడం ఆరంభమౌతుంది. దోవపొడుగునా వుండే ఆపదార్థాన్ని బట్టీ, ఆ వాసనని బట్టీ మిగిలిన చీమలన్నీ ఎవరి సహాయమూ అక్కర లేకుండానే సరా

(42-వ పేజీ చూడండి)



శ్రీ పేటేటి
నారాయణ లోకమాన్య

"శారదా; శారదా! లేవే! ఎప్పుడూ మొద్దునిద్రేనా? ఆడుకొనేందుకు సుశీలా, లలిత కూడా వచ్చారు, లేవవే!" అంటూ నిద్ర లేపుతున్న పుష్పను, కళ్ళు తెరిచి చూచింది, శారద.

"ఇది కలా, నిజమా?—అరే! పుష్పేమిటి! మాయింటికి వచ్చి నిద్రలేపటమేమిటి!! పండగ రోజేగా వాళ్ళమ్మా, మాఅమ్మా తగాదాపడ్డారు. శారదావాళ్లగడప త్రొక్కావంటే, నీ కాళ్ళిరగ కొట్తాను అని పుష్పను వాళ్లమ్మ హెచ్చరించిందే! ఆరోజు నుంచేగా నేనూ సుశీలా, లలితా ఆడుకొంటుంటే రెండు మూడు సార్లు మావద్దకు రాబోయి, వాళ్ళమ్మ కేకలతో ఏడుపు మొఖం పెట్టి దీనంగా మావంక చూస్తూ తిరిగి వెళ్ళి పోయింది పుష్ప—పాపం!

"అయినా పుష్పేం చేసింది? పెద్దవాళ్ళ తగాదాలకు పిల్లలం మేమేం చేస్తాము? మొన్న అంటే మొన్న ప్రొద్దున్నేగా-నేనూ లలిత అంతగా కొట్లాడుకొని మొఖమంతా గాట్లుపడేలాగిక్కున్నామే, తెల్లవారగనే మళ్ళీ కలిసి మెలసి ఆడుకోలేదూ! మరీ యీ పెద్దవాళ్ళు, తగాదాలను తెంచకుండా పెంచుకుంటూ, అణగారిపోయిన వాటిని తిరిగి పైకితెచ్చి మళ్ళా రచ్చకెక్కుతుంటారు. అయినా మా అమ్మకు యింత పట్టుదల ఎందుకు? పుష్పా నేనూ ఆడుకుంటుంటే ఫెళ్ళున నా చెంపమీద కొట్టి రెక్క పట్టుకొని యింటికి యీడ్చుకొచ్చింది.

"పుష్ప తల్లి ఎంత మంచిది! మాతో మళ్ళీ ఆడుకునేందుకు వెళ్ళమ్మా అని చెప్పి పంపింది కాబోలు! నేను యింకా అనుమానంతో కళ్ళు నులుముకొంటూ చూచాను. పుష్ప కే ఏ అనుమానమూ లేదు.

"పుష్పా మా యింటికి వచ్చావా? వస్తుంటే మీ అమ్మ కోప్పడలేదూ? కొంపతీసి నువ్వు మా అమ్మకి కన్పించలేదు కదా? ఇలారా కూర్చో, భయపడ్తావెందుకు? అయితే నేనే వస్తానుండు" అంటూ పుష్పతో బయటకు నడచింది శారద.

"లలిత ఇంట్లో బొమ్మలుపెట్టి, పెళ్ళిళ్ళు చేద్దామనుకున్నామే. సుశీలను కూడా పిల్చాను. ఇప్పుడే అది, లలిత యింటికి వెళ్ళింది. నేను నిన్ను లేపుకొని బొమ్మలు, ఆట సామాగ్రి తీసుకు వెళ్దామని వచ్చాను. ఇదిగో, శారదా! యివ్వాళ ఆదివారంకూడా: కొండపల్లి బొమ్మలు కూడా తేవాలి. మర్చిపోకుండా పెందరాడే వస్తావు కదూ? బొమ్మలు మర్చిపోకే?"



అంటూ చెంగు చెంగున లేడిలా పరిగెత్తుకు వెళ్ళింది పుష్ప.

శారద త్వరత్వరగా కాలకృత్యాలు ముగించి, కాఫీ త్రాగి, వాళ్ళమ్మకంట బడకుండా బొమ్మల బుట్ట చంకను పెట్టుకొని లలిత యింటికి జారుకుంది. లలిత యిల్లు పెద్ద మేడ. ఆమేడమీద మెట్ల దగ్గరగా ఒక చిన్నగది. ఆగదికిముందు ఒక వసారా. ఆవసారాలో ఆడుకు నేందుకు నలుగురూ చేరారు.

లలిత, పుష్ప ఓజట్టు; శారద సుశీల ఓజట్టు. "ఈగది వాకిట దగ్గర మా యిల్లు, ఆమెట్లకు ప్రక్కగా మీయిల్లు వుందను కుందాం" అంది పుష్ప. 'సరే నన్నారు' మిగిలిన ముగ్గురు.

"అయితే వస్తువులు పంచండి" అంది లలిత. 'నేను పంచుతా నుండండి' అంటూ శారద ముందుకు వచ్చింది.

"పక్షపాతం లేకుండా పంచాలి సుమా!" అందుకుంది లలిత.

"అది మా యిష్టము అన్ని బొమ్మలూ శారదవే కదటే? దాని యిష్టం వచ్చినట్టు పంచుతుంది" అంది సుశీల.

"అయితే మాత్రం; ఆటలో అవేమి పనికిరావు. ఆట కాగానే దాని బొమ్మలు దానికే యిచ్చేస్తాంగా" పెత్తెంచేసింది లలిత.

శారద అన్ని బొమ్మలూ పంచింది. కొండపల్లి బొమ్మలు మాత్రం పంచలేదు. తను వాటి నెంతో ప్రేమతో చూసుకొంటుంది. ఎవ్వరినీ ముట్టనివ్వక దాచుకొనేది. అందుకనే ఆబొమ్మలు తనొక్కతే వుంచుకొంది. లలిత, పుష్పా పేచీ పెట్టారు. "ఆ బొమ్మలు కూడా పంచకపోతే మేము ఆటకు రానే రాము" అని. ఇక తప్పని సరి అయింది-పంచక తప్పిందికాదు.

పుష్ప చేతులోనుంచి కొండపల్లి బొమ్మ క్రిందపడి విరిగిపోయింది. శారద చూచింది. కోపం పట్టలేక పుష్పనెత్తిన ఒక మొట్టు మొట్టింది. పుష్ప దీనంగా శారదవంక చూస్తూ "పొరపాటున జారిపడిందే. నిజంగా పడవెయ్యాలని పడవెయ్యలేదు" అని నర్ది చెప్పబోయింది.

శారదకు కోపం తగ్గలేదు, ఏమీ చెయ్యలేకపోగా, యిష్టమొచ్చినట్లు పుష్పను తిట్టిపోసింది. సుశీల లలిత కూడా పుష్పపక్షం వహించి శారదతో దెబ్బలాడబోయ్యారు. శారద ఏడుపు లంకించుకొని "మా అమ్మతో చెప్తానుండు..." అంటూ యింటికి వెళ్ళడానికి మెట్లు దిగబోయింది.

పుష్ప శారదను బ్రతిమి లాడుతూ ఆటకు రమ్మని చెయ్యి

(43-వ పేజీ చూడండి)



పిల్లి మెడలో గంట

శ్రీ వి. కె. ఎన్. శర్మ

నేనూ, మా వెంకటేశ్వర్లూ, వేసంగి శెలవల్లో కాకినాడ వెళ్లాం. ఫోర్త్‌ఫారం పరీక్షలయ్యాయి. ప్యాసవుతామనే ధైర్యం.

వెంకటేశ్వర్లు థర్డ్‌ఫారమ్ కాకినాడలోనే చదివాడు. సూర్యారావ్‌పేటలో ఆ మెయిన్ రోడ్డుకు దగ్గరగా ఒక పెద్ద మేడవుంది. ఆ మేడ పరిసరాల్లో మరి ఏ యిల్లూ లేదు. ఆ మేడను చూడ్డంతోటే మా వాడికి ఎందుకో గుండె ఝల్లుమంది. ఉట్టినే బెదురుతున్నాడు. గేటుదాక వెళ్లి ఎందుకో వంగి చూశాడు. గుండె నిబ్బరం వచ్చినట్లుంది: దెబ్బతో తాను N. C. C. లో నేర్చుకున్న నడకతో నన్ను చేరి ఇంటి ముఖం పట్టాడు.

"ఎందుకురా! అల్లా వణికావ్, ఆ మేడను చూచి?" అని నేను అడిగితే, తేలుకుట్టిన దొంగలా ముఖంపెట్టి "ఆ పక్కగా ఏదో జర్రున పాకినట్లయితే భయం వేసిందిరా!" అని అబద్ధమాడాడు. అయినా నేను నమ్మినట్లూరుకున్నాను.

నాకూ వీళ్ళకీ తెలిసిన వాడు, యింకొకడున్నాడు. వాడే అబ్దుల్. వెంకటేశ్వర్లతో యింటికి చేరి చల్లబడగానే, వాడికి తెలియకుండా అబ్దుల్ యింటికి వెళ్ళి, "మా వెంకటేశ్వర్లు ఎందుకు వణికిపోయాడో నీకేమయినా తెల్సునా?" అని అడిగాను. వాడదివిని నవ్వాడు కానీ, తాను కూడా అదోరకమైన వణుకుతోనే "అదికాదురా! అక్కడ రెండు వేటకుక్కలున్నాయిరా! వాటిని చూస్తే మాకు భయంరా!" అన్నాడు.

మా వెంకటేశ్వర్లు పాములాంటిదేదో వుందంటే, వీడు కుక్కలన్నాడు. నాకు నవ్వు వచ్చింది అయినా ఊరుకొన్నాను దగ్గర్లోనే యింకో క్రైస్తవ స్నేహితుడున్నాడు. వాడిపేరు రత్నం. వాడు అబద్ధాలు ఎప్పుడో కాని ఆడడు. వాడింటికి వెళ్ళి, యీ యిద్దరి మాటలూ చెప్పాను. అన్నీవిని "అవి కోతలురా" అన్నాడు వాడు.

అసలు సంగతి వాడిల్లా చెప్పడం మొదలుపెట్టాడు.

"మిత్రత్రయమైన నేనూ, అబ్దుల్, వెంకటేశ్వర్లూ థర్డ్‌ఫారం పెద్దపరీక్షలయ్యాక సెలవలలో కలిసి తెగ తిరిగే వాళ్లంరా.


"వెంకటేశ్వర్లు ఏ మేడను చూసి వణికాడో, ఆ మేడలోకి కొత్తగా ఎవరో అద్దెకుదిగారు. వారికిద్దరు పిల్లలున్నారు. పిల్లల్ని ఎత్తుకోడానికి ఒకడ్ని, పనిచేయడానికి ఒకడ్ని వాళ్లతోపాటే పొరుగూరినుంచి తెచ్చుకున్నారు. పిల్లల్నెత్తుకునే వాడి పేరు రంగయ్య. వాడు కాళీగా ఏరిక్షా అయినా కనపడితే, రిక్షావాడక్కడ లేకపోతే, ఆ యిద్దరు పిల్లల్నీ అందులో ఎక్కించి ఇటూ, అటూ లాగే వాడు.

"ఒకరోజున మేము అటే తిరుగుతున్నాము. అప్పుడే రంగయ్య పిల్లలిద్దర్నీ ఎవడి రిక్షామీదనో ఎక్కించుకుని తిప్పుతున్నాడు. 'జల్దీ' 'జల్దీ' అని ఆ పిల్లలు కేకవేస్తుంటే వాడు జోరుగా పరిగెత్తి, రిక్షాని తిప్పడం చేతకాక, ఎదురుగా వున్న ఒక వేపచెట్టుకి దభేలుమని గుద్దించాడు. రిక్షా అడ్డుకర్ర రెండు ముక్కలయింది. అది చూచి

రెండో బంట్రోతు "రిక్షామని సొచ్చి అడుగుతే ఏమని సెప్తావు?" అన్నాడు.

"రంగయ్య మాట్లాడకుండా యిద్దరు పిల్లల్ని చంక నేసుకొని ఇంట్లోకి పరిగెత్తాడు. మేము ముగ్గరం మాత్రం రిక్షావాడు రాగానే వాడితో, రంగయ్య బండీ విర కొట్టాడని చెప్దామనికూర్చున్నాము. ఇంతలో బంగారయ్య వచ్చి, తన రిక్షాను చూసుకుని "ఎవరు విరగ కొట్టారని" అడిగితే వెంకటేశ్వర్లు ఎదురింటివారి నౌకరు విరగ్గొట్టాడని చెప్పి వాడి దగ్గరకు మేము ముగ్గురం వస్తాం పద మన్నాడు."

వెంకటేశ్వర్లకు బంగారయ్య రిక్షా, అంటే అంత పట్టుదల ఎందుకంటే తనకు బడిరోజుల్లో ఏకాలమయినా సరే, ఆ బంగారయ్య ఒకే బేరానికి వచ్చేవాడు. బంగారయ్య ఆపెద్ద మేడవద్దకు వెళ్లి, బండీ విరిగిపోయి నందుకు రిక్షా యజమాని తనవద్ద హెచ్చుధనం వసూలు చేస్తాడని చెప్పుకొని ఏడ్చాడు. ఆయింటి యజమానురాలు "మా రంగయ్య బండీ విరగకొట్టలే"దని మొండిగా చెప్పేలోగానే, రంగయ్య తప్పుకు పోయాడు. కాని మేముముగ్గురం మాత్రం ఆయింటిని విడువలేదు. బీదలకు అన్యాయం జరుగుతూ వుంటే చూడలేమని మహా ఆవేశ పడ్డాం.



పరిగెత్తుతున్న మాకు "ఈసారి యీ వీధికిరస్తే బడితపూజ చేస్తాను." అన్న ఆ యింటి యజమాని మాటలు మాకు వినిపించాయి.

"రంగయ్య విరగ కొట్టడం మేము చూశామని చెప్పాము. ఆవిడ "మీకు సాక్ష్యం ఏది?" అని అడిగేసరికి, "సాక్ష్యమా? మేం చాలమూ?"అని అడిగాము. ఆవిడ "ఊపూరువారు కనుక అంతా ఏకమయి ఏమీ తెలియని అమాయకుణ్ని చేసి మా రంగయ్యని ఏడిపిస్తున్నారు". అంది. వెంకటేశ్వర్లు రెండో నౌకర్ని పిల్చి "నువ్వీందా'కారిక్షామని పొస్తే ఏమని సెప్తావు?' అని అడిగావు కదా!" అని అడిగాడు-తనమాట నెగ్గుతుందనే ధైర్యంతో. కాని వాడు "అసలు నేను మాట్లాడనే లేదు" అని తప్పుకొన్నాడు.

"ఏమీ చేయలేక మేము ఆ ప్రక్కనే వున్న ఖాళీస్థలంలో కూర్చున్నాము. వెంకటేశ్వర్లుకు ఏదో ఆలోచన మనసులో తళుక్కుమంది. ఇంకేం! వాడు మాతో "మనం ఆయింట్లోకి రాళ్లు విసురుదాం రండిరా! వాళ్లెవరయినా రాళ్లు

(43-వ పేజీ చూడండి)



శ్వేతాంక మహారాజుకి లేక లేక ఒక కూతురు పుట్టింది. ఆ అందాల పాప భూమిమీద పడ్డ పుత్తరక్షణం నుంచీ, రాణీ కాళిందీ దేవికి, నామకరణ మహోత్సవం అతి వైభవంగా జరిపించాలనే ఆలోచన కలిగింది.

బిడ్డను చూడవచ్చిన మహారాజుతో, రాణీ కాళిందీ దేవి అడగలేక అడగలేక అడిగింది; 'నామకరణ మహోత్సవానికి అందరినీ పిలిపిస్తున్నారు కదూ' అని.

రాజుగారు చిరాకుపడ్డారు. 'మహారాణీ!- ఈ నామకరణ మహోత్సవాలకి అందరినీ పిలిచి, అంత ఆడంబరంగా జరిపించటంలో ఒక చిక్కువుంది. ఒకసారికి పది సార్లు సరిచూసుకొని ఆహ్వాన పత్రాలు పంపించినా, ఏ దేవతకో పంపించటం మరచిపోతూ వుంటాం. ఆ దేవతకి కోపంవచ్చి, బిడ్డని శపిం చేస్తుంది. అదీకాక - ఏ వృషుకు మోతు భూతమో, దేవతల రూపంలోవచ్చి, మన బిడ్డకి ఏకీడు చేసినా చేయవచ్చు. అంతదాకా ఎందుకు?-మా వంశంలోనే మా ముత్తవ నామకరణమహోత్సవానికి అల్లాగే జరిగింది; దేవతలనందరినీ పిలిచి ఒక్క 'క్రోధి' అనే దేవతను మాత్రం పిలవటం మర్చిపోయారట, మావాళ్లు. ఇక అంతే-ఆ దేవతకు కోపం వచ్చేసి మా నాయనమ్మని 'నూరేళ్లు నిద్రపొమ్మ'ని శపించింది. అందుకనే-మన చిట్టితల్లి నామకరణానికి మనం యీ బెడద అంతా పెట్టుకోవద్దు" అన్నాడు.

"మహారాజుగారు చెప్పినమాట నిజమే. మాపుట్టినింటివారివైపున కూడా యిలాగే జరిగిందట; మా అమ్మగారు తరచు చెప్తూవుండే వారు. ఎవరో ఒక పిల్లకి నామకరణం జరుపుతూ ఒక దేవతను పిలవటం మరచిపోయారట. ఆకోపం కొద్దీ, సరిగ్గా నామకరణం జరుగుతున్న సమయానికి అక్కడ ప్రత్యక్షమైన ఆ దేవత, బిడ్డని శపించేసింది. ఇక ఆక్షణంనుంచీ ఆబిడ్డ నోరు తెరిచినప్పుడల్లా దాని నోటి వెంట కప్పలు రాలేవట," అన్నది రాణీ.

మొత్తానికి నామకరణ మహోత్సవమనేది, ఏదో గుట్టు చప్పుడుగా సంసారపక్షంగా జరుపుకు పోదామని రాజూ, రాణీ యిద్దరూనిర్ణయించుకొన్నారు.

నామకరణం జరుపవలసిన రోజు వచ్చింది. పురోహితుణ్ణి మాత్రం పిలిపించి అందుకు తగిన ఏర్పాట్లన్నీ చేసుకొంటూవుండగా, దాసీ ఒకతె రాజుగారి దగ్గరకు వచ్చి "ఎవరో దేవతాకన్యలు మహాప్రభువును చూడాలని అంతఃపుర మధ్యప్రాకారంలో వేచి వున్నారు. మహారాజు గారిప్పుడు పని తొందరలో వున్నారని చెప్పినా, వాళ్లందరూ పోకుండా అక్కడే కాచుకొనివున్నారు" అని చెప్పింది.

రాజుగారు గబగబా లేచి దుస్తులు ధరించుకొని, మధ్య ప్రాకా

రంలోకి వెళ్లారు. ఈవార్త తెలియగానే రాణిగారు కూడా కంగారు పడుతూ అక్కడికే వచ్చేసింది. తీరా చూస్తే అక్కడ అన్నిరకాల దేవతలూ, మొత్తం ఏడువందల మంది దాకా వేచివున్నారు.

"రాణీ కాళిందీ దేవిగారు శిశువుకి నామకరణం జరిపిస్తూ కూడా మమ్మెవ్వరినీ ఆహ్వానించకపోవటం విచిత్రంగా వున్న"దంటూ ఆ దేవతాకన్యలందరూ రాణీగారిని చూడగానే ఒక్కసారిగా అనేశారు.

"లేదమ్మా! మేము నామకరణ మహోత్సవమే జరుపటం లేదు. ఏదో అతి నిరాడంబరంగా పిల్లకి పేరు పెట్టుకొంటున్నాం. అంతే!" అని రాణీగారు ఏదో చెప్పబోయింది.

ఇంతలోకే – దేవత లందరిలోకీ పెద్దదైన ఆ 'క్రోధి' అనే దేవత ముందుకి వచ్చి, "మాకళ్లు గప్పి, మమ్మలను పిలవకుండా, నీబిడ్డకి నామకరణం జరుపుకో బోతున్నావు గనుక-యిదిగో శపిం చేస్తున్నాను- ఆబిడ్డ తల ఎల్లప్పటికీ బట్టతలగానే వుండిపోతుంది. రండి! ఈ పీనాసి రాణీ యింట్లో మనం యిక ఒక క్షణమైనా వుండవొద్దు. పదండి పోదాం!"అంటూ మిగిలిన దేవతా కన్యల నందరినీ కూడగలుపుకొని చెకచెకా నడిచి వెళ్లిపోయింది.

రాణీ కాళిందీదేవి కుప్పన కూలబడిపోయింది. బిడ్డ ఏమై పోయిందో నన్న దిగులుతో, గబగబా అంతఃపురంలోకి పరుగెత్తింది. ఉయ్యాలలో పడుకొని నిద్ర పోతున్న ఆ పాపను అమాంతం



పైకి ఎత్తి గుండెలకు ఒత్తుకొని, ఏడుస్తూ ఆ పాప తల నిమురబోయింది. పాప తలమీద వున్న పచ్చలటోపీ రాణీగారి చేతికి తగిలి క్రిందపడిపోయింది. అదేమి చిత్రమో—ఆ పచ్చల టోపీతో పాటు పాప తలమీది వెంట్రుకలన్నీ కూడా ఒక్కసారిగా రాలి గాలిలో కొట్టుకు పోయాయి.

రాణీ భోరుమని ఏడ్చింది. ఆమెను అనునయిస్తూ శ్వేతాంక మహారాజు "కలవరపడకు మహారాణీ! కలవరపడకు...అన్నట్లు మా పెదతల్లిగారు, తనకు ఒక దేవత యిచ్చిన వరం ఒకటి వుంటే, నాకు ఆమె ఆవరాన్ని మన పెండ్లినాడు కానుకగా యిచ్చినా, అది వాడుకోవలసిన

సుకేశిని కేశవృత్తాంతము

అవసరం యింతవరకూ రానందువల్ల నేను దానివిషయం పూర్తిగా మర్చిపోయాను. నమయానికే జ్ఞాపకం వచ్చింది... కానీ ఆవరాన్ని మనం యిప్పుడే వాడెయ్యకుండా అమ్మాయి పెద్దదయ్యేదాకా ఆగితే, దానికేది యిష్టమౌతుందో, దానికోసమే ఆవరాన్ని వాడుకోవచ్చు. నువ్వుమాత్రం విచారపడకు" అన్నాడు.

కాలం గడిచిపోయింది. పాప పెద్దదైంది. పిల్లతల ఎల్లాగూ బట్టతలే అయిపోయింది కదా, పేరు అయినా మంచిది పెట్టుకొని తృప్తిపడదామని ఆ అమ్మాయికి తల్లితండ్రులు 'సుకేశిని' అని పేరు పెట్టుకొన్నారు. ఆ అమ్మాయి బంగారు తీగెలా మెరిసిపోయే అందాలరాణిగా తయారైంది. సుకేశిని మాత్రం తలమీది కిరీటాన్ని నిద్రపోయేటప్పుడుకూడా తీసేసేది కాదు.

ఒకరోజున రాజూ రాణీ అమ్మాయిని పిలిపించి నామకరణ మహోత్సవంలో జరిగిన ఆ అపసవ్యపు వ్యవహారమంతా వివరించి, తండ్రిగారివద్ద వాడుకోని వరమొకటి మిగిలివుందని చెప్పి, ఏం కావాలో కోరుకోమన్నారు. సుకేశిని వెంటనే తనకి బోలెడంత జుట్టు పెరగాలని కోరికగా వున్నట్లు బయట పెట్టింది.

రాజుగారు యీ విషయాన్నంతటిని వివరిస్తూ, తన పెద్దతల్లికి ఒకజాబు వ్రాశాడు. అందులో ఆమె తనకానాడు యిచ్చిన వరం యింకా వాడుకోనే లేదనీ, యిప్పుడు దాన్ని వాడుకొనే అధికారం తనకూతిరికి దత్తం చేస్తున్నాననీ తెలియచేసి, అందుకు ఆమెను అంగీకరించమని ప్రార్థించాడు. ఆజాబుని ఒక తూనీగచేతికి యిచ్చిపంపించాడు.

వాయువేగ మనోవేగాలతో పోయిన ఆతూనీగ, తృటికాలంలోనే తిరిగొచ్చి, రాజుగారి పెద్దతల్లి అందుకు వొప్పుకొన్నదని తెలియచేసింది.

రాణీగారి సంతోషానికి పట్టపగ్గాలు లేవు. రాజకుమార్తె అయితే - ఆ సంతోషం పట్టలేక - వెర్రిగంతులు వేస్తూ - "రోజు రోజుకీ రెండు అంగుళాల చొప్పున పెరిగే వినీల కుంతలాలు కావాలి. కత్తిరించినప్పుడల్లా రెట్టింపు పొడుగు పెరిగే జుట్టుకావాలి" అని యింకా యింకా ఏమేమో కావాలని కోరుకోబోతూ వుండగా రాజుగారు అడ్డు తగిలారు.

రాణీగారికి కోపం వచ్చింది. "పిల్ల ముచ్చటపడి జుట్టుకోసం వరమడుగుతూ వుంటే, అలా అడ్డు తగులుతారేం?" అని హెచ్చరించింది. రాజుగారు చిరునవ్వు నవ్వుతూ "అడ్డుతగలటమే నయమైంది. ఇంకా ఏమని కోరుకోబోయావమ్మా?" అని కూతురిని అడిగాడు.

"తలమీదజుట్టుఎక్కడా సందు లేకుండా ఒత్తుగా పెరగాలని కోరుదామనుకొంటూ వుండగా మీరు అడ్డువచ్చేశారు" అన్నది సుకేశి బిక్కమొఖంతో.

"పోనీలే అమ్మా! అలా కోరుకోక పోవటంవల్ల మేలేకాని, నష్టం ఏమీ లేదులే!"

"నష్టం లేకపోవట మేమిటండీ!" రాణీగారు అడిగింది.

"తెలుస్తుందిలే, త్వరలోనే!" అన్నాడు, ఎంతపెద్ద లెక్కలైనా అరనిముషంలో కట్టే బుద్ధి కుశలత గల ఆ మహారాజు.

ఆరాత్రి నుంచే సుకేశిని తలపై జుట్టు పెరగటం ప్రారంభమైంది. మరునాడు వుదయం లేచి చూసే సరికి, ఆఅమ్మాయి తలమీద బాగా గజం పొడుగు జుట్టు వేల్లాడుతోంది. మరునాడుదయానికి మరొక రెండు అంగుళాలు పెరిగింది. ఆవిధంగా ఐదువారాలు గడిచేసరికి ఆ అమ్మాయి జుట్టు బాగా రెండుగజాల పొడవు పెరిగింది. రెండుగజాల జుట్టు వుండటమంటే అది ఎవరికైనా చాలా వుతుకుష్టమైన విషయమే. మనిషి నడుస్తూ వుంటే, వెనకాల ఆజుట్టు కొసలన్నీ నేలమీద జీరాడుతూ, చెత్తా చెదారం పోగుచేస్తూ వుంటాయి. ఆ అమ్మాయి తిరిగేది రాజభవనం కనుక, అక్కడ అట్టే చెత్త చెదారం వుండకపోయినా, అక్కడ వుండే ఆ బంగారం, ఆ రత్నాలేచాలు, ఆ అమ్మాయికి చిరాకు కలిగించటానికి. అంతటితో ఎదగటం మానేసినా ఫరవాలేదు; ఆజుట్టు నంతటినీ చుట్టలు చుట్టించి నడినెత్తిమీద పెట్టుకు తిరిగేది. అలా ఆగకుండా రోజుకొక రెండు అంగుళాల చొప్పున పెరిగిపోతూనే వున్నదాయె. మూడుగజాలు పెరిగే సరికి, ఆ రాజకుమారి యిక

భరించలేక దాసీ దాన్ని పిలిపించి మొదలంటా కత్తిరింపించుకొన్నది. కొన్ని గంటలపాటు మాత్రం తెరిపిగా వున్నది. కానీ, ఆట్టేసేపు కాకముందే వెనుకటి వరాన్ని అనుసరించి, ఆజుట్టు యిదివరకు రోజుకి రెండు అంగుళాలు చొప్పునే పెరిగితే, కత్తెరపడిన కారణంచేత, యిప్పుడు రోజుకి నాలుగు అంగుళాల చొప్పున పెరగటం ప్రారంభించింది. ఇదివరకు ఆజుట్టు రెండు గజాలు ఎదగటానికి ఐదువారాలు పట్టితే. యిప్పుడు ముప్పైఆరు రోజుల్లోనే ఆరుమూరలైపోయింది. ఆ రాజకుమారికి మళ్లీ బాధ మొదలైంది. ఏమి చెయ్యటానికీ తోచక ఒకరోజు రాత్రి ఏడుస్తూ కూర్చున్నది. మళ్ళీ దాదినిపిలిపించి కత్తిరింపించుకొంది. కొద్దిగంటలు తెరిపిగా వున్నట్లే తోచింది కానీ, మళ్లా అంతలోనే యీసారి, రోజుకి ఎనిమిది అంగుళాల చొప్పున పెరుగుదల ప్రారంభమైంది. మళ్లా బాధ మొదలైంది. భరించలేక మళ్లా కత్తిరింపించుకొంది. మళ్లీ జుట్టు యింకా త్వరగా పెరగటం ప్రారంభమైంది. మళ్లా కత్తిరింపించికొంది. రాను రాను ప్రతిరోజూ ఆరాజకుమార్తె వుదయం నిద్దర లేచేసరికి ఆ అంతఃపురం అంతఃపురమంతా, యీవిడ తాలూకు జుట్టుతో నిండిపోయి వుండేది. ఎక్కడ చూసినా యీమె వెంట్రుకలే అడ్డంవచ్చి, మనుష్యులు కదలటానికిగానీ, గాలి పీల్చుకోవటానికిగానీ వీలులేకుండా తయారయ్యేది. దాసీలు పదిమంది పడి ప్రొద్దున్నే యీవిడ జుట్టు నంతటినీ ఎక్కడికక్కడ కత్తిరించి కట్టలుకట్టి గడ్డి వాములు వేసినట్లు పెద్ద పెద్ద కుప్పలు పేరుస్తూ వుండేవారు.

మొదట్లో రాజుగారూ,మంత్రులు అందరూ కలిసి యీ అమ్మాయిగారి వెంట్రుకలని చక్కని బంగారపు పెట్టెల్లో పెట్టి రాజ బంధువులకీ, సామంతరాజులకీ, వున్నత ప్రభుత్వోద్యోగులకీ బహుమానాలుగా పంపిస్తూ వచ్చారు. ఎంతవరకని యిలాంటి బహుమానాలు పంపగలరు? అక్కడ చూడబోతే రోజుకొక వామి తయారు అవుతున్నది.

కాలం యిల్లా గడుస్తూ వుండగా ఆరాజ్యంలో వున్నట్లుండి పెద్ద కరువు వచ్చింది. ప్రజలు, పశువులు తినటానికి తిండీ, త్రాగటానికి నీళ్లు లేక అలమటించి పోతున్నారు. విదేశాల వారికి అవసరమయ్యేది ఏదైనా యిచ్చి, వాళ్లదగ్గరనుంచీ తినుబండారాలు తెచ్చుకొందామన్నా, యీరాజ్యంలో ఏవస్తువూ పండటమే లేదు. రాజుగారికీ మంత్రులకీ ఏమి చేయటానికి తోచలేదు.

ఒకరోజున సుకేశినియే సాహసించి తండ్రిని పిలిపించి "యీ మాయదారి జుట్టు ఒక్కటే వానల్లేకపోయినా పుష్కలంగా పుట్టుకువస్తోంది. దీన్నే ఏదో రకంగా వాడి, వస్తువులు తయారు చేయించి యితర దేశాల వారికి అమ్మితేనైనా కొంత డబ్బు వస్తుందేమో ఆలోచించండి" అని చెప్పింది.

రాజుగారు మంత్రులందరినీ సమావేశపరచి, సమాలోచనలు జరిపించారు. చివరికి యీ జుట్టుతోనే పరుపులూ దిండ్లూ తయారు చేయించి, రాజవంశపువారి కేశాలతో తయారైన వస్తువులు కనుక వీటిని మంచిధరకు అమ్మించవచ్చునని నిర్ణయించారు. ఎన్ని వేల పరుపులూ, దిండ్లూ కుట్టించినా యింకా జుట్టు మిగిలి పోతుంటే, ఆజుట్టుతోనే సన్నని తెరలు నేయించి అవీ అమ్మారు. మొత్తానికి ఎలాగైతే నేం బోలెడన్ని వస్తువులు తయారైనాయి. పైదేశాల వాళ్లు కూడా వీటికోసం పోటీలు పడి కొన్నారేమో-యీరాజ్యంలో వచ్చిన క్షామం పూర్తిగా తీరిపోయింది.

ఐనా యింకా జుట్టు పెరగటం ఆగనేలేదు. ఆ జుట్టుతో ఏం చేయాలో రాజుగారికిక ఏమీ తోచలేదు. సుకేశినికికూడా యిది తలకు మించిన భారమైపోయి, పసికందుగా వున్ననాడు, తన బట్టతలను కప్పెయ్యటానికి వుపయోగపడ్డ ఆ పచ్చటోపీలను చూసి కుళ్లి కుళ్లి ఏడుస్తూ,యీ పీడపోయి, ఏలాగైనా ఆ వెనుకటి బట్టతలైనా వచ్చేస్తే చాలని వేయి దేవుళ్లకు మ్రొక్కుకోవటం మొదలుపెట్టింది.

చివరికి యిక యిల్లా కాదని శ్వేతాంక మహారాజు గారు వాళ్ల పెద్దతల్లికి వుత్తరం వ్రాశారు. అందులో తామంతా ఆఅమ్మాయి జుట్టు మూలంగా పడుతున్న బాధనంతటినీ వివరించి, ఎలాగైనా సరే ఆ వరాన్ని వుపసంహరించి యీ బెడద లేకుండా చేయమని బహువిధాలుగా ఆమెను ప్రార్థించాడు. ఆవుత్తరాన్ని యీసారి ఒక పికిలి

సుకేశిని కేశవృత్తాంతము

పిట్టకి యిచ్చి వేగంపోయి సమాధానం పట్టుకురమ్మని పురమాయించాడు.

ఉత్తరం పట్టుకుపోయిన పికిలిపిట్ట వెంటనే సమాధానం పట్టుకొచ్చింది. ఆసమాధానంలో "ఈ ఆపదను నివారించగల రాజకుమారులకోసం ప్రకటనలు చేయించవలసింది. అలా చేయగల వారికి అమ్మాయినిచ్చి వివాహం చేస్తామని కూడా తెలుపుదు చేయవలసింది" అని వున్నది.

ఆ ప్రకారమే శ్వేతాంక మహారాజుగారు అన్ని వైపులకీ ప్రచారకులని పంపించి యీ అన్ని విషయాలనీ దేశం నలుమూలలా చాటించారు.

ఎందరెందరో రాజకుమారులు ఎక్కడెక్కడినుంచో యీ రాజ్యానికి బిల బిలా వచ్చి పడ్డారు. వారిలో ప్రతి ఒక్కడూ రోమ నిర్మూలకౌషధాలను సీసాలలోనూ పీపాలలోను పట్టుకొచ్చారు. ప్రతి, ఒక్కడూ ప్రయోగాలు చేసి చూశాడు. ప్రయోజనం లేకపోయింది.

అన్నట్లు-యిటీవల ఆరాజకుమార్తె జుట్టు అంతఃపురంలోని ఏ మందిరంలోనూ పట్టకపోయినందువల్ల, ఆమె సింహాసనం వున్న సభామంటపంలోనే ఆమె వుంటూ, కాలంగడుపుతోంది. అక్కడకూడా ఆవిడ వుదయం నిద్రలేచి చూసేసరికి అంత పెద్ద భవనమూ, యీ కేశాలనే ఆ మహాసముద్రంలో మునిగిపోయి వుండేది. ప్రతిరాత్రీ పడుకోబోయే ముందు, అప్పటివరకూ పెరిగిన ఆజుట్టునంతటినీ పద్ధిమంది దాసీలచేత కత్తిరింపించుకొని, కొంత తెరిపి పడ్డాక, అల్లాగ కొంచెం ముందుకి నడిచిపోయి' అక్కడ ఒక పెద్దకిటికీ వుంటే అందులో కూర్చొని కాసేపు ఆకాశంవంకా, చంద్రుడివంకా చూస్తూ మరునాడుదయం కండ్లు తెరుచుకు చూసేసరికి ప్రత్యక్షమయ్యే ఆ రోమ సముద్రాన్ని గూర్చి తలుచుకొని విచారపడుతూ వుండేది.

నడి వేసవికాలపు ఒకానొక సాయం సమయాన ఆవిడ అల్లాగే ఆకిటికీలో కూర్చొని వేడి నిట్టూర్పులు విడుస్తూ వుండగా ప్రతాపసింహుడనే రాజకుమారు డొకడు ఆవిడ కంట బడ్డాడు.

పిండారబోసినట్లు వెన్నెల కాస్తోంది. రాజోద్యానవనంలో పడిన వెన్నెల నేలమీద నీడలతో జల్లెడలు నేసినట్లుంది. అలాంటి వెలుగునీడల పడుగు పేకల్లోనుంచీ కాలిబాటను కదిలిపోతున్న ప్రతాపసింహుడు ఎందుకో ఒకసారి తల పైకియెత్తి చూశాడు. సరిగ్గా ఆ సమయానికే సుకేశినీ రాజకుమారి కూడా క్రిందికి చూసింది. చూసింది తడవుగా ఆవిడకు ఎందుకనో, యీ రాజకుమారుడే తన ఆపదను తొలగించగలడన్న ఆశ ఒకటి కలిగింది.

(ఇంకావుంది)

★ జంతుకోటిలో మానవ లక్షణాలు ★

34-వ పేజీ తరువాయి)

సరి చక్కెర సీసాదగ్గిరకి చేరిపోగలవు.

ఈ అభిప్రాయం సరిఅయినదో కాదో ఋజువు చేసుకోవటానికి శాస్త్రవేత్తలు ఒక చిన్న కిటుకు కనిపెట్టారు. చీమల పుట్టకు చుట్టూ కొన్ని తెల్ల కాగితాలు నేలమీద అంటించి, ఆ కాగితాలకు అవతలగా చక్కెర సీసా తెరిచి పెట్టి వుంచారు. ఒకచీమ ముందుగా యీవిషయాన్ని కనిపెట్టి గబగబా వెనక్కి వచ్చి మిగిలిన అందరికీ చెప్పేలోగా, అక్కడ ఆశాస్త్రవేత్తలు నలుగురూ పోగై, నేలమీద అంటించి పెట్టిన పాత కాగితాలన్నీ తీసేసి, సరికొత్త వాటిని పెట్టేశారు. చక్కెర మెక్కుదామని మహా వుబలాటంతో బయలుదేరిన అన్ని చీమలూ, ఎటుపోవాలో తెలియక,తిక్కమకలు పడి, వెర్రి ఎత్తినట్లు అన్ని వైపులకీ తారట్లాడాయి. మొట్టమొదట చక్కెర సీసాను చూచివచ్చిన ఆచీమకూడా మిగిలిన వాటితో సమానంగానే తన్నుకు లాడిందట. అలా పుట్టెడు చీమలూ పడి,అన్ని వైపులా గాలించగా గాలించగా, ఏవో కొన్ని చీమలుమాత్రం తప్పిజారిసరైన చోటికేపోయి చక్కెర సీసాను కనుగొన్నాయి

(ఇంకా వుంది.)

★

(37–వ పేజీ తరువాయి)

ఎందుకు విసిరారని అడిగితే'మీకు సాక్ష్యమేం వుంది - చిన్న పిల్లలు కదా అని ఏమి చెయ్యని మా మీదికి మీరంతా ఏకమయి వచ్చారందాము" అన్నాడు.

"మాకది బాగా నచ్చింది వెంటనే నాల్గురాళ్లు విసిరాము. అందులో ఒకటి ఎవరికో తగిలి నట్టుంది. ఆ యజమాను రాలు వాళ్ల బంట్రోతుల్ని పెద్దకొడుకుని (భర్త ఊళ్లో లేడు:- లేకపోతే ఆయన్నికూడా వుసికొల్పేదే) తీసుకు వచ్చింది. వీళ్లని చూస్తే మాకు భయం వేయలేదు కానీ, వెనకాల దుడ్డుకర్రతో నిలబడ్డ,(వీళ్ల కుయిల్లు అద్దికిచ్చిన) ఆయన్ని చూడగనే మాత్రం మా వెంకటేశ్వర్లు, బతికుంటే తరువాతయినా అన్యాయాలను అరికట్టవచ్చును కున్నాడు గాబోలు, పరుగు పుచ్చుకున్నాడు. మేముకూడా మా నత్తువ కొద్ది కాళ్లకు బుద్ధిచెప్పి పిక్కబలం చూపెట్టాము.

"పరిగెత్తుతున్న మాకు "ఈవీధికిసారి వస్తే నాకు చెప్పండి బడితపూజ చేస్తాను" అన్న ఆ యింటాయన మాటలు వినబడ్డాయి.

"అందుకే వెంకటేశ్వర్లు ఆ మేడను చూచి వణికాడు. వాళ్లిద్దరూ అప్పటికీ యిప్పటికీ ఆయింటి ముందర నుంచీ వెళ్తే ఆవంకర ముక్కు ఇంటాయన ఉన్నాడో లేదో చూచి, ఆయన గనుకవుంటే, వాయువేగ, మనోవేగాలతో వెనక్కి పరుగెత్తుతారు. ఆయినింట్లో లేకపోతే, ఎంతో గొప్పవాళ్లల్లాగా ఠీవిగా నడుస్తారు. వాళ్లసంగతి అల్లా వుండా - నేను మాత్రం ఆయన బతికున్నంత కాలమూ ఆయింట వైపైనా వెళ్లలే దంటేనమ్మా. పాపం- నెలరోజుల క్రితమే యింటాయన విష్ణులోకానికి పయనమయారు" అని ముగించాడు రత్నం.

ఈ రత్నంగాడి గొప్పతనం కూడా నిమిషంలో బయట పడింది. వాళ్లిద్దరూ ఆవీధిలోకి ఎప్పుడైనా వెళ్ళేవారు: వీడసలు ఆదిక్కైనా వెళ్లడు!

నేనింటికి వెళ్లి, వెంకటేశ్వర్లతో, సందర్భము లేకుండానే, "మీకు సాక్ష్యం ఏది? మేం పిల్లలము కదాయని మీరంతా ఏకమయి వచ్చారు." అనగానే వాడు నన్ను వింతగ చూశాడు. తరువాత నేను "పాపం - ఆ పెద్దింటాయన విష్ణులోకానికి యాత్రచేసాడని" చెప్పగానే, మా వాడి ముఖారవిందము వికసించి "నిజంగానా" అని అడిగాడు. నేను "అబద్ధమనుకున్నావా" అన్నాను.

ఇంతలో మా మావయ్య- అంటే వెంకటేశ్వర్లునాన్న-"ఏ పెద్ద మేడాయనరా?" అని అడిగారు. నేను సంగతంతా వివరించాను. ఇదంతా విని మా మావయ్య "ఇన్ని బుద్ధులు చెప్పే నువ్వే పారిపోయి వచ్చేవేరా, పిరికివాడా! మీవని, పిల్లిమెళ్లో గంట కట్టినట్లుంది" అన్నారు.

మావాడు నాకు బావ కనుక, వాణ్ణి నేను 'పిల్లి మెళ్లో గంటా'అని పిలిచేవాణ్ణి. అట్లా పిలిచినరోజున వాడు అన్నం తినేవాడు కాదు. వాడు మీకు కనబడితే మాత్రం వాణ్ణి అలా పిలవకండేం? ★

(35-వ పేజీ తరువాయి)

పట్టుకు లాగింది. శారద పెంకితనంగా వున్న చెయ్యి విదిలించబోయి కాలుజారి మెట్లమీదనుంచి దొర్లుతూ క్రింద పడిపోయింది.

శారద తల్లి ఆదుర్దాగావచ్చి క్రింద పడివున్న శారదను లేపింది. శారద భయంతో లేచి చూచింది. తీరా చూస్తే తను వున్నది తన యింట్లోనే: లలితా వాళ్ల మేడలో కాదు! అయితే యిదంతా కల అన్నమాట!! "ఏమిటే, అంత గాబరాగా కేకలువేశావు? మంచం మీద నుంచి క్రిందపడ్డావు. దెబ్బలేమి తగల్లేదు కదా?" అంటూ శారదా వళ్లు తడుముతున్నది తల్లి. ఆమెకి జరిగినదంతా ఏమని చెప్తుంది-శారద మాత్రం!

★



భరణీవారి "చండీరాణి"లో విద్యావతి.



భరణీ వారి "చండీరాణి"లో రాంసింగ్‌గా దొరస్వామి, చండీరాణిగా భానుమతి, కిశోర్‌గా ఎన్. టి. రామారావు

★ సినీ టెక్నీషియన్ల సభ ★

దక్షిణభారత సినీ టెక్నీషియన్ల సంఘం వారు మార్చి 29 వ తేదీన తొమ్మిదవ వార్షికోత్సవం జరుపుకున్నారు. హిందీ ప్రచార సభ మందిరంలో సమావేశం జరిగింది. రాష్ట్ర ఆర్థికమంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యంగారు అధ్యక్షత వహించారు

గడిచిన జనవరి 11 వ తేదీన టెక్నీషియన్ల సంఘంవారు ఫిలింతారల క్రికెట్ ఆట ఏర్పాటుచేసి వసూలుచేసిన ధనంలో 3464 రూపాయలు తమిళనాడు తుపాను బాధితుల సహాయార్థం సంఘ కార్యదర్శి ఎన్ కృష్ణస్వామిగారు మద్రాసు మేయరుకు అందజేశారు. మరొక కార్యదర్శి రజనీకాంత్‌గారు వార్షిక నివేదిక చదివి, తమ సంఘానికి శాశ్వత భవనం ఇంతవరకూ లేదనీ, దానికిగాను స్థలం విరాళం చేయించమనీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఈ ఉత్సవ సందర్భంలో పలువురు పలు విషయాలపై ప్రసంగించారు. మద్రాసు ప్రభుత్వ ఆర్థిక సలహాదారు డా॥ బి. నటరాజన్ మాట్లాడుతూ 41 కోట్ల రూ.ల పెట్టుబడి గలిగిన సినిమా పరిశ్రమ ముఖ్యమైన పరిశ్రమల్లో ఒకటని, వివిధరాష్ట్ర ప్రభుత్వాలు 5 కోట్ల రూ.ల దాకా వినోదపన్ను ద్వారా రాబట్టుకుంటున్నాయనీ చెప్పారు. సెన్సార్ షిప్ అధికారాన్ని ఒకే కేంద్రసంఘానికి అప్పగించాలనే వాదనను ఖండిస్తూ, భారతదేశంవంటి భిన్న సంస్కృతులు, ఆచారాలు కల దేశంలో సెన్సార్‌షిప్‌ను కేంద్రీకృతం చెయ్యటం వాంఛనీయం కాదన్నారు. అరవ సినిమాలను, తెలుగు సినిమాలను పోలుస్తూ, అరవ సినిమాలకంటె తెలుగు సినిమాలే ఉత్తమంగా ఉంటున్నాయనీ, చక్కని సంగీతం, స్పష్టమైన సంభాషణలు మున్నగు విషయాల్లో తమిళులు తెలుగు సినిమాలనుండి నేర్చుకోవలసింది ఉందనీ ఆయన అన్నారు.

ఆర్థికమంత్రి శ్రీ సుబ్రహ్మణ్యంగారు ఉపన్యసిస్తూ నిర్మాతలకు ఇలా హెచ్చరిక చేశారు: "చలన చిత్రాలకు ప్రజల మనస్సులపై అత్యంతమైన ప్రభావం ఉందని నిర్మాతలతో సహా అందరూ అంటున్నారు. ఈమాట సత్యదూరం కాదు కూడాను.



రోహిణీవారి "ప్రతిజ్ఞ"లో రాజనాల, సావిత్రి, కాంతారావు మున్నగువారు.

★ సినీ టెక్నిషియన్ల సభ ★

ముఖ్యంగా యువజనులమీద చిత్రాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది అయితే కొందరు నిర్మాతలు ప్రజాభిరుచుల పేరుతో అవినీతిని ప్రోత్సహించే చిత్రాలు తీస్తున్నారు. నిర్మాతలు ప్రజాభిరుచుల ప్రభావానికి లొంగిపోతున్నారుగాని, తమ ప్రభావం ప్రజలపై చూపటంలేదు. నేను ఒక్కటే ప్రశ్న అడుగుతాను: ఇప్పుడు వచ్చే చిత్రాలు సంతృప్తికరంగా ఉన్నాయని మీరు నమ్ముతున్నారా? దీనికి మీరు 'లేదు' అని సమాధాన మిస్తారు. మన చిత్రాలు నీచస్థాయిలో ఉండబట్టే కొందరు అతివాదులు అసలు సినిమాలనే బహిష్కరించాలని వాదిస్తున్నారు అంతమాత్రాన సినిమాలు ఉన్నతస్థాయి అందుకోలేవనీ, అవి ఉపయోగకారులు కావనీ అర్థం చెప్పరాదు. కొన్ని కొన్ని అవాంఛనీయమైన అంశాలను తమ చిత్రాల్లో జొప్పిస్తే ప్రజలు విరివిగా వచ్చి చూస్తారని నిర్మాతల అభిప్రాయం కాని ఇప్పుడిప్పుడు ప్రజలు విమర్శాత్మక బుద్ధి పెంపొందించుకుని తుక్కు చిత్రాలు చూడటం మానేస్తున్నారని తెలుస్తోంది. యువజనులపై సరియైన ప్రభావం ప్రసరించే చిత్రాలు నిర్మించలేకపోతే ఈ పరిశ్రమ మనుగడ వ్యర్థం. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల చాటున దాగుకొనడానికి నిర్మాతలు ప్రయత్నించగూడదు. ప్రాథమిక హక్కులు సత్కార్యాలకేగాని దుష్కార్యాలకొరకు కాదు."

29 వ తేదీ మధ్యాహ్నం సినీ టెక్నిషియన్ల తృతీయ మహాసభ జరిగింది. వాహినీ స్టూడియో సౌండు ఇంజనీరు ఎ. కృష్ణన్ అధ్యక్షత వహించారు. పబ్లిక్ వర్క్సు శాఖామంత్రి ఎన్ రంగారెడ్డిగారు ఈ మహాసభలో ఉపన్యసించారు. సినిమా పరిశ్రమను గూర్చి ఏమీ తెలియనివారు, బాధ్యత తెలియనివారు చిత్ర నిర్మాణానికి దిగుతున్నారనీ, వీరి మూలమున టెక్నిషియనులకు, పరిశ్రమలోని ఇతరులకు చాలా నష్టం వాటిల్లుతోందనీ ఆయన అన్నారు. అటువంటి బాధ్యతారహిత వ్యక్తులు పరిశ్రమలో అడుగుపెట్టకుండా ప్రభుత్వాలు కట్టుదిట్టాలు చేస్తే బాగుండు ననిపిస్తోందని కూడా ఆయన అన్నారు

ఎ కృష్ణన్ మాట్లాడుతూ, సినిమా పరిశ్రమ ఆర్థిక మాంద్యస్థితిలో పడిందనీ, తత్ఫలితంగా నిరుద్యోగం ప్రబలుతోందనీ అన్నారు. చిత్రాల సంఖ్య పెరగటం, నిపుణులైన పనివారు తక్కువగా ఉండటం, ప్రజల కొనుగోలుశక్తి తక్కువైపోవటం, చిత్రనిర్మాణవ్యయం పెరగటం మూలంగా విడుదల అయ్యే చిత్రాలు వరసగా దెబ్బతినిపోవటం సంభవిస్తోందని కూడా ఆయన అన్నారు.

సినీ టెక్నిషియన్ల సంఘాధ్యక్షుడు శ్రీ

కె. రామనాథ్ గారు దక్షిణదేశంలోని స్టూడియోల కార్మికుల, టెక్నిషియన్ల స్థితిగతులను గురించి ఒక నివేదిక చదివారు. దక్షిణ భారతంలో 20 స్టూడియోలున్నాయి. వీటిలో 15 మద్రాసు నగరంలో ఉన్నాయి. మూడు స్టూడియోలలో 200 పైగాను, మరొక మూడు స్టూడియోలలో 200, 100 మధ్యగాను, మిగతా వాటిలో 100 కి తక్కువగాను టెక్నిషియన్లు, నిపుణ కార్మికులు పనిచేస్తున్నారు. చిత్రం బాగోగులు టెక్నిషియన్లపైనే ఎక్కువగా ఆధారపడి వున్నప్పటికీ అందరికంటె తక్కువ వేతనాలు ముట్టేది వారికేనని కూడా రామనాథ్ గారు చెప్పారు.

ఆరుబయట సినిమాలు

ఎన్. కృష్ణస్వామిగారు ఓపెన్ ఎయిర్ థియేటర్లపై కొన్ని ఆసక్తికరమైన సూచనలు చేశారు. ఇండియాలో పెద్ద ఫిలిం పరిశ్రమ ఉన్నప్పటికీ థియేటర్లు చాలినన్ని లేవనీ, ముఖ్యంగా పల్లెటూళ్ళకు సినిమా సౌకర్యాలు అందటం లేదనీ, అందుచేత పల్లెటూళ్ళలో ఓపెన్ ఎయిర్ థియేటర్లు నిర్మించటం సుసాధ్యమనీ ఆయన అన్నారు. ఈ థియేటరుకు బోలెడంత ఖర్చుపెట్టి భవనం కట్టించ నక్కర్లేదు. ఆరుబయటనే తెర, సీట్లు అమర్చుకోవచ్చును అక్కర్లేకపోతే ఫర్నిచరు కూడా మానుకోవచ్చును. ఈ సూచన పెట్టుబడి పెట్టగలవారు గమనించదగినదే

డా॥ పి. వి. పతిగారు "ఎక్స్పొజిటరీ ఫిలిం" మీద, ఎమ్. ఇ. నాగరాజన్ గారు "మాగ్నెటిక్ రికార్డింగ్ వల్ల లాభాలు" అనే విషయంమీద మాట్లాడారు.

★

ఒక గృహస్థు తన యింటికి తానే నిప్పు పెట్టుకొన్నాడు. కోర్టులో మేజిస్ట్రేటు అడిగాడు—"అలా ఎందుకు చేశావ్" అని.

"నా యిరుగు పొరుగులంటే నాకిష్టం లేదు. అందుకనే నా యింటికి నిప్పెట్టేశాను." అని అతడి సమాధానం.



రోహిణీవారి "ప్రతిజ్ఞ"లో రాజనాల, సారంగపాణి.

ప్రశ్నలు..సమాధానాలు

శ్రీ కె. వి. వాసుదేవన్—గుంటూరు.

ఇండియాలో మిక్కిలి వేడి ప్రదేశము ఏదో తెలుపుతారా?

—ఆంధ్రలో ఉన్న వేడి, అఖలభారత దేశంలో ఎక్కడా ప్రస్తుతం కన్పించడం లేదు. గుంటూరుజిల్లాలోని, రెంట చింతల యందు ఉన్నతాపోగ్రత, చూస్తే యిండి యాకంతటికి ఎండవేడిలో గండ పెండేరం దానికి తొడగవచ్చు. ఆంధ్రరవితేజము అ సమానము. రవికుల తిలకుడైన శ్రీరాముని యునికియైన భద్రాద్రిలో 115 డిగ్రీల వేడి మన ఎండవేడి కొండ ఎక్కింది.

* * *

శ్రీ ఆర్. శేఖరరెడ్డి—హనుమకొండ.

కవిత్రయము తెనిగించిన భారతము గొప్పదా? లేక పోతన తెనిగించిన భాగవతము గొప్పదా?

—ఆంధ్రసారస్వత గురుపీఠం కవిత్రయం వారిదే. భారతంవంటి కావ్యం ఆంధ్రంలో నభూతో నభవిష్యతి.

* * *

శ్రీ వి. జస్వంత్—కవుతరం.

దేవుని గుడిమీద బూతుబొమ్మలు చిత్రించడానికి కారణం ఏమిటి?

—ఇప్పటికంటె ఎక్కువ మతాభిమానము, దైవభక్తి ఉన్నటువంటి ప్రాచీన కాలంలో మన పురాతన దేవాలయాలను నిర్మించారు. అమ్మవారి పూజ చేయునప్పుడు "జఘనం పూజయామి" అని ఆ పవిత్ర విగ్రహముయొక్క ప్రతి అంగమును పూవులతో పూజించారు. దేవతల క్రీడా విలాసములుకూడా పవిత్ర గాథలుగా పురాణములు వర్ణించాయి. భర్తవల్ల సంతానం లేకపోతే, గురువులవల్ల (భర్త అనుమతితో) సంతానం పొందిన పతివ్రతల కాలం అది. దిగంబర జైనవిగ్రహాలు గోమటేశ్వరుని విగ్రహం వంటిది శ్రావణ బెళ్గోలవద్ద (మైసూరులో) మహాపవిత్ర విగ్రహం బ్రహ్మాండమైన దిగంబర విగ్రహంగా చెక్కబడింది. ఆలయములమీద బొమ్మలను కూడా కాలానుగుణముగా దేవతాలీలల పురాణగాథలను స్ఫురింపచేయుటకై నిర్మించారు. మానవుని నీతియొక్క రీతి మారితే బూతు అవుతుంది. భగవంతుని సన్నిధిలో మాత్రం బూతు అనేది లేదు. నేటి మన సినిమా తారల పోజుల లీలల గోడనోటీసుల బొమ్మలు మనలోనే కొందరికి బూతు బొమ్మలుగా ఉన్నాయి.

* * *

శ్రీ ఎ. వి. యల్. మోహనరావు—గుంటూరు.

ఆంధ్రరాష్ట్రము వస్తే మీ ఉద్దేశములో రాజధానిగా ఏ వూరు పెడితే బాగుంటుందో తెలుపుతారా?

—ఆంధ్ర జన బాహుళ్యోద్దేశమే మా ఉద్దేశము. ఏ వూరికి రాజధానిగా ఉండదగిన అర్హత ఉన్నదో వాంఛూ నివేదికలో సూచించారు. అసలు ఆంధ్రరాజధానీ నగరంగా ఒక క్రొత్త నగరమును "క్రొత్తఢిల్లీ" వలె, పొట్టి శ్రీరాములుగారి పేరుతో "శ్రీరామనగరం" అని నిర్మించడం దివ్యంగా ఉంటుంది.

జీవితమొక పేరంటం!

మాకు బాగా పరిచయమైన ఒక కుటుంబంలో ముసలాయనకి చాలా జబ్బుగా వుందని చూడటానికి వెళ్లాను. వ్యాధి ప్రమాదమైన వ్యాధి. పైగా పెద్దతనం. ఇక ఆయన కొన్ని గంటలకంటే ఎక్కువ బ్రతకలేడని మనస్సులో నిశ్చయించుకొన్నాను. అటువంటి పరిస్థితిలోకూడా ఆయన జబ్బు రాకపూర్వం ఎంత చమత్కారంగా, ఎంత వినోదంగా మాట్లాడుతూ వుండేవాడో, అంత యిదిగానూ యిప్పుడూ మాట్లాడుతూవుండటం చూసి నాలో నేను ఆశ్చర్యపోయాను.

కొంతసేపు అవీ యివీ మాట్లాడాక "ఇక వెళ్ళివస్తాను. మళ్ళీ కలుసుకొంటాను" అంటూ కుర్చీలో నుంచీ లేవబోయాను.

"ఆ? ఏమిటీ? మళ్ళీ నన్ను కలుసుకొంటారా?...... ఈ లోకంలో కాదు. ఇంకొక లోకంలోనే" అన్నారాయన. నా ఆశ్చర్యానికి అంతు లేదు. అవసాన దశ వచ్చేసిందని తెలిసివుండికూడా ఆయన అంత ఆహ్లాదంగా వుండటం నేను చూడలేకపోయాను.

ఆయన ఆ విషయం గమనించినట్లున్నారు... "అంతేనాండీ, పంతులుగారూ! ఈ జీవితం అంతా ఒక పేరంటం. ఈ పేరంటంలో మనం ఎంత చక్కగా, ఎంత హాయిగా నవ్వుతూ యితరులను నవ్విస్తూ వుంటే, యిందులో నుంచీ మనం తప్పుకొన్నాక కూడా, ఆ యితరులంతా అంత ఆనందంగానూ వుండగలరు" అన్నారు.

జీవితంపై ఆయనకు గల ఆ విశ్వాసానికి యీనాటికీ నేనాయనకు జోహారు లర్పిస్తుంటాను.

శ్రీ పి. యస్. నెపోలియన్—మద్రాసు.
మీరు 11-3-'53 తేది వారపత్రికలో, చిత్ర సమీక్షలో "లో వాడిన్" గురించి రాస్తూ చివర "అంతకుమించి మరేమి ఉన్నట్టు కనుపించదు" అని వ్రాయడంలో మీ ఉద్దేశం ఏమిటి? అంతకుమించి మన చిత్రాలలో ఎక్కువ ఏమైనా కనుపిస్తున్నదా?

—మనచిత్రాల్లో అంతకంటె ఎక్కువ ఏదో ఉందని మేమెప్పుడూ అనలేదు. హాలీవుడ్ చిత్రాలు టెక్నికల్ ప్రావీణ్యంలో మన చిత్రాలకంటె గొప్పవే. కాని వట్టి టెక్నికల్ ప్రావీణ్యం ఉన్నంత మాత్రాన గొప్పకళ జన్మించదు. కళ వెనకాల మానవీయ ప్రయోజనం ఏదో ఉండాలి. అది లేకపోతే టెక్నికల్ గొప్పతనం కేవలం స్టంటు అయి పూరుకుంటుంది. "లోవాడిన్" కళ్ళు చెదిరిస్తుంది, కాని హృదయాన్ని, ఆలోచనను బంధించదు.

*   *   *

శ్రీ శారదాదేవి—సోనీపట్ (పంజాబు.)
భార్యాభర్తలు ఒకరి నొకరు చాలా గాఢంగా ప్రేమించుతూ ఉన్నప్పుడు, భార్య చనిపోతే, మరొక జన్మయందు ఆమె, ఆ భర్తకు తిరిగి భార్యగా లభించును అనే సిద్ధాంతము కలదా? అది ఎట్లు?

—కర్మసిద్ధాంతము ప్రకారముగా ఎవరి కర్మఫలమును వారే అనుభవిస్తారు. భార్య పుణ్యాత్మురాలై గొప్ప భక్తురాలై ఆత్మ పరిపక్వం ఆత్మ సాక్షాత్కారం పొందిన యెడల, ఆమెకు తిరిగి జన్మలేకపోవచ్చు. ఆమెయొక్క కర్మపరిపాకమునుబట్టిఆమెకు ఉత్తర జన్మ లభిస్తుంది. ఒక భర్తమీద ప్రేమ గాఢంగా ఉండడం అయిహికంగా గొప్ప విషయమే. కాని, ఆముష్మికంగా ఆలోచిస్తే ఆ ప్రేమ తామరాకుమీది నీటి బిందువువలె ఉండాలి. తన దేహంమీద కూడా అభిమానం విడిచిపెట్టిన వానికే ముక్తి. ఒక భర్తయొక్క దేహముమీద గాని, ఆకార స్వరూపంమీదగాని మమకారం ఉంటే అది అజ్ఞానం. అజ్ఞానంలో పడిఉంటే స్త్రీ మరొక జన్మలో ఏపరిస్థితిని పొందగలదో ఆమె అజ్ఞానావస్థ ఏ ప్రమాణంలో ఉన్నదో దానినిబట్టి ఉంటుంది. తన భర్తలోనే భగవంతుడున్నాడని గ్రహించి అట్టి భగవత్స్వరూపమును ఆమె చూడగల్గితే, ఆమె తిరిగి జన్మలేకుండా భగవదైక్యం పొందుతుంది. అందువల్ల పతిభక్తిద్వారా కూడా ముక్తి పొందవచ్చునన్నారు.

చనిపోయిన వ్యక్తికోరకై దానములు పూజలు శ్రాద్ధములు వగైరా జరిపితే, చనిపోయినవారికి అవి చెందునా?

—చనిపోయినవారి ఆత్మలు కొన్ని పితృలోకానికి చేరునని మహర్షులు నిర్వచించారు. శ్రద్ధగా భక్తిగా ఆత్మశుద్ధిగా మనము నీటితో తర్పణములు విడిస్తేకూడా చాలునన్నారు. మన అంతరాత్మలలోని భక్తితో, శ్రద్ధతో కూడిన మన ఆత్మతేజము మాత్రమే ఆపితృలోకంలోని పితృదేవతలకు చేరినటువంటిదై వారు అందువల్ల

ఆత్మసంతృప్తి పొందుతారని యోగసాధనలుచేసి ఆధ్యాత్మిక దివ్యశక్తులను పొంది ఆధ్యాత్మిక ప్రపంచ రహస్యములను గ్రహించిన మహర్షులు అన్నారు. అటువంటి ఆధ్యాత్మిక యోగశక్తిని సంపాదించిన వారికే అవి బోధపడి ఋజువు కాగలవు.

జీవుడు తిరిగి జన్మ ఎత్తును అని చెప్పటకు దృఢమైన కారణములు ఏవైనా ఉన్నవా?

—మనం జీవించిఉన్న ప్రత్యక్షప్రపంచంలో కొందరు పుట్టుకతోనే అత్యద్భుత విద్యా ప్రవీణులై పుట్టుచున్నారు. 5 ఏండ్ల పిల్లవాడు వేదం చదువుచున్నాడు. 9 ఏండ్ల పిల్లవాడు సంగీత విద్వాంసుడు. ఎవ్వరూ పాఠం చెప్పకుండానే ఒక గ్రుడ్డి



అజంతా వారి "వయ్యారిభామ" జానపద చిత్రంలో సులోచన

ప్రశ్నలు - సమాధానాలు

వాడు అసాధారణ గణితం చేయుచున్నాడు. ఏ శిక్షణయున్నా లేకుండా చిత్తసంస్కారం కలుగదు. అసలు ద్రవ్యమొత్తం లేకుండా వడ్డీ అనేది ఉండదు. కాబట్టి అటువంటి అసాధ్యప్రావీణ్యం కలుగుటకు అతనికెప్పుడో సాధకం శిక్షణ కొంత ఉండి ఉండాలి. గొలుసుల బిందెలో ధనం దాచి ఎవరో పూర్వము నేలలో పాతి పెట్టినారు గనుక, అది మనకు యీ యుగంలో బయటపడింది అని ఊహించాలి. పూర్వజన్మసంస్కారంవంటిదే ఇది. ఒక బొందెలోని జీవాత్మను ఇంకొక బొందెలో ప్రవేశపెట్టవచ్చునని పరకాయప్రవేశ విద్యవల్ల యోగసాధకులు ఒకప్పుడు ఋజువు చేశారు. ఆ యోగవిద్య యిప్పుడు నశించింది. కాని ఆ విద్యవల్ల పునర్జన్మ ఋజువు చేయవచ్చు.

*　　*　　*

శ్రీ పుల్లాభొట్ల వాసుదేవమూర్తి-తాడేపల్లిగూడెము.

రాజగోపాలాచారిగారు మద్రాసుఅసెంబ్లీలో ఆంధ్రరాష్ట్ర సందర్భములో, ఉపనిషత్తులు చదువుతారెందుకండీ?

—ఉపనిషత్తులపై తనకింత గౌరవం ఉంది అని ప్రజలు తెలుసుకోడానికేమో.

*　　*　　*

శ్రీ బి. వి. నరసింహం—కడప.

మన సెన్సారు అధికారులు యెల్లప్పుడూ ప్రేక్షకుని దృష్టితోనే చిత్రాలను పరీక్షిస్తారా? లేక మరే యితరదృష్టితోనైనా పరీక్షిస్తుంటారా?

—'సెన్సార్ షో'లో కూర్చుని, తాము సెన్సార్లమనే విషయం అరగంటకొకసారి జ్ఞాపకం తెచ్చుకుంటూ చూస్తారు.

*　　*　　*

శ్రీ గల్లా శ్రీకృష్ణమూర్తి—గుంటూరు.

ఆంధ్రులను ఒక జాతివారనదగునా? అసలు జాతి అనగా నేమి? దాని నిర్వచనము ఏమిటి?

—జాతి అనే పదాన్ని మనం అనేక అర్థాల్లో వాడుతున్నాము. శారీరక లక్షణాలనుబట్టి, రంగునుబట్టి ఆర్యజాతి, నీగ్రో జాతి, మంగోల్ జాతి మొదలైన జాతులున్నాయి. సంస్కృతినిబట్టి యూరపియన్ జాతి, భారతీయ జాతి, యూదు జాతి, మొదలైనవి ఉన్నాయి. భాషనుబట్టి ఇంగ్లీషు జాతి, ఆంధ్రజాతి, బెంగాలీజాతి, తమిళజాతి మొదలైనవి ఉన్నాయి. ఇలాగ ఒక్కొక్క దృష్టితో చూస్తే ఒక్కొక్క రకమైన అర్థంలో జాతి నిర్ణయించబడుతుంది. ఆంధ్రులకు ఒక ప్రత్యేక భాష ఉంది గనక ఆంధ్రులు ఒక జాతివారే.

*　　*　　*

శ్రీ జవ్వాది వెంకటరామారావు—
కాలికట్. (దక్షిణ మలబారు)

ఆంధ్రుల చరిత్ర (పూర్తి వివరములతో) ఏదైనా గ్రంథమున్నదా?

—చరిత్ర చతురానన కీ॥ శే॥ చిలుకూరి వీరభద్రరావుగారు "ఆంధ్రులచరిత్ర" వ్రాసినారు. విజ్ఞాన చంద్రికా గ్రంథమాల వారు ప్రచురించారు. ఆ గ్రంథంకొరకు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు బి. యే. బి. యల్., విజయవాడ, కృష్ణాజిల్లా. అని వ్రాసినయెడల వివరములు తెలియవచ్చు.

ఆంధ్రుల ఔన్నత్యమును తెలిపేటందుకు మిగిలిన గుర్తులు ఇప్పుడేమైన ఉన్నవా?

—అజంతా గుహలలో ఉన్న చిత్రములే ప్రాచీన ఆంధ్రుల చిత్రలేఖనం. దాని యిమిటేషనులు టిబెటులో హిమాలయ పర్వత గుహలలోనూ, సింహళంలోని సిగేరియా గుహలలోనూ ఉన్నాయి. అమరావతిలోను, నాగార్జునకొండలోను నిర్మింపబడిన స్తూపములు ఆంధ్రుల శిల్పకల్పనలు. వాటి యిమిటేషనులే చైనాలో కూడా ఉన్నాయి. త్యాగరాజువలె కీర్తనలు చెప్పిన వాగ్గేయ కారకుడు మహాభక్తుడు మరొకడు లేడు. ఆంధ్రులు సాధకం చేసిన భరతనాట్యం క్షేత్రయ్యమూలంగా కళాక్షేత్రములందు వృద్ధిపొందెంది. ఈ చిత్రలేఖనం, శిల్పం, సంగీతం, నాట్యం ఆంధ్రుల పూర్వౌన్నత్యపు గుర్తులే. ★



రోహిణీవారి "బీదల ఆస్తి" (లెగసీ)లో బేబీ గిరిజ.

★ సినిమా వార్తలు ★

శ్రీ బొల్ల సుబ్బారావుగారి దర్శకత్వాన "పల్లెపడుచు" అనే సాంఘిక చిత్రం శ్యామలా స్టూడియోలో తయారవుతున్నది. ఫొటోగ్రఫీ కూడా ఆయనే నిర్వహిస్తున్నారు కథకు శ్రీ పినిసెట్టి శ్రీరామమూర్తిగారి "పల్లెపడుచు" నాటకం ఆధారం సంభాషణలు, పాటలు శ్రీరామమూర్తిగారు సి. ఎస్. ఆర్, ముక్కామల, రామశర్మ, చలం, కృష్ణకుమారి మున్నగువారు నటిస్తున్నారు.

* * *

అఖిలభారత ప్రజానాట్యమండలి ఏడవ మహాసభ ఈ నెల 6 నుండి 12 వరకూ బొంబాయిలో జరుగుతుంది బిమల్ రాయ్, కె ఎ అబ్బాస్, ఫణిమజుందార్, జియా సర్హాదీ, బలరాజ్ సహానీ, డా॥ రాజారావు మొదలైన ఫిలింప్రముఖులు ముల్క్ రాజ్ ఆనంద్ వంటి పలువురు రచయితలు, కళాకారులు ఈ సభలో పాల్గొంటున్నారు. నాట్యకారుడు ఉదయశంకర్ ప్రారంభోత్సవం చేస్తాడు వివిధరాష్ట్రాల నుండి 500 మందివరకూ నటీనట ప్రతినిధులు హాజరై ప్రతిరోజూ ఆయా రాష్ట్రభాషల్లో నాటకాలు, నాట్యాలు, జానపద, శాస్త్రీయ సంగీత కచ్చేరీలు కొనసాగిస్తారు ఉత్తమ ప్రదర్శనానికి డైరెక్టరు కె. సుబ్రహ్మణ్యంగారు బహుమతి ప్రదానం చేస్తారు.

* * *

ఈ నెల 24 న "ఆహ్!" చిత్రాన్ని బొంబాయిలో విడుదల చేయనున్నానని నిర్మాత రాజ్ కపూర్ ఇటీవల ప్రకటించాడు. తెలుగు, తమిళ భాషలో కూడా ఆతరువాత వారంలో విడుదల చేయబడగలదట. ఈ చిత్రంలో ముఖ్యాకర్షణ శంకర్, జైకిషన్‌ల సంగీతం అని, మొత్తం పది పాటలున్నాయని కూడా రాజ్ కపూర్ అన్నాడు.

* * *

వినోదా పిక్చర్స్ సర్క్యూట్ అనే పేరుతో క్రొత్తగా డిస్ట్రిబ్యూటింగ్ సంస్థ ఒకటి విజయవాడలో ఈ నెల 1 న ప్రారంభించబడినది అధిపతి శ్రీ రామినేని బుచ్చిబాబుగారు వీరి మొదటి విడుదల చిత్రం వినోదావారి "దేవదాసు" ఇది మే నెలలో విడుదల అనుకుంటున్నారు

* * *

గత మాసము 20 వ తేదీన నిర్మాత జియాసర్హాది "ఫూస్లా" అనే హిందీచిత్రం ప్రారంభించాడు. దర్శకుడు కూడా ఆయనే. దురాఖోటే ప్రారంభోత్సవం చేసింది. దిలీప్ కుమార్ నాయకపాత్ర ధరిస్తున్నాడు. భారతీయజీవితాన్ని యథాతథంగా, అభ్యుదయ దృక్పథంతో చిత్రించటం తన ఆశయమని జియాసర్హాదీ ప్రకటించారు ★

★ [illegible] ★

(25-వ పేజీ తరువాయి)

మీదికి వచ్చినట్లే వుంది!... అనసూయ ఒళ్లు జలదరించింది. నిశ్చేష్టితురాలైంది... దొడ్డి కవతల గుడిసెలో ఎవరో ఒక స్త్రీ బాధపడుతూంది.

కుతూహల మెక్కువైంది అనసూయకు. ఎవరో పాపం, తనలాగే బాధపడుతూంది.. తనవాళ్లు ఆ స్త్రీకోసం బాధపడుతున్నారు. ఎక్కడచూచినా ఏదో రకమైన బాధే!... దొడ్డి గోడదాటి గుడిసెదగ్గరికి బైలుదేరింది. జెంపలిముక్కలు, జిల్లేడుచెట్లు, నాగజెముడు గుట్టలు దాటుకుంటూ వెన్నెల సహాయంతో నడచిపోతూంది. కీచురాళ్ళు ఒకటే రొద పెడుతున్నాయి. నేలమీద పచ్చిగడ్డిలో మినుగురు పురుగులు నక్షత్రాల్లాగా అక్కడక్కడా వెలుగుతున్నాయి.. ఆమె కాలి కేదో మెత్తగా తగిలింది... గజం పొడుగు పాము జరజరా ప్రాకిపోతూంది. వంపులు తిరిగే పాముమీద వెన్నెలపడి నిగనిగలాడుతూంది. అనసూయ ఎగిరి ఒక్క గంతువేసింది... ఉన్నట్లుండి పది పన్నెండు నక్కలు ఒక్కసారికూశాయి వికృతంగా. భయంతో చప్పున ఆగింది అనసూయ...కొద్దిసేపట్లో ధైర్యం తెచ్చుకొని గుడిసెలోకి వెళ్ళింది.

తన వయసులోని స్త్రీయే ప్రసవవేదన పడుతూంది. పాపం, ఆమె బాధ చూడరానిది......ఒకసారి తాను బస్తీకి వెళ్ళినప్పుడు తన బంధువుల్లో ఒకరు కాన్పుల ఆసుపత్రిలో ప్రసవించింది. ఎంత సులభంగా ప్రసవించింది! ఇంటో వాళ్ళంతా ఆశలువదులుకున్నారు......ఇప్పటికీ ఆ బిడ్డ తల్లి చక్కగా వున్నారు. ప్రతివూళ్లో అలాంటి ఆసుపత్రులుంటే ఆడవాళ్ళు ఎంత సుఖపడిపోతారు!...

అనసూయను చూచి నివ్వెరపొయ్యారు గుడిసెలోని యితర స్త్రీలు. అంత కష్టంలో కూడా అనసూయకు మర్యాద చెయ్యడానికి మరవలేదు వాళ్ళు. తెల్లవార్లు నొప్పులుపడే స్త్రీదగ్గరుండి అనసూయ సహాయం చేసింది. తెల్లగ తెల్లవారేసరికి చక్కని కుర్రవాడు పుట్టాడు.

అనసూయ తల్లి, అన్నలు, చెల్లెలు, ఉత్సాహంతో ఊగిపోతున్నారు. పొద్దుపొడవటమే ఆలస్యం, వూళ్ళో కెళ్ళి కరణాన్ని, మునసబును, బడిపంతులును, పెద్దరైతును, పురోహితుణ్ణి యింటికి పిల్చుకవచ్చారు. అనసూయమ్మ తన భర్త ఆస్తినంతా పుట్టింటి వాళ్ళకు రాసియిస్తూందన్న సంగతి వూరంతా ప్రాకింది. పనిలేనివాళ్ళు, పనివున్నవాళ్ళు వందలకొద్దీ వచ్చి మూగారు అనసూయ యింటిచుట్టూ. వాళ్లలో చాలామంది వేపపుల్లలతో పళ్ళు తోముకుంటున్నారు. అనసూయ మామూలుగావచ్చి ఓ మూల కూర్చుంది. ఆమె మొహం చాలా గంభీరంగావుంది. లోలోపల చెలరేగే తుపానుతో బ్రహ్మాండమైన పోరాటం సల్పుతూన్నట్లుంది. అందరు గుడ్లు అప్పచెప్పి ఆమెను చూస్తున్నారు. కొందరి కళ్ళలో నీళ్లు తిరుగుతున్నాయి. స్త్రీలందరూ చీరకొంగులతో కళ్ళు అద్దుకుంటూన్నారు అనసూయను చూస్తూ.

అనసూయ ప్రారంభించింది. "నా భర్త వల్ల నాకు సంక్రమించిన ఆస్తిలో జీవిత పర్యంతం, నా అనుభవానికి పోను మిగత ఆస్తినంతా, అనగా పది ఎకరాల మాగాణి, మాకు రావలసిన, బాకీలు, ఎనిమిది ఎకరాల బీడు, నాసొమ్ము, యితర వెండి, బంగారు, యీ వూళ్ళో ఒక కాన్పుల ఆసుపత్రి కట్టించి, దాని జరుగుబాటుకుగాను నేను నా స్వబుద్ధితో మీ అందరియెదుట వ్రాసి యిస్తున్నాను."

ఆ మాటలన్నీ కాగితంమీద రాశాడు ఆ వూరి కరణం. ★

★ కీచకవధ ★

(9-వ పేజీ తరువాయి)

ఏమవుతుందో చూస్తున్నాడు వీరాస్వామి. ఇంతలో, కాలి మట్టెల చప్పుడు వినిపించింది. చూస్తే, సుబ్బి! కుండ పట్టుకుని చెరువులోకి మెట్లు దిగుతోంది. ఏ సుబ్బి? నిన్న పుల్లమ్మగారి తోటలో బత్తాయి కాయలు కోస్తున్న సుబ్బే! నీటి అంచున వున్న మెట్టుదాకా వెళ్ళి, కుండ నీటిలో వదిలింది.

నీటిలో కుండ, ఏటవాలుగా తేలుతూ ఆడుతోంది. సుబ్బి, చీరకుచ్చెళ్ళు వెనక్కి విరిచి నడుందగ్గర దోపింది. జుట్టు విదిల్చి మళ్ళీ కొప్పు పెట్టింది. చెరువులో మోకాలిదాకా దిగి, రెండుదోసిళ్ళ నీరు త్రాగింది. కుండ కడిగి నీరు నింపింది. పైటకొంగు గుండ్రంగా చుట్టకుదురులా చుట్టి తలమీద పెట్టుకుంది. ఒక కాలు పైమెట్టుమీద ఆన్చి, కుండ ఎత్తి ఆ తొడమీద నిలిపింది. ఒక చేత్తో కుండఅంచు పట్టుకుని, రెండో చేత్తో కుండ చుట్టూ నీళు తుడిచేసి, నెత్తిని పెట్టుకుంది. మెట్లు ఎక్కి, ఒక్కక్షణం నిలబడి, నుదుటిమీదకు కారిన నీటి చుక్కల్ని వేలితో లాగేసి, ఇంటిదారి పట్టింది. తామరాకుమీది చేప ఏమయిందో అని చూసేడు వీరాస్వామి. ఓ గ్రద్ద వచ్చి తన్నుకునిపోతోంది. మళ్ళీ సుబ్బి కేసి చూసేడు. అప్పుడే పడుతూన్న చీకట్లలో కలిసిపోయింది.

రోజూ సాయంకాలమయేటప్పటికి, అతని కాళ్ళు చెరువు గట్టుకే లాక్కుని వచ్చేస్తున్నాయి. సుబ్బి కూడా రోజూ వచ్చి, నీళ్ళు తీసుకునిపోతోంది. మాన మర్యాదలకు శంకించి, 'సుబ్బి మాటే తలపెట్టకూడదు,' అనుకునేవాడు ఎప్పటికప్పుడే. కాని, అతనికి శక్యం కాకుండా పోతోంది. అంతకంతకు గుండె నిబ్బరం సడలింది. అందులో ఆరోజు సుబ్బి చెరువులో దిగి జలకమాడింది. తడిగుడ్డల్లోంచి, చేవలు దేరిన దాని అవయవాలు వీరాస్వామి కళ్ళల్లో గ్రుచ్చుకుపోయేయి 'అబ్బ! సుబ్బి కావాలి' అనుకున్నాడు.

ఆవులమంద మళ్ళించుకుని ఇంటికి పోతూంటే పోలిగాడిని పిలిచేడు వీరాస్వామి. పోలిగాడు వస్తూ,

'ఏటండి అబ్బాయిగోరు, ఒకే! యీడ కూకున్నారు?' అన్నాడు వినయంతో.

'ఏంలేదురా. ఈ పల్లెటూళ్ళో ఏమీ తోచక చస్తున్నాను.'

'అంతేనండి మరి. బస్తీలో అలవాటైపోయినోరికి ఈ పల్లెకొంపలో చవకుంటే సావేనండి—మల్లీ ఎప్పుడెల్తారేటి బస్తీకి?'

'చదువు అయిపోయిందిరా. ఇంక ఉద్యోగమయేదాకా ఇక్కడ పడి ఏడవ్వలసిందే.'

'ఉద్దోగమే! సెప్పేరే కాదూ—ఎప్పుడవుద్దో?'

'ఏమోరా.'

'నే నెల్లివత్తానండి; మంద నొగ్గేసేను.'

'ఒరే పోలిగా, నిన్నోమాట అడుగుతాను, ఎవరితోటి చెప్పవుకదా?'

'శా, శా. అటువంటి దెప్పుడేనా సేసేనేటండి, అబ్బాయిగోరు అలా అంటారు.'

'పిట్టకూడా తెలియకూడదురా.'

'పిట్టకేటండీ పుట్టకూడా తెలీదనుకోండి అబ్బాయిగోరూ.'

'ఇదిగో చూడు-ఇంకా దగ్గరగా రారా - ఆ నీళ్లు పట్టుకెళ్ళే అమ్మాయి ఎవర్రా?'

"ఆఁ? - ఓసోస్, సుబ్బీ! ఓలమ్మో, దానికి ఒళ్లమాలిన టెంపరునండి అబ్బోయిగోరూ - అప్పిగాడు కూతురు.'

'ఎలాంటి దేమిటి?'

'ఏమోనండి మరి, వూరంతా మా మంచి మనిసంటారు. నేనుమాత్రం సచ్చినా ఒప్పుకోను అబ్బాయిగోరూ. ఆ రాముడిగాడితో గడ్డిమేటి ఎనకాల గుసగుసలాడుతూంటే లచ్చసార్లు సూశా-ఆళ్ళిద్దరికి పెళ్లవుద్దంట!'

'రాముడెవర్రా? ఆ నారయ్య కొడుకే?'

'ఆడే, ఆడేనండి బాబు. అబ్బో, ఆడి మాటంటే మాటే కాదండీ - బలే రవుడీనండి - ఆడు కర్రుచ్చుకుంటే దేవరో!_'

'అప్పుడే అంతవాడయేడన్నమాట! ఊఁ, అయితే మనకేమీ లాభం లేదన్నమాట?'

'ఏటీ! అబ్బాయిగోరి కన్నడిందే! - అదెందుకునండి మనకి.'

'అదే కావాలిరా. చూడు, ఈ ఐదు రూపాయిలూ తీసుకో. నువ్వెలాగైనా దాన్ని ఒప్పించేవంటే ఇంకా ఇస్తా.'

'ఓస్, అదెంతపనేటి - నిముసాలమీద వొప్పిత్తా - అబ్బాయిగోరి మాటకు అడ్డేటి.'

'ఎవ్వరికీ తెలియకూడదు సుమా.'

'వొట్టంటే వొట్టే. సచ్చినా తెలవదనుకోండి.'

'చెప్పినట్టు చెయ్యకపోయేవా చూసుకో ఏంచేస్తానో.'

'మీకెందు కబ్బాయిగోరూ, రేపీయేళకి ఆ ముండ మీ పాదాలకాడ వుండకపోతే చూడండి నా తమాసా.'

'సరే, పో.'

'సిత్తం, సిత్తం.'

పోలిగాడు దూడల్ని కట్టేసి, తిన్నగా సుబ్బిదగ్గరకు వెళ్ళేడు. వెళుతూనే, 'సుబ్బీ, నీపంట పండింది నేవే, పండింది నేవే, పంటపండింది నేవే -' అంటూ అడుగులు వేస్తూ సుబ్బి చుట్టూ తిరిగి భజనచెయ్యడం మొదలెట్టేడు. వాణ్ణి ఎంతో కష్టంమీద కూర్చోబెట్టి సంగతేమిటని అడిగింది. 'అబ్బాయిగోరు నీమీద కన్నేసేడు నే - నీ పున్నెం పుచ్చిందినే - పుచ్చిందినే.' అంటూ మళ్లీ భజనచెయ్యడం మొదలెట్టేడు. 'ఒరే, సరిగా సెబుతావా, మా అయ్యని పిలవమంటావా?' అని సుబ్బి గద్దించింది.

'సెబుతాగాని, నీకు పున్నెముంటుంది గోడవసెయ్యకే.' అంటూ సుబ్బి చెవిలో సంగతంతా చెప్పేడు. అంతా విని,

'ఆరి సచ్చినోడా, నీకిటువంటి పోగాలం వచ్చిందేరా! నన్నాడిదగ్గర కెల్లమంటావ్! వుండు, మా అయ్యతోటి, మీ అయ్యతోటి సెప్పి నిన్నేం సేయిత్తానో సూడు.' అంటూ మొదలెట్టింది. పోలిగాడు.

'ఓస్, వొల్లకోయే నీగదమాయింపులూ నువ్వూను - పెద్దరైతు కొడుకంటే యేటనుకున్నావో-'

'ఓరిపోరా, సన్నాసి గాదవా!'

'అబ్బాయి గోరు తెలసుగున్నారంటే-'

'ఆఁ ఆఁ, తలసుగుని తలసుగుని, ఆడూ నువ్వూ కలిసి ఏడేనా వురెట్టుకు సావండి.'

'ఏటేటీ! మాటలు తిన్నగా రానీ తెలుసా - ఆ రాముడు. గాడితోటి నువ్వు మాటాడుతూంటే ఎన్నిసార్లు సూడనేదేటి—'

'ఓవోక్, మురుగుతోందే - ఆ రాముడుగాడితోటే సెబుతా రా నీ,వచ్చే యేలయింది.'

రాముడంటే పోలిగాడికి మరీ భయం. హఠాత్తుగా తగ్గిపోయి, 'వొద్దొద్దే తల్లీ, ఆడితోమాత్రం సెప్పకే నీకు పున్నెముంటాది.' అంటూ సుబ్బి కాళ్లమీద పడ్డాడు.

★ కీచకవధ ★

'పోరా, పో. మళ్ళీ ఆ వూసెత్తేవా సూసుగో-' అంటూ కరుణించింది సుబ్బి.

పోలిగాడు గంజినీళ్ళు త్రాగి ఇంటి దగ్గరే కూర్చున్నాడు. ఇంతలో ఓ పది పది హేనుమంది పోలిగాడి స్నేహితులు గలగల మంటూ వచ్చేరు. తోలుబొమ్మలాటకి రమ్మన్నారు పోలిగాణ్ణి. పోలిగాడు 'నేను రాను, మీరు పొండ్రా.' అన్నాడు.' ఈడికీ యేలయేదో పట్టిందిరా గట్టిగా. 'కీచక వద' ఆడుతూంటే రాడంట! లాక్కు పదండిరా ఎందుకు రాడో సూద్దాం.' అన్నాడు అందులో మొనగాడు. పోలిగాణ్ణి బలవంతంగా లాక్కుని పోయేరు.

బొమ్మలాట అయిపోయింతర్వాత అందరూ వచ్చేస్తూ, 'బటానీలు కొని నములు కుంటూ పోదాం, డబ్బులుంటే చూడండ్రా' అన్నాడొకడు. ఎవళ్ళిదగ్గరా లేవన్నారు. కాని, అంతమాత్రంతో వదల్లేదు. 'సూత్తా రేటి, యెతకండిరా అందరికాడ' అన్నాడు మన మొనగాడు. ఒకణ్ణొకడు వెదకడం ప్రారంభించేరు. ఒకడి దగ్గర మూడుకాన్లు దొరికేయి. పోలిగాడి దగ్గర అయిదు రూపాయల నోటు! అందరూ ఆశ్చర్యపోయేరు. 'అద్గదీ సంగతి—అందుకేరా రానన్నాడు బొమ్మలాటకి' అన్నాడొకడు. 'ఏదో యేసేడ్రా కన్నం' అన్నాడింకొకడు. 'ఆడెప్పుడూ అటుమంటి పనులేరా.' అన్నాడు ఇంకొకడు. దొంగతనం చెయ్యలేదు మొర్రో అని పోలిగాడు ఎంత మొత్తుకన్నా ఎవ్వరూ వినలేదు.

దొంగతనం సెయ్యకపోతే యెలాగొచ్చేయేటిరా ? నిజం సెప్పక పోయేవో, మున సబుగారితో సెప్పేత్తా సూసుగో." అని బెదరించేడొకడు. ఎలాగ ? నిజం చెబితే రహస్యం బయట పడుతుంది. చెప్పక పోతే, దొంగాడంటున్నారు. పైగా మునసీబుగారితో చెప్పేస్తామంటున్నారు. ఆలోచించేడు.

'దొరికిందిరా' అనేసేడు చటుక్కున.

వాళ్ళు అంతటితో వదిలితే కదూ.

'ఏడరా ?' అని అడిగేడొకడు.

'సెరువుకాడ.'

'ఎప్పుడురా?'

'మద్దాన్నం.'

'మద్దాన్నం మందకాడుంటే, సెరువుకాడ దొరికిందట్రా దొంగ యెదవా. వాకాడ దాగుద్దనుకున్నావా? నిజం సెప్పక పోతే సూసుగో—' అంటూ పోలిగాడి జుట్టు పట్టుకున్నాడు మొనగాడు.

'అబ్బాయిగోరు యిచ్చేర్రా' అన్నాడు పోలిగాడు నిమ్మదిగా.

'ఎందు కిచ్చేరేటి?'

'ఎందుకో నీ కెందుకేటి?'

'సూత్తారేరా—'

వెనకాలనుంచి పోలిగాడి వీపుమీద నాలుగైదు గుద్దులు ఒకేసారి పడ్డాయి

'పరీచ్చ పేసయేరంట, యిచ్చేర్రా' అన్నాడు పోలిగాడు తడుముకుంటూ.

'అయితే, మనకూ కూడా యిత్తారన్న మాటే' అన్నాడొకడు.

'పదండ్రా పోయి అడుగుదాం' అన్నాడు ఇంకొకడు.

'ఈడిని కూడా లాక్కు రండిరా, అబ్బాయిగోరి ఎదురుగ్గా అడగాలి.' అన్నాడు మొనగాడు.

'ఉండండె హే—అది కాదు—' అంటూ నసిగేడు పోలిగాడు.

'మరేటి?'

'కోడిపుంజును తెమ్మన్నాడ్రా.'

'అరింటో అన్నుంటే యింకా ఎందుకేటి?'

'ఏమో, ఆర్నే అడుగుపోయి.'

'పదండ్రా యెల్లి అడుగుదాం.'

'ఉంపెండ్రా మీతాడు తెగా—నన్ను సంపేత్తారేరా—'

'లాక్కురండ్రా, సూత్తారేం—'

ఇంతట్లోకే 'ఎవ్రా ఆడ' అన్న కేక వినపడింది.

'అరి బాబో! రాము డొత్తున్నాడ్రా!'

అందరి కాళ్ళూ వణకుతున్నాయి. ఇంక పోలిగాడి మాట చెప్పాలా? బొమ్మలాట తెరవెనకాల సుబ్బితో సరసాలాడి, ఇంటికి పోతూన్న రాముడు దగ్గరకొచ్చి, 'ఏంట్రా గొడవ సేత్తున్నారు' అని గద్దించేడు. భయపడుతూ భయపడుతూ ఎలాగైతేనేం అందరూ కలిసి పోలిగాడి కథ చెప్పేరు.

'ఏరా పోలిగా, సంగతేటి?' రాముడు మళ్ళీ గద్దించేడు.

పోలిగాడి పెదవులు ఆడుతున్నాయి కాని, మాటలు మాత్రం పైకి రాలేదు.

'నిజం సెప్పెయ్యి—నిన్నేం సెయ్యను—' అంటూ రాముడు, పోలిగాడి భుజంతట్టేడు.

పోలిగాడు, విషయమంతా నిమ్మదిగా చెప్పేసేడు.

'ఊఁ, అబ్బాయిగోరి కత అంతకాడ కొచ్చిందన్నమాట - అయితే కీచకవద సెయ్యాల్సిందే - ' అన్నాడు రాముడు కోపంతో.

'ఔనౌను మావా, తప్పక సెయ్యాల్సిందే' తాళం వేసేడు మొనగాడు.

అందరూ 'బలే, బలే' అంటూ చంక లెగరేసేరు.

పోలిగాడు, బిక్కు బిక్కు మంటున్నాడు.

"ఒరె పోలిగా, నేను సెప్పినట్టు సేత్తావురా ?" అడిగేడు రాముడు. పోలిగాడు తల వూపేడు.

'అబ్బాయిగోరికాడ కెల్లి, 'సుబ్బి వొప్పుకుందని, మిమ్మల్ని సీకటపడ్డాక, జొన్న చేలో మంచకాడకు రమ్మందని' సెప్పాలి-ఏరా మాట్టాడవేం ?'

పోలిగాడు మళ్ళీ తల ఊపేడు.

'ఇంకేమన్నా సెప్పేవో, నీతల ఎగిరిపోతాది తెలుసా ?'

పోలిగాడు మళ్ళీ తల ఊపేడు.

'అవును కాని మామా, అబ్బాయిగోరు కీచకుడైతే, మరి భీమసేనుడో?' అడిగేడొకడు.

'మన రాముడేరా, తెలివితక్కువోడా.' తెలియజేసేడు మొనగాడు.

రాముడు 'ఔ'నన్నట్లు తల పంకించేడు.

'మరి, దౌపదో?'

'సుబ్బి లేదంట్రా.'

రాముడి ముఖంలోకి చిరునవ్వు ప్రాకింది.

'బీముడు రాముడనుకో; మరి, దౌపదికి తక్కిన నలుగురేరీ అని ?' అడిగే డొకడు అమాయకంగా.

రాముడి ముఖం జేవురించింది.

'ఒరి సవటనాగమ్మా ! బీముడు రాముడైతే, దౌపది సీత కాదంట్రా.' చిక్కు విప్పేడొకడు.

రాముడు నవ్వుకున్నాడు.

'ఒరే పోలిగా, నేను సెప్పినట్టు సెయ్యక పోయావో - నా సంగతి తెలుసా?' అంటూ పోలిగాణ్ణి మళ్ళీ ఓసారి హెచ్చరించి, రాముడు వెళ్ళిపోయేడు.

మర్నాడు సూర్యుడు, చెరువుగట్టు అవల జొన్నచేలో మాయమయ్యేడు. ముదిరిన జొన్నకంకులమీదనుంచి గాలి తెరలు సన్నగా, చల్లగా, కమ్మగా వీస్తున్నాయి. పొగలంతా; పంగల కర్రా, ఓ సంచినిండా చిన్న చిన్న రాళ్ళూ పుచ్చుగుని, చేనంతా తిరుగుతూ పిట్టల్ని పారద్రోలడంతో అలసిన చేలకాపర్లు, భోంచేసి రావడానికి ఇంటికి పోతున్నారు. ఠీవిగా రాముడు జొన్నచేలో నిర్ణిత ప్రదేశానికి జేరేడు. అప్పటికప్పుడే, పోలిగాడి పరివారమంతా అక్కడే వున్నారు.

'ఒరి మీ తల సిగగొయ్య, మీరంతా ఎందుకురా యీడ?' రాముడు అడిగేడు వాళ్ళని.

'మరి మేమంతా ఉపకీచకులం కామేటి మామా.' అన్నాడొకడు సగర్వంగా.

'అయితే సామీదకే దెబ్బలాట కొత్త రన్న మాట?'

'కాదులే మామా, అడి కసలు కతే తెల వదు - మనమంతా కోతులమనుకున్నాం కాదంట్రా'

'అయితే రేపటికి ఒక్క జొన్నకంకు కూడా మిగలదన్నమాట'

'మామా, వద్దువద్దంటూంటే వినకుండా, ఆ నత్తోడు నాలుగు కంకులు కోసేసాడు మామా'

'పోరా, నువ్వుమాత్రం—'

'ఒరే, యింకెవడేనా జొన్నకంకి ముట్టు కున్నాడో సచ్చినాడన్నమాటే- తెలుసా.' అంటూ రాముడు ఆజ్ఞాపించేడు.

'శా, శా, మాకెందుకేటి మామా, కోసి నవికూడా నువ్వే తీసుగో' అన్నాడొకడు. రాముడి దగ్గర పాతిక ముప్పై కంకులు పోగుపడ్డాయి అందులో ఓ కంకి తీసి నము లుతున్నాడు రాముడు. తక్కినవాళ్ళంతా అదే పని చేస్తున్నారు.

ఇక, వీరాస్వామి కూడా చీకటి పడు తూండగానే బయలు దేరేడు. ఎదురుగా తెలుకులు మనిషి శకునం! అప్రయత్నంగా కాస్సేపు కూర్చుని, మళ్ళీ బయలుదేరేడు. శరీరమంతా కొద్దిగా కంపిస్తోంది. మనస్సు పరిపరివిధాల పోతోంది ఎలాగైతే నేం జొన్న చేను జేరుకున్నాడు. వీరాస్వామి జాడ తెలియగానే రాముడు, 'ఒరే, మీ రంతా పోయి కిక్కురు మనకుండా దాం కోండిరా' అని ఆజ్ఞాపించేడు. క్షణంలో అంతా జొన్న చేలో మాయమైపోయేరు రాముడు, దుప్పటీ ముసుగువేసుకుని పడు కున్నాడు వీరాస్వామి మెల్లిగా దగ్గరకు వచ్చేడు. సుబ్బి పడుక్కుని వుంది! పాపం, తనకోసం ఎంతసేపటినుండి కాచుకుని వుందో? మాయముండా శకునం రాకుంటే, ఇంతకంటె ముందుగా నే వచ్చి వుండే వాడు. ఇంకా దగ్గరగా వెళ్ళి, నిమ్మదిగా దగ్గేడు సుబ్బి కదల్లేదు. 'సుబ్బీ! నాసుబ్బీ! ముద్దులసుబ్బీ! నీ కోసం చేతితో చేసిన మీఠాయివుండలు తెచ్చేను చూడు—'

అంటూ ముసుగు తీసేడు. చూస్తే ఏముంది' సుబ్బికాదు. రాముడు!! వీరాస్వామికి మతిపోయింది. ఏమి చెయ్యాలో తోచక, రాతిబొమ్మలాగ నిలబడిపోయేడు. రాముడు లేచి, వీరాస్వామి జుట్టుపట్టుకుని, దవడలు రెండూ వాయిస్తున్నాడు. మన కీచకుడు మాత్రం ప్రతిఘటించ దలచుకో లేదు! చుట్టూ దాక్కున్న వాళ్ళంతా ఆపుకోలేక గొల్లుమని నవ్వేసేరు వీరాస్వామి బిక్క చచ్చిపోయేడు

'ఏరా, మరి కీచకుడు ముద్దయిపోలే దేరా?' అడిగేడొకడు ప్రక్కనున్నవాణ్ణి.

'మొహాం ముద్దవలేదంట్రా' అన్నాడు ప్రక్కనున్నవాడు

'అదేం గొప్పేటి? నేనే భీముసేనుణ్ణయి తేనా—' అంటూ అప్పుడే భీముణ్ణైపోయి నట్లు భావించుకుని ప్రక్కనున్నవాడి వీపు మీద ఓ గుద్దువేసేడు. ప్రక్కనున్నవాడు వూరుకుంటాడా? 'ఒరే, నువ్వేటి భీమసేను డవేటి - నేనురా భీమసేనుణ్ణి,కీచకొడవూ!' అంటూ కలియబడ్డాడు. ముష్టి యుద్ధం ప్రారంభమయింది. అంతటితో ఆగితే బాగానేవుండు. అక్కడవున్న వాళ్ళంతా, ఎవరికివారే భీమసేనుడుగా భావించి, ఎదుటివాణ్ణి కీచకొగనుగా చెయ్యాలని ప్రయత్నించేరు. అందరిముఖం, ఇంచుమించు వీరాస్వామి ముఖంలాగ తయారయింది ఉపకీచకులనుకున్నందుకు ఊత్తినే పోతే ఎలాగమరి? రాముడు, 'పోరా, పో- మళ్లీ సుబ్బిని తలసుకున్నావో చంపేత్తా, తెలుసా—పో' అంటూ వీరాస్వామి జుట్టు వదిలేడు. తెల్లవారేసరికి, వీరాస్వామి ఆ వూళ్ళోలేడు. అంతే, ఆనాటికి ఈనాటికి, వీరాస్వామి మళ్ళీ అవూరి పొలిమేర తొక్కలేదు ఒట్టు. ★

ఆమధ్య ఒకరోజు ఏమీ తోచక మా యింట్లో అటక మీదవుండే పాత పుస్తకాల బుట్ట క్రిందికి దించి, ప్రతిపుస్త కమూ, ప్రతి కాయితమూ తిరగ వెయ్యటం మొదలు పెట్టాను.

ఒక పాతపుస్తకంలో,మా యింటి పేరుగల వ్యక్తి ఎవరో సింహళద్వీపంలో నూరేళ్ళ క్రితం వున్నట్లు వ్రాయబడి వుంది మా వంశీకులందరినీ గూర్చిన భోగట్టా పోగు చెయ్యాలన్న పట్టుదలతో, వెంటనే ఒక కార్డుముక్క తీసి సింహళ ప్రభుత్వానికి ఫలాని పేరుగల వ్యక్తి ఫలాని సంవ త్సరంలో మీ దేశంలో వున్నట్లు చదివాను కనుక, ఆయనను గురించిన యితర భోగట్టా ఏదైనా ప్రభుత్వ రికార్డులలో వుంటే పంపవల సిందనీ, అందుకు అయ్యే ఖర్చు ఏదైనా వుంటే యిచ్చు కోగలననీ ఒక జాబు వ్రాశాను.

రెండు నెలలు తరువాత సింహళ ప్రభుత్వంవారు నా పేరట ఒక కవరు పంపిం చారు.అందులో యిలావుంది.

"ఫలాని పేరుగల వ్యక్తి ఫలాని సంవత్సరంలో యిక్కడే వున్నట్లు మా రికార్డులద్వారా ఋజువైంది. ఆ వ్యక్తి ప్రభు త్వానికి రు. 3500 దాకా పన్ను ఎగవేసి వున్నట్లు కూడా తేలింది.

కాబట్టి మీరు ఆ మొత్తాన్ని, యీ భోగట్టా అంతా వెదకటానికి అయిన ఖర్చుకుగాను రు. 250/-నీ వెంటనేమాకుపంపవలసింది."

నీచాతినీచుడు

(11-వ పేజీ తరువాయి)

తకుండానే - "లేదు. వుత్తరం ఏముఖంతో రాయను? ఏమని వ్రాయను? నేనిక్కడేం మహాకార్యం వెలగబెడుతున్నానని తెలియజెయ్యను. నేవుత్తరం వ్రాయడంవల్ల నాతల్లిగ్గాని, మరొకరిగ్గాని నిండేదేమిటి? ఆ వుత్తరం చూచిన దగ్గర్నుంచీ-నన్నూ, నా అసమర్థతనీ వెయ్యిసార్లు తిట్టి - తమరక్తంలో భాగం యిలా నీచుడైపోయాడని కడుపు నెరువుచేసుకోవడమేగా ఫలితం? ఒకళ్ళకింత పెట్టలేక పోగా - దుఃఖపెట్టడం దేనికి?" అన్నాడు - ఎంతో కణికే పెదేలు కరుచుకుంటూ

గంగయ్య "అయితే - యిక అయినవాళ్ళకి వుత్తరమూ వెయ్యక, వళ్ళి చూడక పోతే ఎలాగురా? మానవ సంబంధాలింతేనా?" అని గద్దించాడు పున్నయ్య "మానవత్వం!? నాలోనూ మానవత్వమున్నదని ఎలా రుజూచేసుకోను రక్త సంబంధీకులకు కష్టంవచ్చినప్పుడు తృణమాత్రమైనా ఆదుకునేశక్తి నాకేది? ఏనాటికైనా నా తెలివితేటలు నాస్థితిని బాగుపరుస్తాయనీ; ఆనాటైనా తగినంత సంపాదించుకుంటూ నేనూ మనిషిననీ; అప్పుడుగాని నాలోని మానవత్వం రుజూగాదనీ అనుకుంటున్నాను" అని నూతిలో మనిషిలా చెప్పాడు,

గంగయ్య "ఎవ్వేవో ఆర్థిక సిద్ధాంతాలతో సాకులు వెదుకుతున్నావుగాని— ఒక్కసారి వెళ్ళి తల్లినీ, అన్ననూచూచి రావాలంటే రెండురూపాయలు ఖర్చుపెట్టలేవట్రా? వాళ్ళైనా నిన్ను పెట్టమనీ పొయ్యమనీ రొక్కించేవాళ్ళు కాదయ్యే. ఆ నాయనమ్మ దినానికైనా వెళితే నలుగుర్లోనూ మాట దక్కేదిగా" అని చివాట్లు ధోరణిలో అన్నాడు పున్నయ్య కన్నీళ్ళు తుడుచుకుని "గెంకగాగు, అయిదు ఖర్చు పెట్టుకుని వెళ్ళొస్తాను కాని లాభం ఏమిటి? అయిదారేళ్ళనుంచీ తల్లికి కానీ యివ్వని నన్ను ఎవరు మెచ్చుకుంటారు? ఎందుగ్గాను ఎవరూ తిట్టకుండా వుండగల్రు? ఇన్ని వుద్యోగాలుచేసి అర్ధాంతరాన వదులుకుని కుటుంబంతో కష్టాలు పడుతున్నందుకుకూడా - నన్ను వెకిలి వెధవాయనీ, రాలుగాయనీ, మదమెక్కిన మూర్ఖుడనీ తిట్టకుండా వుంటారుగదా? కులం చెడబుట్టాననికూడా ఎన్నోసార్లన్నారు. మళ్ళా యీ సవాలక్ష తిట్లూ తినేందుకేగా నే వెళ్ళవలసింది?

"తిట్లు తింటే వచ్చిన నష్టంకూడా లేదు యిన్నీ సహించడానికి సిద్ధపడివున్నాను - వుండక చేసేదీలేదు కాని, యిన్నీ ఎరిగుండీ కూడా నే వెళతానే అనుకోండి అందువల్ల జరిగే కర్మాదికాలు యింకా విజయవంతమౌతాయా, యింకా ఎక్కువమంది తృప్తిపడతారా, యింకా ఏమైనా ప్రయోజనంవుందా? ఏమీలేదు నే వెళ్ళినా వెళ్ళకపోయినా ఒకటే. పైగా నే వెళ్ళాక నన్ను చూచినంతనే మనసులోవున్న కోపాన్నీ, వేదనల్నీ అగ్నిపర్వతాల్లా బదిలు చేసేవాళ్ళుకూడా వున్నారు నే కనిపించడంవల్ల వాళ్ళకి వేదనమీరడంతప్ప-మరే ప్రయోజనమూ లేదు ఇవన్నీ తెలిసుండీ కూడా నే నెలా వెళ్ళేది??" అని తెల్లముఖంతో ప్రశ్నించాడు

గంగయ్య చొక్కా గుండీలు సరిచేసుకుని "అయినా- తల్లిని యింతకాలం చూడకుండా ఎలా వున్నావురా?" అంటూ లేచాడు. పున్నయ్య "వుండక చెయ్యగలిగేదేమిటి? దైనికావసరాలకే చాలని జీతం... వెనకాముందూ చూచేవాళ్ళులేరు. కొడుక్కి చొక్కా కుట్టించాలంటే నెలరోజులు నెయ్యి మానుకోవాల్సిన స్థితి ఇలాంటి హీనుణ్ణి - ఏవిధంగా వంశ మమకారం, గౌరవ ప్రపత్తులూ చూపగల్ను? నలుగురకూ కనిపించే మంచిపని - నాబోటి వాళ్ళకెలా సాధ్యం??" అంటూ ముక్కు చీదేశాడు

*　*　*

వారం రోజుల తర్వాత పున్నయ్యకో వుత్తరం వచ్చింది అందులో - " ఆ నీచపు వెధవింటి కెందుకెళ్ళావ్?- ఆ దురాగ్రగుడింట్లో ఎలా భోంచేశావ్?? నీబోటి వాళ్ళని కూడా బోయ్‌కాట్ చెయ్యాలి బంధుమిత్రులందరూ. ఇలా లమమాటలన్నాడు మీ మేనమామ - నన్ను " అని వ్రాశాడు గంగయ్య

★

కాలక్షేపం

(5-వ పేజీ తరువాయి)

చూపించండని నవాబు కొడుకులు జవాబు చెప్పారు అప్పుడుభరిణలోతొమ్మిదండ్లుగా దాచిన పాతనవాబు గడ్డంలోని వెంట్రుకను తీసి కొడుకుల ముందు పెట్టి "యిదే వారి పవిత్రప్రమాణాధారం" అన్నాడు

తమ తండ్రిగారి గడ్డంలోని వెంట్రుకను అంతగౌరవంగా దాచియుంచిన ఆ భూసురోత్తమునకు భూరివిరాళి మిచ్చి తమ గురుభావం పూర్తిగా చూపించారు

ఆ నవాబు కొడుకులు ఆ బ్రాహ్మణుని దగ్గర అసత్యంలేదని గ్రహించారు నవాబు మాట అసత్యం కాదని ఆ బ్రాహ్మణుడు విశ్వసించాడు ఈవిధమైన పరస్పర సత్య విశ్వాసంతోనే ప్రభువులు ప్రవర్తించాలి అని సత్య హరిశ్చంద్రుని కాలంలో విశ్వామిత్రుడు బోధించాడు. సత్యమున, అహింసను మరొకసారి ప్రభుత్వాధిపతులకూ ప్రజలకూ బోధించడానికి మహాత్ముడు అవతరించాడు అటువంటి మహాత్ముడు అవతరించి సిద్ధిపొందిన యీ భారతదేశానికి ప్రపంచంలోని ఏదేశంనుంచి ఎంత గొప్పవాడు వచ్చినప్పటికీ ఢిల్లీలో దిగి నమస్కరించవలసిన పుణ్యక్షేత్రము రాజఘాటులోని మహాత్ముని సమాధి ఈకాలంలో నృపతులకు లేని గౌరవం యతులకుఉంది. మహారాజులకు లేని గౌరవం మహాత్ములకు ఉంది


యతుల విభూతిదాల్చిన భారతభూమిలో ప్రజాహృదయమును పరిపాలించేది మహాత్ముడేగాని మహారాజు కాడు అందువల్లనే-

"వినయము సేయవేని పృథివీవర
సాగదమీ తురంబునన్"

అని యతీంద్రుడు రాజేంద్రుణ్ని యీ భరత ఖండంలో ధిక్కరించగలడు ఇది యతిరాజుల రాజ్యంగాని రాజుల రాజ్యం కాదు ఈదేశంలో రాజుకు యతిరాజుకు ఆర్థిక సమత్వం ఉండనక్కరలేదు ఆధ్యాత్మిక సంబంధ సమాన ప్రతిపత్తీ, సమత్వమూ కావాలి మన సామ్యవాదం ఇది. ఈ పారమార్థిక సామ్యవాదంలో ఆర్థిక సామ్యవాదం జీర్ణించి అంతర్గతంగా ఉంది. ధనికవాదాన్ని భారతదేశం ఏనాడో ఖండించి, "ధనపతివీవు, మేము వివిధశ్రుతి పుంజ పదార్థతత్వశాసనులము;—" అనే మాట శాసనప్రమాణం చేసి, చలామణీ చేసింది

★

Edited, Printed & Published by S Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras



నౌ కా వి హా రం

ఫొటో :—శ్రీ సి. సీతారాం (మద్రాసు.)